www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

2024

ANDHRAJYOTHI

నూతన సంవత్సర శుభాకాంక్షలు

• కొత్త ఏడాదికి కొంగొత్త ఆశలతో..



మూస్తూమూస్తుండగానే ఏడాది గడిచిపోయింది! 2023 కాలగర్భంలో కలిసిపోయి 2024 వచ్చేసింది. గడచిన ఏడాది కాలంలో ఎన్నో తీపి జ్ఞాపకాలు.. చేదు సంఘటనలు.. మరెన్నో సంచలనాలు! 'కొత్తకు ఎపుడూ స్వాగతం.. పాతకో వందనం' అన్నట్టు.. ఆ పాత జ్ఞాపకాలకు బైబై చెప్పి, 2024కు స్వాగతం పలుకుదాం.

సోమవారం | 1-1-2024 | పేజీలు: 18 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 257 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: పంచమి మ. 2.29 తదుపరి షష్ఠి; నక్షత్రం: మఖ ఉ. 8.37 తదుపరి పుబ్బ; వర్జ్యం: సా. 5.39-7.27; దుర్ముహూర్తం: మ. 12.41-1.25, మ. 2.53-3.37; అమృతఘడియలు: తె. ఉ. 7.43, తె. 4.29-6.17; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 5.48 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



విశాఖలో గ్యాంగ్ రేప్!?

- 17 ఏళ్ల బాలికపై పది మంది అత్యాచారం
- ప్రేమించిన ప్రియుడే వంచించాడు
- స్నేహితుడితో కలిసి ఆమెపై అఘాయిత్యం
- ఓదార్చినట్టు నటించి మరొకడి దుర్మార్గం
- పలు హోటళ్లలో మిత్రులతో కలిసి అకృత్యం
- వారం రోజులపాటు బాలికకు నరకం

2

గుట్టుగా దోపిడీకి షురూ!

ఇసుక ఒప్పందాల్లో జగన్నాటకం

- డిసెంబరు 11న ప్రతిమ, జీసీకేసీతో అగ్రిమెంట్
- ఆ రోజు నుంచే అమ్మకం బాధ్యతలు
- కానీ 22న కలెక్టర్లకు గనుల శాఖ ఉత్తర్వులు
- రెండేళ్ల కాలవ్యవధితో కాంట్రాక్టు
- పర్యావరణ అనుమతులపై సందేహాలు
- ఈ కంపెనీలు ఇచ్చే రాయల్టీ ఎంతో?
- వివరాలు రహస్యంగా ఉంచిన సర్కారు

13

అదా...సంగతి!

- పద్మాజనార్దన్‌రెడ్డిపై జగన్‌కు వల్లమాలిన ప్రేమ
- వివేకా కేసులో ఏ5 శివశంకర్‌రెడ్డికి వియ్యంకుడు
- సీపీడీసీఎల్ సీఎండీగా మూడోసారీ పొడిగింపు?
- మంత్రి వ్యతిరేకించినా బుజ్జగించే యత్నం

12

ప్లీజ్.. ఏపీకి రావొద్దు చెల్లీ!

"నేను కష్టాల్లో ఉన్నప్పుడు నా ముఖం చూడలేదు కానీ.. ఏపీకి వస్తానంటే రాయబారానికి వచ్చారా? నన్ను రోడ్డు మీద వదిలేసినప్పుడు కుటుంబంలో నేను ఒకరిని అన్న విషయం గుర్తుకురాలేదా?" -షర్మిల ఆగ్రహం

షర్మిలకు జగన్ రాయబారం?

- బాబాయ్ సుబ్బారెడ్డికి పురమాయింపు.. బుజ్జగించేందుకు వైవీ ప్రయత్నం
- కుదరదు పొమ్మన్న షర్మిల.. మాకు అన్యాయం జరిగితే రాయబారం నడపలేదే?
- మేం రోడ్డున పడితే పట్టించుకోలేదు.. ఎంతో మానసిక క్షోభ అనుభవించా
- ఇప్పుడు జగన్‌కు ఇబ్బంది అవుతుందని నా దగ్గరకు వచ్చారా?
- ఇదేమి న్యాయం? కుదరదు.. నా మానాన నన్ను బతకనివ్వండి
- కుండబద్దలు కొట్టిన జగన్ సోదరి.. షర్మిలకు ఏపీ కాంగ్రెస్ బాధ్యతల వార్తతో తాడేపల్లి విలవిల



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సోదరి వైఎస్ షర్మిల ఏపీ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టబోతున్నారన్న వార్తతో 'తాడేపల్లి' విలవిల్లాడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో షర్మిల అడుగుపెడితే జగన్‌కు రెక్కలు తెగినట్లేనని బెంబేలెత్తుతోంది. 'జగనన్న బాణం' తాడేపల్లి తలుపులు బద్దలు కొట్టుకొని తనపైకే దూసుకొస్తుండటంతో జగన్‌లో తీవ్ర కలవరం మొదలైంది. సోదరి షర్మిల ఏపీ వైపు రాకుండా నచ్చజెప్పడానికి జగన్ రాయబారం పంపినట్టు తెలుస్తోంది. వైసీపీ సీనియర్ నేత, బాబాయ్ వైవీ సుబ్బారెడ్డిని రంగంలోకి దించినట్టు సమాచారం. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు... ఏపీలో జగన్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తే అది కుటుంబంలో చిచ్చు పెట్టినట్లవుతుందని, అది ఎవరికీ మంచిది కాదని షర్మిలకు సుబ్బారెడ్డి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ, ఆమె తీవ్రస్థాయిలో విరుచుకుపడినట్లు తెలిసింది. "ఇన్నాళ్లూ మేం రోడ్డున పడితే ఎవరు పట్టించుకున్నారు? నాకు అన్యాయం జరిగిందని నెత్తీ నోరూ బాదుకుంటే ఆ రోజు మీరెందుకు రాయబారం నడపలేదు? నేను రోడ్డున పడితే మీకు సరదాగా ఉందా? నేను కష్టాల్లో ఉన్నప్పుడు నా ముఖం

మిగతా 12వ పేజీలో...



8 దేశాల సమయాలను సూచించే

గోడ గడియారం

అయోధ్య రామాలయానికి బహుమతిగా ఇచ్చిన లఖ్‌నవూ కూరగాయల వ్యాపారి

లఖ్‌నవూ, డిసెంబరు 31: ఉత్తరప్రదేశ్ లఖ్‌నవూకు చెందిన అనిల్ కుమార్ సాహూ అనే ఓ కూరగాయల వ్యాపారి ఎనిమిది దేశాల సమయాలను సూచించే 75 సెంటీమీటర్ల గోడ గడియారాన్ని అయోధ్య రామాలయానికి కానుకగా ఇచ్చారు. ఈ గడియారం దుబాయ్ (యూఏఈ), టోక్యో (జపాన్), మాస్కో (రష్యా), బీజింగ్ (చైనా), సింగపూర్, మెక్సికో, వాషింగ్టన్, న్యూయార్క్ (అమెరికా)లకు చెందిన సమయాలను ఒకేసారి చూపిస్తుందని ఆయన వెల్లడించారు.

ఎర్ర సముద్రంలో మళ్లీ అలజడి

- డెన్మార్క్ నౌకపై హౌతీల దాడి
- రెండోసారి ఎదుర్కొన్న అమెరికా
- హౌతీల మూడు బోట్లు ధ్వంసం

న్యూఢిల్లీ/బీరుట్, డిసెంబరు 31: ఎర్ర సముద్రంలో మళ్లీ అలజడి రేగింది. శనివారం రాత్రి డెన్మార్క్‌కు చెందిన నౌక 'ద మెర్క్స్ హాంగ్‌ఝూ' సరుకు రవాణా నౌకపై హౌతీలు క్షిపణి దాడి చేశారు. పది రోజుల క్రితం అమెరికా నేతృత్వంలోని వివిధ దేశాల భద్రత కూటమి 'ఆపరేషన్ ప్రాస్పెరిటీ గార్డియన్' నిఘా నడుమ 1,200 నౌకలు ఎర్రసముద్రాన్ని సురక్షితంగా దాటగా.. డెన్మార్క్ కూడా ఈ కూటమిలో చేరిన రెండో రోజే ద మెర్క్స్ హాంగ్‌ఝూపై దాడి జరగడం గమనార్హం..! హౌతీలు ప్రయోగించిన మరో రెండు బాలిస్టిక్ క్షిపణులను తమ యుద్ధ నౌక యూఎస్ఎస్ గ్రావ్లీ కూల్చివేసినట్లు అమెరికా వెల్లడించింది. తమ సైనికులు జరిపిన ఎదురు కాల్పుల్లో హౌతీలకు చెందిన మూడు పడవలు ధ్వంసమయ్యాయని పేర్కొంది. కాగా, అరేబియా సముద్రంలో నిఘాను మరింత ముమ్మరం చేసినట్లు భారత నౌకాదళం వెల్లడించింది.

రామమందిరం పేరిట లూటీ!

- క్యూఆర్ కోడ్‌తో భక్తుల నుంచి విరాళాలు
- సైబర్ నేరగాళ్లపై చర్యలు తీసుకోండి
- యూపీ పోలీసులకు వీహెచ్‌పీ ఫిర్యాదు

న్యూఢిల్లీ, డిసెంబరు 31: అయోధ్యలో రామమందిరం ప్రతిష్ఠకు ముహూర్తం దగ్గర పడుతుండగా సందట్లో సడేమియాలా భక్తులను దోచుకోవడానికి సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తులు వేస్తున్నారు. ఆలయం కోసం విరాళాలు ఇవ్వాలని కోరుతూ సైబర్ నేరగాళ్లు సామాజిక మాధ్యమాల్లో సందేశాలు పంపుతున్నారని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) హెచ్చరించింది. ఈ సందేశాలకు క్యూఆర్ కోడ్ జత చేస్తున్నారని, దాన్ని స్కాన్ చేసి డబ్బులు పంపితే అవి నేరుగా మోసగాళ్లకు చేరతాయని తెలిపింది. ఇటువంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ యూపీ పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు వీహెచ్‌పీ అధికార ప్రతినిధి వినోద్ బన్సల్ చెప్పారు. ఆ ఫిర్యాదు కాపీని ఆయన 'ఎక్స్'లో షేర్ చేశారు. దీన్ని కేంద్ర హోంశాఖకు, సీఎం యోగి ఆదిత్యనాథ్ దృష్టికి కూడా తీసుకువెళ్లామని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్.. నిధుల సేకరణ కోసం ఎవరికీ అనుమతి ఇవ్వలేదని స్పష్టంచేశారు. ఇటువంటి వారి పట్ల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పాతకో వందనం.. కొత్తకు స్వాగతం

అదేదో సినిమాలో రాజేంద్రప్రసాద్ 'అప్పుడే తెల్లారిందా?' అన్నట్టు.. చూస్తూచూస్తూండగానే ఏడాది గడిచిపోయింది! 2023 కాలగర్భంలో కలిసిపోయి 2024 వచ్చేసింది. గడిచిన ఏడాది కాలంలో ఎన్నో తీపి జ్ఞాపకాలు.. చేదు సంఘటనలు.. మరెన్నో సంచలనాలు! 'కొత్తకు స్వాగతం.. పాతకో వందనం' అన్నట్టు.. ఆ పాత జ్ఞాపకాలకు బైబై చెప్పి, 2024కు స్వాగతం పలుకుదాం. తెలుగువారి సంవత్సరాది ఉగాదికి పంచాంగం చూసుకున్నట్టే.. అంతరిక్ష, ఆర్థిక, వాతావరణ, సాంకేతిక పరిజ్ఞాన తదిత ర రంగాల్లో మన భవిష్యత్తు ఎలా ఉండొచ్చో ఈ ఆంగ్ల సంవత్సరాది రోజున ఒక అంచనా వేసుకుందాం.



ఎన్నికల నామ సంవత్సరే..

ప్రజాస్వామ్య దేశంలో అతి పెద్ద పండగ.. ఓట్ల పండగే. ఈ ఏడాది.. భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా 40 దేశాల్లో ఎన్నికలు జరగనున్నాయి. జనవరిలో తైవాన్‌తో మొదలుపెడితే.. నవంబరులో అమెరికా అధ్యక్ష ఎన్నికల దాకా ఈ ఓట్ల పండగ సందడి ప్రపంచం నలుమూలలా కొనసాగనుంది. మనదేశం విషయానికి వస్తే.. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో జయకేతనం ఎగురవేసిన బీజేపీ సార్వత్రిక ఎన్నికల్లోనూ ఆ జోరు కొనసాగించి మరింత బలపడుతుందా? లేక ఇండియా పేరుతో కూటమి గట్టి ఎలాగైనా అధికారంలోకి రావడానికి పావులు కదుపుతున్న కాంగ్రెస్‌కు కాలం కలిసొస్తుందా?.. వేచి చూడాలి. ఒకవేళ బీజేపీ గెలిస్తే.. వరుసగా మూడుసార్లు సొంత బలంతో అధికారంలోకి వచ్చిన తొలి కాంగ్రెసేతర పార్టీగా దేశచరిత్రలో నిలిచిపోతుంది. సార్వత్రిక ఎన్నికలతోపాటు జరుగుతున్న ఏపీ ఎన్నికలపైన కూడా అందరి దృష్టీ ఉంది. అలాగే.. ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగబద్ధమేనంటూ తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు 2024 సెప్టెంబరు 30లోగా కశ్మీరులో ఎన్నికలు జరపాలని ఆదేశించిన నేపథ్యంలో ఆ ఎన్నికలు కూడా ఈ ఏడాది జరుగుతాయి.

రోదసిలో రయ్ రయ్..

హాలీవుడ్ సూపర్‌హిట్ సినిమా అవతార్ బడ్జెట్‌లో ఆవగింజంత ఖర్చుతో చంద్రయాన్-3 ప్రాజెక్టును విజయవంతంగా నిర్వహించి 2023లో సత్తా చాటిన ఇస్రో.. 2024లోనూ మరిన్ని మైలురాళ్లు అందుకునే ప్రయత్నాల్లో ఉంది. అందులో భాగంగానే.. విశ్వాంతరాళాల నుంచి వచ్చే ఎక్స్ కిరణాల అధ్యయనానికి సంబంధించిన 'ఎక్స్‌రే పోలారిమీటర్ శాటిలైట్' ప్రయోగాన్ని ఏడాదిలో తొలిరోజే (జనవరి 1న) నిర్వహించడానికి రంగం సిద్ధం చేసుకుంది. అలాగే, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌తో కలిసి జనవరి లేదా ఫిబ్రవరిలో 'గగన్‌యాన్-1' మిషన్‌ను నిర్వహించే ఏర్పాట్లు చేస్తోంది. ఈ మిషన్‌లో భాగంగా ముగ్గురు వ్యోమగాములను రోదసిలోకి పంపనుంది. ఇంకా.. మంగళ్‌యాన్‌కు కొనసాగింపుగా మంగళ్‌యాన్-2 (మార్స్ ఆర్బిటర్ మిషన్-2) నిర్వహించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. శుక్రుడిపై వాతావరణం గురించి తెలుసుకునేందుకు శుక్రయాన్-1 (వీనస్ ఆర్బిటర్ మిషన్-1) ప్రయోగానికీ ఇస్రో ఏర్పాట్లు చేస్తోంది. అలాగే.. మనదేశంలో అంతరిక్ష రంగానికి సంబంధించి ప్రైవేటు స్పేస్ కంపెనీల హవా పెరుగుతోంది. 2023లో దేశంలో స్పేస్ స్టార్టప్‌ల సంఖ్య.. అంతకుముందు ఏడాదితో పోలిస్తే రెండు రెట్లు పెరిగిందని డెలాయిట్ కన్సల్టెన్సీ డేటా చెబుతోంది. పిక్సెల్, ధ్రువ స్పేస్ వంటి సంస్థలు అంతరిక్ష పరిశోధనలను కొత్తపుంతలు తొక్కిస్తున్నాయి. వీటి జోరు మరింతగా పుంజుకుంటుందని అంచనా.

సూపర్ ఎల్‌నినో

2023లో ఎల్‌నినో కారణంగా మనదేశంలో లోటువర్షపాతం నమోదవుతుందని వాతావరణ నిపుణులు అంచనావేశారుగానీ.. సాధారణ వర్షపాతమే నమోదైంది. కానీ, 2024లో అలా ఉండబోదని.. దక్షిణ అమెరికా వద్ద పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల జలాలు వేడెక్కడం వల్ల సూపర్ ఎల్‌నినో ఏర్పడే ప్రమాదం ఉందని నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్‌కు చెందిన క్లైమేట్ ప్రెడిక్షన్ సెంటర్ అంచనా వేసింది. ఈ ఎల్‌నినో ప్రభావం దక్షిణ భారతదేశం కన్నా ఉత్తరాదిపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా.

అంతకు మించి.. వేడి!

పారిశ్రామిక యుగానికి ముందు ఉష్ణోగ్రతలతో పోలిస్తే.. ప్రపంచవ్యాప్తంగా ఉపరితల ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెల్సియర్ మించకుండా చూసుకోవాలని 2015లో ప్రపంచ దేశాలన్నీ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందుకోసం కర్బన ఉద్గారాలను తగ్గించుకోవాలని.. బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిని, వాహన కాలుష్యాన్ని నియంత్రించుకోవాలని ప్రపంచదేశాలు అప్పట్లో లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఆ దిశగా భారత్ సహా పలు దేశాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. కానీ, ఎన్ని ప్రయత్నాలు చేసినా.. 2023లో జనవరి నుంచి అక్టోబరు నడుమ ఉపరితల ఉష్ణోగ్రతలు 1.4 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకున్నాయని, ఈలెక్కన 2024లో 1.5 డిగ్రీల పరిమితిని దాటేసే ప్రమాదం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. అలా భూతాపం పెరిగిపోతే భూమ్మీద మనుగడ కష్టమవుతుందని వారు హెచ్చరిస్తున్నారు.

ఆర్థికంగా ముందంజే

శతాబ్దానికి ఒకసారి వచ్చే మహమ్మారి ముప్పు.. రెండు యుద్ధాలు.. అంతర్జాతీయ ద్రవ్యోల్బణం.. సంరక్షణవాద విధానాలు.. వీటన్నింటితో గడిచిన మూడేళ్లుగా పలు దేశాలు ఆర్థిక మాంద్యంలో కూరుకుపోయాయి. భారతీయుల పొదుపు మంత్రం కారణంగా.. మన దేశం మాత్రం కొంతవరకూ వీటన్నింటినీ తట్టుకుని నిలబడగలిగింది. కానీ.. అంతర్జాతీయంగా పరిస్థితుల్లో, ద్రవ్యోల్బణంలో, కల్లోల పరిస్థితుల్లో ఇప్పటికీ పెద్దగా మార్పు లేదు. దీనికి తోడు.. ఏప్రిల్-మే నెలల్లో సార్వత్రిక ఎన్నికలు, పలు రాష్ట్రాల ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల సీజన్ అంటే సంక్షేమ పథకాలు జోరందుకునే సమయం. వీటన్నింటి నేపథ్యంలో కూడా.. భారత ఆర్థిక వ్యవస్థ తొలి ఆరు నెలలూ వృద్ధిబాటలోనే సాగుతుందని గోల్డ్‌మన్ శాష్ అంచనా వేసింది. 2024లో ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందే దేశంగా భారత్ నిలుస్తుందని అసోచాం ఇటీవలే ప్రకటించింది.


ఏఐ పిన్

గడిచిపోయిన 2023.. చాట్‌జీపీటీ, బాడ్ లాంటి 'జనరేటివ్ ఏఐ'లదేననడంలో సందేహం లేదు. కొత్త ఏడాదిలో ఈ జనరేటివ్ ఏఐ అన్ని స్మార్ట్‌ఫోన్లలోకీ చొచ్చుకురావడం తథ్యం. గూగుల్ పిక్సెల్ ఫోన్లలో ఇప్పటికే కొన్ని ఫీచర్లు అందుబాటులోకి వచ్చాయి కూడా. ఆ సంగతి పక్కన పెడితే.. 2024ని 'ఏఐ పిన్'లు ఏలబోతున్నాయని టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు. 'ఏఐ పిన్' అంటే.. ఓ చిన్న బ్యాడ్జ్ లాగా మన చొక్కాకు ధరించగలిగే మినీ కంప్యూటర్! యాపిల్ కంపెనీ మాజీ ఉద్యోగులైన ఇమ్రాన్ చౌదరీ, బెతనీ దీని సృష్టికర్తలు. ఈ ఏఐ పిన్‌ను లాంగ్వేజ్ మోడల్స్‌తో పనిచేసేలా వారు రూపొందించారు. అంటే.. దీంతో మాట్లాడి పనులన్నీ చేసుకోవచ్చు.. చేయించుకోవచ్చన్నమాట. చాట్‌జీపీటీని రూపొందించిన 'ఓపెన్‌ఏఐ'కి సీఈవోగా వ్యవహరించిన శామ్ ఆల్ట్‌మన్ లాంటివారు ఈ 'ఏఐ పిన్'కు పెట్టుబడులు పెట్టడంతో ప్రపంచమంతా దీనిపై దృష్టి సారించింది.

శాటిలైట్ టోల్‌గేట్లు

ఫాస్టాగ్‌ల ప్రవేశంతో టోల్ గేట్ల వద్ద రద్దీ చాలావరకూ తగ్గిపోయింది. దీనికి కొనసాగింపుగా.. అసలు భౌతిక టోల్‌గేట్లే లేకుండా శాటిలైట్ టోల్‌గేట్ వ్యవస్థను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని కేంద్ర మంత్రి గడ్కరీ రాజ్యసభలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ కొత్త వ్య వస్థ 2024 మార్చి నాటికి అందుబాటులోకి రావచ్చని స మాచారం. ఇందుకోసం భారత జాతీయ రహదారుల ప్రా ధికార సంస్థ శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది.

- సెంట్రల్ డెస్క్



నేడే పీఎస్ఎల్వీ-సీ58

రాకెట్ ప్రయోగం

- ఎక్స్‌పోశాట్ ఉపగ్రహంతో నింగిలోకి
- ఉదయం 9:10 గంటలకు ప్రయోగం



సూళ్లూరుపేట, డిసెంబరు 31: చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1 ప్రతిష్ఠాత్మక మిషన్లను విజయవంతంగా ప్రయోగించి 2023 ఏడాదిని ఘనంగా ముగించిన ఇస్రో.. కొత్త ఏడాదిని అదరిపోయే విజయంతో ఆరంభించాలని ఉవ్విళ్లూరుతోంది. 2024 ఆరంభం రోజునే పీఎస్ఎల్వీ-సీ58 రాకెట్ ద్వారా ఎక్స్‌రే పోలారిమీటర్ ఉపగ్రహం (ఎక్స్‌పోశాట్) ప్రయోగానికి ఏర్పాట్లు చేసింది. దీంతోపాటు మరో పది బుల్లి ఉపగ్రహాలను కూడా తక్కువ భూకక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ అంతరిక్ష కేంద్రం నుంచి సోమవారం ఉదయం 9:10 గంటలకు ఈ ప్రయోగాన్ని చేపట్టనుంది. దీనికి సంబంధించిన కౌంట్‌డౌన్‌ను ఇస్రో శాస్త్రవేత్తలు ఆదివారం ఉదయం 8.10 గంటలకు ప్రారంభించారు. కౌంట్‌డౌన్ జరిగే సమయంలో రాకెట్‌కు ఇంధనాన్ని నింపి, గ్యాస్ ఫిల్లింగ్ చేశారు. రాకెట్‌లోని అన్ని వ్యవస్థల పనితీరును శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా పరిశీలించి ప్రయోగానికి సిద్ధం చేశారు. ఇస్రో ప్రయోగిస్తున్న తొలి పోలారిమెట్రీ మిషన్ ఇదే. అమెరికాకు చెందిన నాసా 2019లో చేపట్టిన ఇమేజింగ్ ఎక్స్‌రే పోలారిమెట్రీ ఎక్స్‌ప్లోరర్ (ఐఎక్స్‌పీఈ) తర్వాత మరో దేశం చేపడుతున్న పోలారిమెట్రీ మిషన్ ఇదే కావడం గమనార్హం. ఎక్స్‌రే మూలాలను అన్వేషించడం ఈ ఉపగ్రహ ప్రధాన లక్ష్యం. దీనిద్వారా విశ్వంలోని బ్లాక్ హోల్స్, భారీ నక్షత్రాలను అధ్యయనం చేయనున్నారు.

సోషల్ మీడియాలో 'శ్రీరామ భజనలు'

- #శ్రీరామభజన్‌తో సృజనాత్మకతను పంచుకోండి
- మన్ కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, డిసెంబరు 31: అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మితమైన అయోధ్య రామ మందిరం, శ్రీరాముడిపై భజనలు, కవితలు, పాటలను సోషల్ మీడియాలో #శ్రీరామభజన్‌తో పంచుకోవాలని ప్రజలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. తద్వారా భక్తి భావం వెల్లివిరుస్తుందని.. రామతత్వం అందరికీ చేరుతుందన్నారు. మందిర ప్రారంభ నేపథ్యంలో దేశమంతా ఉత్సాహంగా ఉందని.. ఈ సంతోష క్షణంలో ప్రజలు సృజనాత్మకత భావాలను రకరకాలుగా వ్యక్తం చేస్తున్నారని, సీనియర్, వర్ధమాన కళాకారులు హృద్యమైన భజనలు రచిస్తూ ఇందులో భాగస్వాములు అవుతున్నారని, ఇలాంటివాటిలో కొన్నిటిని తాను సోషల్ మీడియాలో పోస్ట్ చేసినట్లు చెప్పారు. ఇదంతా గమనించినప్పుడు ఒకే హ్యాష్ ట్యాగ్ (#శ్రీరామభజన్) ద్వారా సోషల్ మీడియాలో ఎందుకు షేర్ చేయకూడదు? అనే ఆలోచన తనకు వచ్చిందని తెలిపారు. ఈ ఏడాదిలో చివరిదైన 'మన్ కీ బాత్'లో ఆదివారం మోదీ మాట్లాడారు. ప్రజలకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం దేశమంతా ఆత్మవిశ్వాసం, స్వయం సమృద్ధి స్ఫూర్తితో ఉందన్నారు. ఆవిష్కరణల కేంద్రంగా, ఎదురులేని శక్తిగా భారత్ ఎదుగుతోందని పేర్కొన్నారు. పర్యావరణం నుంచి వినోద రంగం వరకు మన ప్రతిభ, క్రియేటివిటీని ప్రపంచమంతా చూసిందన్నారు. ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు, డాక్యుమెంటరీ ఎలిఫెంట్ విస్పరర్స్‌కు ప్రతిష్ఠాత్మక ఆస్కార్ పురస్కారం దక్కడం మన ఘనతకు నిదర్శనమని చెప్పారు. నాటు నాటు పాటను ఆస్కార్ వరించడంతో దేశం ఉర్రూతలూగిందని మోదీ వివరించారు.

16వ ఆర్థిక సంఘం ఛైర్మన్‌గా

అరవింద్ పనగడియా

న్యూఢిల్లీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రాల మధ్య పన్నుల వాటాను నిర్ధరించడానికి ఉద్దేశించిన 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్‌గా ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త డాక్టర్ అరవింద్ పనగడియాను ఆదివారం కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ కమిషన్ కార్యదర్శిగా ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి రిత్విక్ రంజనం పాండే నియమితులయ్యారు. వైస్‌ఛైర్మన్, సభ్యులను ఇంకా నియమించాల్సి ఉంది. కొలంబియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసిన పనగడియా గతంలో నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్‌గా పనిచేశారు. వివిధ అంశాలపై 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 వరకు అయిదేళ్ల కాలానికి అమలయ్యేలా సిఫార్సులు చేయాల్సి ఉంటుంది. 2025 మార్చి 31 నాటికి నివేదికను ప్రభుత్వానికి అందజేయాలి. ఆ సిఫార్సులు 2026 ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. పన్నుల్లో వాటాను నిర్ణయించడంతో పాటు ఆదాయ వనరులను పెంచే మార్గాలను అన్వేషించడం, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి నిధులను సమకూర్చడం తదితర అంశాలపై అధ్యయనం చేసి సిఫార్సులు చేయాల్సి ఉంది.

ఆడబిడ్డలపై ఇంత నిర్దయా?

- వినేశ్ ఫొగట్‌పై ప్రధాని వైఖరి బాధించింది: రాహుల్

న్యూఢిల్లీ, డిసెంబరు 31: రెజ్లర్ వినేశ్ ఫొగట్ విషయంలో ప్రధాని మోదీ నిర్దయ వైఖరి తనను బాధించిందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. వినేశ్ తనకు ప్రభుత్వం ప్రదానం చేసిన ఖేల్‌రత్న, అర్జున అవార్డులను ఢిల్లీలోని కర్తవ్యపథ్ మార్గంలో శనివారం వదిలేసి వచ్చారు. రెజ్లింగ్ సమాఖ్యలో జరుగుతున్న పరిణామాలను ప్రధానిని ఆయన నివాసంలో కలిసి వివరించేందుకు వినేశ్ చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఆమెను ప్రధానమంత్రి కార్యాలయం చేరకముందే కర్తవ్యపథ్‌లో నిలువరించారు. నిరసనగా ఆమె తనకు లభించిన అవార్డులను అక్కడే వదిలేసి పోయారు. దీనిపై ఆదివారం రాహుల్‌గాంధీ స్పందించారు.

అమ్మకు పప్పన్నం ఇష్టం



విదేశాలకు వెళ్లిరాగానే పప్పుఅన్నం తినడానికి తన తల్లి సోనియాగాంధీ ఇష్టపడతారని రాహుల్‌గాంధీ తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా తల్లితో కలిసి ఓ వీడియోను యూట్యూబ్‌లో ఆయన విడుదల చేశారు. బత్తాయిలతో చేసిన జ్యూస్‌ను తయారుచేస్తూ రాహుల్ ఆ వీడియోలో కనిపించారు.

విశాఖలో గ్యాంగ్ రేప్?

- 17 ఏళ్ల బాలికపై పదిమంది అత్యాచారం.. ప్రేమించిన ప్రియుడే వంచించాడు
- స్నేహితుడితో కలిసి ఆమెపై అఘాయిత్యం
- వారం రోజులపాటు బాలికకు నరకం
- తండ్రి ఫిర్యాదుతో వెలుగులోకి ఘోరం
- విచారణ చేపట్టిన విశాఖ పోలీసులు

విశాఖపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విశాఖలో దారుణం జరిగింది. ఓ బాలికపై పది మంది యువకులు పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన నగరంలో కలకలం రేపింది. అత్యాచారం తరువాత షాక్‌లోకి వెళ్లిన యువతి ఒడిశాలోని స్వగ్రామానికి వెళ్లింది. ఆమె కనిపించడంలేదంటూ బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. ఆమె ఒడిశాలో ఉన్నట్టు గుర్తించి, విశాఖకు తీసుకువచ్చి వివరాలు సేకరించారు. అత్యాచారానికి పాల్పడిన యువకుల్లో కొంతమందిని అదుపులోకి తీసుకునివిచారిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిసాలోని కలహండి జిల్లా పనిముండ్ర గ్రామానికి చెందిన 44 ఏళ్ల వ్యక్తి విశాఖ నగరంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తూ కుటుంబంతో సహా కంచరపాలెంలో నివా సం ఉంటున్నాడు. ఇతని 17 ఏళ్ల కుమార్తె పోర్టు క్వార్టర్స్ సమీపంలో ఓ నేవీ అధికారి ఇంట్లో సహాయకురాలిగా పనిచేస్తోంది. గత నెల 17న పనికి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు మరుసటి రోజు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. స్వగ్రామమైన పనిముండ్ర వెళ్లినట్టు గుర్తించారు. తల్లిదండ్రులను వెంటబెట్టుకుని అక్కడకు వెళ్లి బాలికను తీసుకువచ్చారు. అప్పటికే షాక్‌లో ఉన్న బాలిక ఎవరితోనూ మాట్లాడలేదు. కోలుకున్న తరువాత తనపై జరిగిన అఘాయిత్యం గురించి శనివారం తల్లిదండ్రులకు తెలిపింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారు. ఆమె చెప్పిన వివరాల మేరకు.. పదిమంది యువకులు, పలుమార్లు అనేక హోటళ్లలో అత్యాచారానికి పాల్పడ్డారు.

మోసం చేసిన ప్రియుడు?

బాధితురాలు కొన్నాళ్ల క్రితం స్థానిక యువకుడితో ప్రేమలో ఉందని, అతడి కోరిక మేరకు ఈ నెల 17న నాలుగో పట్టణ పీఎస్ దగ్గరలోని ఓ హోటల్‌కు వెళ్లినట్టు చెబుతున్నారు. అక్కడ వీరిద్దరూ శారీరకంగా కలిసిన తరువాత, ఆ యువకుడు తన స్నేహితునికి ఫోన్ చేసి విష యం చెప్పాడు. అతను కూడా హోటల్‌కు చేరుకుని బాలికను బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ప్రేమించిన యువకుడే అతని స్నేహితునితో అత్యాచారం చేయించడాన్ని తట్టుకోలేకపోయిన బాలిక తీవ్ర మనస్తాపానికి గురై బీచ్‌కు చేరుకుని విలపిస్తుండగా, గుర్తించిన మరో వ్యక్తి (ఫొటో గ్రాఫర్ అని చెబుతున్నారు) ఓదార్చినట్టు నటించి స్నేహితుల గదికి తీసుకెళ్లాడు. ఆ గదిలో ఫొటో గ్రాఫర్‌తోపాటు మరో ఏడుగురు యువకులు బాలికను హింసించి, అత్యాచారం చేశారు. తరువాత నగర పరిధిలోని మరికొన్ని హోటళ్లు, లాడ్జిలకు తీసుకెళ్లి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు చురుగ్గా విచారిస్తున్నారు. ఇప్పటికే కొంతమంది నిందితులను అదుపులోకి తీసుకోగా, మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు.

300 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ!

- మిగిలిన 243 సీట్లు మిత్రపక్షాలకు

న్యూఢిల్లీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ముఖాముఖి పోటీ ఉన్న స్థానాలతోపాటు పక్కాగా గెలిచే అవకాశం ఉన్న స్థానాల్లోనే పోటీ చేయాలని, మిగిలిన వాటిని ఇండియా కూటమిలో మిత్రపక్షాలకు వదిలేయాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఈ మేరకు మొత్తం 543 నియోజకవర్గాల్లో 300 సీట్లకే పరిమితమై, మిగిలిన 243 సీట్లను కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు కేటాయించాలని కసరత్తు జరుపుతోంది. గుజరాత్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, అసోం రాష్ట్రాల్లో బీజేపీని, ఆయా రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలను ఒంటరిగా ఢీకొనాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇక యూపీ, బిహార్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు, జార్ఖండ్, ఢిల్లీ, పంజాబ్, తెలంగాణల్లో మిత్రపక్షాలతో పొత్తు పెట్టుకొని బీజేపీని, ఇతర పార్టీలను ఢీ కొనాలని నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. సీట్ల పంపకాలపై కసరత్తు కోసం కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన జాతీయ అలయెన్స్ కమిటీ జనవరి 4న సోనియా, మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ సమక్షంలో నివేదికను సమర్పించనుంది. దీని ఆధారంగా ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలన్న విషయంపై కాంగ్రెస్ స్పష్టతకు రానుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 52 స్థానాలలో విజయం సాధించింది. 209 నియోజకవర్గాల్లో రెండవ స్థానంలో నిలిచింది. ఈ రెండింటినీ కలుపుకుంటే 261 స్థానాలవుతాయి. వీటికి మరికొన్నింటిని చేర్చి మొత్తమ్మీద 300 స్థానాల వరకు పోటీ చేస్తే వాటిలో సగమైనా గెలిచే అవకాశాలున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఒకరు అంచనా వేశారు. కాగా, సొంతంగా ఎన్ని సీట్లకు, మిత్రపక్షాలతో కలిసి ఎన్ని సీట్లకు పోటీ చేయాలన్న దానిపై కాంగ్రెస్ దాదాపుగా ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇండియా కూటమిలో లుకలుకలు లేకుండా ఇచ్చి పుచ్చుకునే ధోరణితో వ్యవహరించాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం.

ఇండియా కూటమిలో అంతర్గత చర్చలు

ఇండియా కూటమిలోని వివిధ పార్టీల మధ్య సీట్ల పంపకాల గురించి ఇప్పటికే అంతర్గత చర్చలు ప్రారంభమయ్యాయి. ఢిల్లీలో మొత్తం 7 లోక్‌సభ స్థానాలు ఉండగా, కాంగ్రెస్‌కు 2-3 సీట్లు ఇవ్వాలని ఆమ్‌ఆద్మీపార్టీ భావిస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఢిల్లీలో బీజేపీ, ఆప్‌లను ఢీ కొని 5 స్థానాల్లో రెండవ స్థానంలో నిలిచింది. కాబట్టి, 5 సీట్లు కావాలని ఆప్‌ను కాంగ్రెస్ అడిగే అవకాశాలున్నాయి. ఢిల్లీ మాట ఎలా ఉన్నా పంజాబ్‌లో (మొత్తం సీట్లు 13) మాత్రం ఒక్క సీటు కూడా ఇచ్చేందుకు ఆప్ సుముఖంగా లేదు. గత ఎన్నికల్లో ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ 8 స్థానాలు గెలుచుకోగా, అయిదు సీట్లలో రెండో స్థానంలో నిలిచింది. కాబట్టి, కనీసం 8 సీట్లు తనకు కావాల్సిందేనని కాంగ్రెస్ డిమాండ్ చేసే అవకాశాలున్నాయి. 40 సీట్లున్న బిహార్‌లో కాంగ్రెస్ పరిస్థితి బాగాలేదు. గత ఎన్నికల్లో ఒక్క స్థానమే గెలుచుకోగా, 8 స్థానాల్లో రెండవ స్థానంలో నిలిచింది. అందువల్ల ఈసారి ఆ రాష్ట్రంలో మిత్రపక్షాలైన జేడీయూ, ఆర్జేడీలు కేటాయించే సీట్లకే పరిమితం కావచ్చు. 9 స్థానాలను కాంగ్రెస్ డిమాండ్ చేసే అవకాశం ఉంది. ఇక 48 సీట్లున్న మహారాష్ట్రలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క సీటు మాత్రమే గెలుచుకుంది కానీ 21 స్థానాల్లో రెండవ స్థానంలో నిలిచింది. ఈసారి తాము అధిక సీట్లకు పోటీ చేస్తామని శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే ఇప్పటికే ప్రకటించారు. కాబట్టి ఎన్సీపీ, కాంగ్రె స్‌లకు ఎన్ని సీట్లు మిగులుతాయో వేచి చూడాల్సి ఉంది. బెంగాల్‌లో కాంగ్రెస్, వామపక్షాలకు ఒక్క సీటు కూడా ఇచ్చేందుకు తృణమూల్ కాంగ్రెస్ అధినాయకురాలు మమతా బెనర్జీ సిద్ధంగా లేరు. ఇక్కడ గత ఎన్నికల్లో కాంగ్రెస్ 2 స్థానాలు గెలుచుకోగా, ఒక్క సీటులో రెండవ స్థానంలో నిలిచింది. కాబట్టి, మహాఅయితే కాంగ్రెస్‌కు మూడు సీట్లు ఇచ్చేందుకు మమత అంగీకరించవచ్చు.

కాంగ్రెస్ తమతో ఔదార్యంగా వ్యవహరిస్తే.. కాంగ్రెస్ ఒంటరిగా బీజేపీని ఢీకొనే సీట్లలో తాము ఆ పార్టీకి సహకరిస్తామని ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు స్పష్టం చేస్తున్నాయి. సీట్ల సర్దుబాటు తర్వా తే కూటమి కలిసికట్టుగా సమావేశాలు, సభలు నిర్వహించి ప్రచారంపై దృష్టి కేంద్రీకరించే అవకాశాలున్నాయి.

841 కొత్త కొవిడ్ కేసులు.. ముగ్గురి మృతి

న్యూఢిల్లీ, డిసెంబరు 31: దేశంలో రోజువారీ కొవిడ్ కేసులు పెరిగిపోతున్నాయి. గత 24 గంటల వ్యవధిలో 841 కొత్త కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యశాఖ ఆదివారం బులెటిన్ విడుదల చేసింది. కిందటి రోజుతో పోలిస్తే దాదాపు 100 కేసులు పెరిగాయి. తాజాగా మరో మూడు మరణాలు రికార్డయ్యాయి. కేరళ, కర్ణాటక, బిహార్ రాష్ట్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మహమ్మారికి బలయ్యారు. కొత్త కొవిడ్ కేసులతో క్రియాశీల కేసులు 4,309కి చేరాయి.

మహారాష్ట్రలోని ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

- ఆరుగురు కార్మికుల మృతి

ఛత్రపతి శంభాజీనగర్, డిసెంబరు 31: మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో చేతి గ్లౌజులు తయారుచేసే ఓ ఫ్యాక్టరీలో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో ఆరుగురు కార్మికులు మృతి చెందారు. వాలజ్ పారిశ్రామికవాడలోని ఓ ఫ్యాక్టరీలో తెల్లవారుజామున ఒంటిగంటకు అగ్నిప్రమాదం జరిగింది. ఆ సమయంలో 13 మంది కార్మికులు లోపల నిద్ర పోతున్నారు. వారిలో ఆరుగురు మృతి చెందగా మిగిలిన ఏడుగురు పైకప్పు పగలగొట్టి బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు.. వెంటనే అగ్నిమాపక దళాన్ని అప్రమత్తం చేయడంతో.. ఆ దళం రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తెచ్చింది.


నక్సల్స్‌పై చివరి అస్త్రం!

ఒడిసా నుంచి ఛత్తీస్‌గఢ్‌కు 3 వేల మంది జవాన్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 31: దేశంలో నక్సలిజాన్ని అంతం చేసే ప్రణాళికలో భాగంగా సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్)లోని మూడు బెటాలియన్లకు చెందిన 3 వేల మందికిపైగా జవాన్లను ఛత్తీస్‌గఢ్‌కు పంపనున్నారు. వీరంతా ఒడిసా రాష్ట్రం నుంచి సరిహద్దు గుండా ఛత్తీస్‌గఢ్‌లోకి ప్రవేశిస్తారు. అంతే సంఖ్యలో ఐటీబీపీ(ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసు) దళాలను కూడా నక్సల్స్ చిట్టచివరి స్థావరమైన అబూజ్‌మడ్‌కు పంపనున్నట్లు అధికా ర వర్గాలు ఆదివారం వెల్లడించాయి. తీవ్రవాదాన్ని అంతం చేసే పనిలో భారత్ ఉందని కేంద్రహోం మంత్రి అమిత్‌షా డిసెంబరు 1న జార్ఖండ్‌లో బీఎస్ఎఫ్ 59వ వ్యవస్థాపక దినోత్సవంలో స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

జైపూర్‌లో 5 నుంచి డీజీపీల కాన్ఫరెన్స్

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీపీల సదస్సు ఈ నెల 5 నుంచి మూడ్రోజులపాటు రాజస్థాన్‌లో జరగనుంది. ఈ సదస్సులో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాల్గొంటారు. ఈ సదస్సుకు అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఇంటెలిజెన్స్ విభాగాల చీఫ్‌లు, ఐజీపీలు హాజరవుతారు.




తిరుమల ఆలయం ముందు జస్టిస్ శ్రీనివాస్

శ్రీవారి సేవలో జస్టిస్ శ్రీనివాస్

తిరుమల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ ఆదివారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్న అనంతరం వైకుంఠద్వార ప్రవేశం చేశారు. తర్వాత ఆలయంలోని రంగనాయక మండపానికి చేరుకున్న జస్టిస్ శ్రీనివాస్‌కు వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

తిరుమలలో పెరిగిన రద్దీ

తిరుమల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో జనవరి ఒకటో తేదీ సందర్భంగా భక్తుల రద్దీ పెరిగింది. శని, ఆది, సోమవారాలు వరుస సెలవులు రావడంతో శనివారం సాయంత్రం నుంచే తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. వైకుంఠద్వార దర్శనాలు కూడా సోమవారంతో ముగియనున్న నేపథ్యంలో తిరుమల క్షేత్రం యాత్రికులతో కిటకిటలాడుతోంది. ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా శ్రీవారిని దర్శించుకునేందుకు పలువురు వీఐపీలు టీటీడీకి లేఖలు అందజేశారు. తెలంగాణ గవర్నర్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఏపీకి చెందిన ముగ్గురు మంత్రులు, పలువురు న్యాయమూర్తులు సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.


తిరుమల ఆలయం ముందు భక్తుల రద్దీ, శ్రీవారి ఆలయంలో పుష్పాలంకరణ

నేటితో ముగియనున్న వైకుంఠ ద్వార దర్శనాలు

▸▸ రేపటి నుంచి ఎస్ఎస్‌డీ టోకెన్లు జారీ

తిరుమల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారంతో వైకుంఠ ద్వార దర్శనాలు ముగియనున్నాయి. వైకుంఠ ఏకాదశి సందర్భంగా డిసెంబరు 23వ తేదీ వేకువజామున శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారాలను తెరిచి దర్శనాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. రెండో తేదీ నుంచి యథావిధిగా తిరుపతిలో స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల జారీని ప్రారంభించనున్నారు. ఏరోజుకు ఆరోజు టోకెన్లను జారీ చేస్తారు. అలాగే టోకెన్ రహిత దర్శనాలు, చంటిబిడ్డల తల్లిదండ్రులకు, వృద్ధులు, దివ్యాంగుల ప్రత్యేక దర్శనాలు మొదలుకానున్నాయి.








విజయవాడ రైల్వేస్టేషన్‌లో పట్టాల మధ్య పడిన వృద్ధుడిని బయటకు తీస్తున్న ప్రయాణికులు

మృత్యుంజయుడు!

▸▸ రైలు, ప్లాట్‌ఫాం మధ్య పడిపోయిన వృద్ధుడు

విజయవాడ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదానికి గురైన ఓ వృద్ధుడు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుని మృత్యుంజయుడిగా బయటికొచ్చాడు. అనంతపురానికి చెందిన ప్రతాప్ అనే వృద్ధుడు శనివారం సాయంత్రం విజయవాడ రైల్వేస్టేషన్‌కు చేరుకునే సరికి ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై ఆయన ఎక్కాల్సిన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ కదిలిపోయింది. కదులుతున్న రైలు ఎక్కే ప్రయత్నంలో ఆయన కాలు జారిపడిపోయాడు. పట్టాలకు, ప్లాట్‌ఫాంకు మధ్య ఇరుక్కుపోయాడు. కదలకుండా రైలు వెళ్లే వరకు పడుకుని ఉండిపోయాడు. రైలు వెళ్లాక ప్లాట్‌ఫాంపై ఉన్న వారంతా ప్రతాప్‌ను పైకి లేపారు.

ధర్మవరం ఎమ్మెల్యే ఎస్కార్ట్ వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

ముదిగుబ్బ, డిసెంబరు 31: శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం మలకవేముల గ్రామ సమీపాన ధర్మవరం వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఎస్కార్ట్ వాహనం.. బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నల్లమాడ మండలం కొండకింద తండాకు చెందిన బాబూనాయక్, షకీలానాయక్ ఆదివారం ద్విచక్రవాహనంపై కదిరికి బయల్దేరారు. ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ఎస్కార్ట్ వాహనం ధర్మవరం నుంచి కదిరి వెళుతుండగా.. మలకవేముల క్రాస్ సమీపాన ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న బాబూనాయక్, షకీలానాయక్‌కు తీవ్రగాయాలయ్యాయి. కాన్వాయ్‌లోని మరో వాహనంలో వారిని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని పట్నం పోలీసులు తెలిపారు.



వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

అతడు రాసిన ఆమె కథలు

ప్రాచీన కావ్యాల్లో స్త్రీని ఒక 'సౌందర్యమూర్తి'గా ప్రతిష్ఠించే క్రమంలో ఆమెను అనైతికతకు ఆస్కారంలేని దేవతామూర్తిగా చేసి ఒక నైతిక చట్రంలో ఇమిడ్చే నర్మగర్భమైన ప్రయత్నం కనబడుతుంది. స్వతఃసిద్ధమైన స్త్రీ అస్తిత్వానికి దూరంగా ఆమెకు ఒక నిర్దిష్టమైన రూపాన్ని అంటగట్టే ప్రయత్నంలో సాహితీ సృజనలో అవసరమైన యిన్-యాంగ్ అంటే నీతి-అవినీతి, మంచి-చెడు, న్యాయం-అన్యాయం వంటి ద్వంద్వాలను ఆమె అస్తిత్వానికి అన్వయించుకునే అవకాశం లేకుండా కనిపించని ఆంక్షలు అమల్లో ఉండేవి. అందుకే ప్రాచీన కావ్యాల్లో కవులూ, రచయితలూ సృష్టించిన స్త్రీ పాత్రలు అయితే మచ్చలేని చందమామను తలపించే దేవతా మూర్తులుగానో లేదా దానికి పూర్తి విరుద్ధంగా మంత్ర తంత్రాలు నేర్చిన మంత్రగత్తెలూ, రాక్షసులుగానో చిత్రించబడేవి. డాంటే, గోథే, మిల్టన్ వంటివారు ఆద్యులుగా, పవిత్రమైన వర్జిన్ మొదలు గృహానికి పరిమితం చేసిన ఇల్లాలి వరకూ అన్ని కావ్యాల్లోనూ ఈ సంప్రదాయం చాలాకాలం కొనసాగింది.

ఇమ్మాన్యుయేల్ కాంట్ స్త్రీ తర్కాన్ని పూర్తిగా విస్మరించనప్పటికీ ఆమె హేతువాదం నైతిక, సామజిక వ్యవహారాల్లో పరిణతిలేనిదని నిర్ధారించారు. కాంటియన్ తత్వం స్త్రీ ఉనికిని కేవలం మగవాడిని పరిపూర్ణం చేసే దిశగా వివాహవ్యవస్థ ద్వారా మాత్రమే నిర్వచిస్తుంది. కాంట్ స్త్రీ పురుషుల వివాహాన్ని రెండు ప్రకృతుల మేళవింపుగా చూస్తారు. భావాన్ని స్త్రీత్వంగానూ; హేతువునూ, తర్కాన్నీ పురుషత్వంగానూ నిర్వచిస్తారు. ఈ కారణంగా మగవాడిని ఆదర్శవంతమైన నైతిక జీవనం దిశగా ప్రోత్సహిస్తూ, సహాయ సహకారాలందించే పాత్రకి మాత్రమే ఆమెను పరిమితం చేశారు.

ఈ కారణాల దృష్ట్యా అప్పుడప్పుడే రచనా వ్యాసంగంలో తొలి అడుగులు వెయ్యడం మొదలుపెట్టిన రచయిత్రులు సహజంగానే అనేక సవాళ్ళను ఎదుర్కోవలసి వచ్చింది. ప్రాచీన కాలం నుండీ ఏకపక్షంగా మగవారికి మార్గదర్శకత్వం చేస్తూ వచ్చిన 'వడ్డించిన విస్తరి' లాంటి కావ్యాలూ, గ్రంథాలూ రచయిత్రుల విషయంలో లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. అందువల్ల స్త్రీలు తమ రచనల ద్వారా పితృస్వామ్య సాహితీ సృజనలో రూపుదిద్దుకున్న మూస నుండి బయటపడి ప్రప్రథమంగా తమ ఉనికిని నిర్వచించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అందువల్ల 1970ల తరువాత గానీ వారి రచనలకు గుర్తింపే దొరకలేదు. రాయడం మొదలుపెట్టిన తొలినాళ్ళలో తనకు ఏం రాయాలో, ఎలా రాయాలో ఒక పురుషుడి స్వరంలో ఉన్న అదృశ్యవాణి శాసిస్తున్నట్లు అనిపించేదంటారు ఇటాలియన్ రచయిత్రి ఎలెనా ఫెరాంటే. "అతడు నా సమ వయస్కుడో, లేదా నాకంటే వయసులో పెద్దవాడో నాకు తెలియదు. నేను రాయాలంటే అతడిలా ఆలోచించాలి, అతణ్ణి అనుకరించాలి. ఏకకాలంలో ఒక మగవాడిగానూ, మరికొన్నిసార్లు నా ఉనికిని కాపాడుకుంటూ ఒక స్త్రీగానూ కూడా ఆలోచించాలి" అంటారామె.


అమెరికన్ స్త్రీవాద తత్వవేత్త జుడిత్ బట్లర్ లాటిన్ అమెరికన్ స్త్రీవాద సిద్ధాంతాలలో 'స్త్రీ' అనే పదానికి నిర్వచనాలున్నాయనే ప్రతిపాదనలని సవాలు చేస్తూ, భాషలో స్త్రీపురుష నిర్వచనాలు ఆది నుంచీ లేవనీ, అది కేవలం పితృస్వామ్యపు సృష్టి అనీ కొట్టిపారేస్తారు. మరోవైపు ఫ్రెడ్రిక్ నీషే పురుషాధిక్య భావజాలంతో కూడిన మానసిక విశ్లేషణలు స్త్రీని అజమాయిషీ అవసరమైన ఒక పశువుగా చూడాలని నూరిపోస్తాయి. నీషే 'Thus Spoke Zarathustra' రచనలో ఒక పాత్ర "నువ్వు స్త్రీ దగ్గరకు వెళ్తున్నావా? అయితే నీ కొరడా తీసుకెళ్ళడం మర్చిపోకు" అంటుంది.

ఫ్రాయిడ్ సిద్ధాంతాలను సాహిత్యానికి అన్వయించిన విమర్శకులు హరాల్డ్ బ్లూమ్ సాహితీ చరిత్రను రాయడంలో తీవ్రమైన 'పితృస్వామ్యాన్ని' తన మోడల్‌గా చేసుకున్నారు. ఆయన కావ్యగతిని మగవాడైన కవికీ, అతడి కావ్యానికి ప్రేరణైన స్త్రీకీ మధ్య సంభోగంగా చూస్తారు. ఈ స్థితిలో కావ్యంలో కవయిత్రి స్థానం ఎక్కడన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. కవయిత్రిగా ఆమె ఎవరిని ఆదర్శంగా తీసుకోవాలి? ప్రేరణది ఏ లింగం? హరాల్డ్ బ్లూమ్‌ని చదివిన ఏ స్త్రీలోనైనా తలెత్తే ప్రశ్నలు ఇవే.

నిజానికి బ్లూమ్ మోడల్‌ను ఆదర్శంగా తీసుకుంటే ఆయన ప్రతిపాదించిన "Anxiety of influence" ప్రభావం రచయితలపై ఉన్నంతగా రచయిత్రులపై ఉండదంటారు విమర్శకురాలు సాంద్రా గిల్బర్ట్. ఎందుకంటే వెనక్కి తిరిగి చూసుకుంటే వారిపై ప్రభావం చూపించడానికి వారికొక మోడల్ అంటూ లేదు. 19వ శతాబ్దంలో కాస్త ఆలోచనగల ఏ స్త్రీనయినా ప్రకృతి విరుద్ధంగా వ్యవహరించే మానసిక రోగిగా ముద్రవేసేవారు. ఈ కారణంగా ఆ కాలపు రచయిత్రులు "Anxiety of authorship"తో బాధపడ్డారంటారు సాంద్రా. ప్రాచీన కావ్యాల్లో స్త్రీ ఉనికే సందిగ్ధంలో ఉంది గనుక రాయడం తన వల్ల కాదనీ, తనలో సృజనాత్మకత లేదనీ భావించేదామె. నిజానికి ఆమె సంఘర్షణ పితృస్వామ్య రచనల్లోని ప్రపంచంతో కాదు. కవి కలం నుండి జీవం పోసుకున్న ఆమె మూర్తితో. మాక్బెత్‌ను కథానాయకుడిగా చూపి లేడీ మాక్బెత్‌ను ఒక దిగజారిన స్త్రీగా అభివర్ణిస్తారు, అలాగే ఒడిపస్‌ను కథానాయకుడిగానూ, మెడియాను ఒక మంత్రగత్తెగానూ చూపిస్తారు. ఇకపోతే కింగ్ లియర్ పిచ్చితనం అతడి వ్యక్తిత్వానికి వన్నెతెచ్చే ఒక గొప్ప విషయమైతే ఒఫీలియా పిచ్చితనం కడుదుర్భరం అన్నట్లు వర్ణిస్తారు. ఏకపక్షంగా ఇలాంటి వర్ణనలు చేసే అతడి చేతుల్లో నుండి కలం లాక్కుని తన గురించి చెప్పే అధికారం అతడికి ఇవ్వకుండా తన సాధికారతను చాటుకోవాలంటే స్త్రీ సమాజంలో తన ఉనికిని మళ్ళీ సరికొత్తగా నిర్వచించుకోవాలి. వర్జినియా వూల్ఫ్ తన 'A Room of One's Own' రచనలో షేక్స్పియర్ సోదరి జుడిత్ పాత్రను సృష్టిస్తూ, 16వ శతాబ్దంలో ప్రత్యేకమైన నైపుణ్యం, సృజనాత్మకతతో పుట్టిన ఏ స్త్రీకి అయినా పిచ్చిపట్టడం ఖాయం అంటారు.

ప్రాచీన కాలం నుండీ స్త్రీలను కళారంగానికి దూరంగా ఉంచిన అంశాలపై 19వ శతాబ్దం తరువాత స్త్రీవాద తత్వవేత్తలు దృష్టి సారించారు- సృజన విషయంలో మగవారిని దైనందిన జీవితానికి సంబంధించిన బాధ్యతల నుండి వినహాయించడంతో వారికి స్వేచ్ఛగా రచనావ్యాసంగాన్ని కొనసాగించే సౌకర్యం (మేల్ ప్రివిలేజ్) ఉండేదనీ, రచయిత్రులకు ఆ అవకాశం లేదనీ వారు అంటారు. ఎమిలీ డికిన్సన్, సిల్వియా ప్లాత్, జేన్ ఆస్టెన్, బ్రోన్ట్ సిస్టర్స్ వంటి ప్రముఖ రచయిత్రులు సైతం దీనికి మినహాయింపు కాదు. సాహితీ విమర్శకుడు హరాల్డ్ బ్లూమ్ సైతం కవిత్వ ప్రేరణను 'తండ్రీ కొడుకుల బంధం'గా అభివర్ణించారు. ("from the sons of Homer to the sons of Ben Jonson, poetic influence [has] been described as a filial relationship") ఆయన యావత్ సాహితీ ప్రస్థానాన్ని ఇరువురు అత్యంత శక్తిమంతమైన సరిసమాన వ్యక్తుల మధ్య పోరుగా, అనగా తండ్రీకొడుకుల పోరుగా చూస్తారు.

ఎంత పిడికిట్లో బిగించి అదుపులో పెట్టాలని ప్రయత్నించినా ఈడెన్ సాక్షిగా ఈ కథలన్నీ ఏదో ఒక సమయంలో రచయిత మునివేళ్ళ నుండి తప్పనిసరిగా జారుకుంటాయి. స్త్రీని ఒక జీవమున్న ప్రాణిగా కాక కేవలం ఒక ఇమేజికి కుదించిన ప్రాచీన కావ్యాలను యథాతథంగా అంగీకరించడం ముందుముందు వీలుపడదు. అదే సమయంలో మిల్టన్, డాంటే, కీట్స్ మొదలు హాప్కిన్స్, బ్లేక్, ఈట్స్, ఇలియట్ వరకూ వేల సంవత్సరాల పాశ్చాత్య సాహిత్యాన్ని ఉన్నపళంగా విస్మరించడమూ సరికాదు. తరతరాల సంస్కృతిని పరిరక్షించుకోవలసిన బాధ్యత స్త్రీపురుష భేదం లేకుండా మనందరిపైనా ఉంది. కానీ అసలు చిక్కంతా ఆ సాహిత్యాన్ని నిస్సంశయంగా, నిర్ద్వంద్వంగా అంగీకరించాలీ అనుకోవడంలోనే ఉంది. సరిగ్గా ఇక్కడే సాహిత్యంలో స్త్రీవాదులూ, విమర్శకుల అవసరం కనిపిస్తుంది. కేవలం నాణానికి ఒక వైపు కథనే చెబుతూ రెండోవైపు కథను ఉద్దేశ్యపూర్వకంగా చెప్పకుండా వదిలేసిన ప్రాచీన సాహిత్యాన్ని తీసిపారేసే బదులు ఆ చరిత్రను తిరగరాయవలసిన అవసరం ఉంది. ఆ రెండో పార్శ్వం మానవజాతిలో సగమైన స్త్రీల జీవితాలు. అందువల్ల సాహితీసంస్కృతిని పునర్నిర్మించాలి, పునఃసృజించాలి, పునరాలోచించాలి, పునర్లిఖించాలి, పునఃవిశ్లేషించాలి. ఈ మార్పు తీసుకురావాలంటే భాష నుండి మొదలుపెట్టాలి. మూలగ్రంథాల నుండీ ప్రక్షాళన జరగాలి.



> రాయడం మొదలుపెట్టిన తొలినాళ్ళలో తనకు ఏం రాయాలో, ఎలా రాయాలో ఒక పురుషుడి స్వరంలో ఉన్న అదృశ్యవాణి శాసిస్తున్నట్లు అనిపించేదంటారు ఇటాలియన్ రచయిత్రి ఎలెనా ఫెరాంటే. "అతడు నా సమ వయస్కుడో, లేదా నాకంటే వయసులో పెద్దవాడో నాకు తెలియదు. నేను రాయాలంటే అతడిలా ఆలోచించాలి, అతణ్ణి అనుకరించాలి. ఏకకాలంలో ఒక మగవాడిగానూ, మరికొన్నిసార్లు నా ఉనికిని కాపాడుకుంటూ ఒక స్త్రీగానూ కూడా ఆలోచించాలి" అంటారామె.

గాలిలా కంటికి కనిపించని లింగవివక్షను ఎదుర్కొంటూ, మౌనాన్ని ఛేదిస్తూ ఆ కాలంలో కూడా ఎమిలీ డికిన్సన్, సిల్వియా ప్లాత్, అన్నే సెక్స్టన్, వర్జీనియా వూల్ఫ్ వంటి రచయిత్రులు అనేక రచనలు చేశారు. ఈ కారణంగా పురుషాధిక్యత, లింగవివక్షకు సంబంధించిన వైరుధ్యాలు ముఖ్యంగా 19వ శతాబ్దపు తొలినాళ్ళలో స్త్రీ పురుష అస్తిత్వవాద రచనలన్నిటిలోనూ స్పష్టంగా కనిపించేవి. 'మేల్ టెక్స్ట్' బంధనాల్ని తెంచుకుంటూ అరోరా లీ, మేరీ ఎలిజబెత్ కాలేరిడ్జ్ వంటి స్త్రీలు కొన్నిసార్లు వారికి ఆపాదించిన ద్వంద్వ ప్రవృత్తులైన దేవతగానూ, మరి కొన్నిసార్లు రాక్షసిగానూ మార్చి మార్చి తమ ఉనికిని నిర్వచించుకోవడం మొదలుపెట్టారు.

ఈ దిశగా పరిశోధనలు చేస్తూ 'ది మాడ్ వుమన్ ఇన్ ది అటిక్' పేరిట రాసిన వ్యాసాల్లో స్త్రీవాద సాహిత్య విమర్శకులు సాంద్రా గిల్బర్ట్, సుసాన్ గుబార్‌లు కొన్ని ఆసక్తికరమైన విషయాలను వెలుగులోకి తీసుకొచ్చారు. 'Anxieties of authorship'తో కష్టపడుతున్న రచయిత్రులు రచనా వ్యాసంగం వైపు వెళ్ళే ముందు మగవారు తయారుచేసిన 'ఆమెలోని ఆదర్శ మూర్తి'ని చంపాలని తీర్మానిస్తారు వర్జీనియా వూల్ఫ్. అంటే స్త్రీ ఉనికిని సాహిత్యంలో లేకుండా చేసిన పితృస్వామ్యం కొలమానంగా పెట్టిన 'స్త్రీ ఎస్తెటిక్ ఐడియల్'ను నాశనం చెయ్యాలి. అలాగే ఆమె ప్రత్యర్థిగా తయారుచేసిన ఆమెలోని 'రాక్షసి'ని పోలిన ప్రతిమని కూడా నాశనం చెయ్యాలి. అలా చెయ్యాలంటే ముందు వాటి మూలాలెక్కడున్నాయో తెలుసుకుని వాటి పూర్వాపరాలు అర్థం చేసుకోవాలి. అందుకు స్త్రీల రచనల్ని చదవాలి, వాటిలోని స్త్రీవాద తత్వాన్ని లోతుగా పరిశీలించాలి. పాశ్చాత్య సాహిత్యాన్ని పునర్విమర్శిస్తూ వర్జీనియా వూల్ఫ్- పితృస్వామ్య చరిత్రను శిలాశాసనాల్లా పదేపదే పునర్లిఖించే బదులు, చరిత్ర చెప్పకుండా వదిలేసిన కథల్నీ, కొత్త కథల్నీ చెప్పుకోవలసిన అవసరం ఉందంటారు. స్త్రీల విషయంలో ఈ 'సాంస్కృతిక పరాయీకరణ'కు కారణాలను స్త్రీవాదులూ, విమర్శకులూ ఇప్పటికీ పరిశోధిస్తూనే ఉన్నారు.

ఇక సమకాలీన స్త్రీవాద విమర్శ విషయానికొస్తే మార్గరెట్ అట్వుడ్, ఎలెనా ఫెరాంటే, జాడీ స్మిత్, ఝుంపా లహిరి, చిమమండ అడిచి వంటి ప్రామాణికత కలిగిన అతికొద్ది స్త్రీవాద రచయిత్రులను మినహాయిస్తే అమెరికన్ రచయిత్రి రెబెక్కా సోల్నిట్ వంటి కొందరు స్త్రీవాదానికి ఫ్యాషన్ ఐకాన్స్‌గా చెలామణి అవుతున్నారు. నిజానికి రెబెక్కా వంటి స్త్రీవాదులు 'స్త్రీ మౌనం' గురించి ఉటంకించే అనేక విషయాలు స్త్రీవాదానికి కొత్తగా కలిపినదేమీ లేదు. అవన్నీ Maya Angelou, Adrienne Rich, Cynthia Ozick, Simone de Beauvoir, Allison Bechdel లాంటి మునుపటి తరం స్త్రీవాదులు అనేక రచనల్లో చెప్పినవే. కానీ కాస్త లోతుగా పరిశీలిస్తే బహుశా స్త్రీవాదుల స్వరాలు చేరాల్సిన చెవులకు చేరకపోవడం వల్ల చెప్పినదాన్నే మళ్ళీ మళ్ళీ చెప్పడం తప్పనిసరి అయిపోయిందేమో అనిపిస్తుంది.

ఏదేమైనా లింగవివక్షపై అవగాహన వచ్చినంత తేలిగ్గా రచయిత్రులకు సాహితీ సంస్కృతిని పునర్లిఖించడం సాధ్యం కాలేదంటారు సాంద్రా గిల్బర్ట్, గాయత్రి స్పివాక్ వంటి విమర్శకులు. ఈ క్రమంలో మరోరకమైన వివక్షలు వివిధ రూపాల్లో అవరోధాలుగా తయారయ్యాయి. నిజానికి ఎక్కువమంది రచయితలు స్త్రీవాద సదస్సులకు వెళ్ళడానికి ఆసక్తి చూపరు. స్త్రీల రచనల్ని గానీ, వారి వ్యాసాలను గానీ చదవరు. ఇటువంటి వివక్షలో కూడా పలురకాలుంటాయి. మొదటి రకపు వివక్ష సాహిత్యానికి ఎంతమాత్రమూ సంబంధంలేని వారి నుంచి ఎదురవుతుంది. సుమారు 50-60 శాతం ఉండే వీరిలో చాలామంది స్త్రీవాదాన్ని వినరు, చదవరు. కొంతమంది మాకెందుకొచ్చిందని విసుగ్గా ఆవలిస్తారు, మరికొంతమంది అజ్ఞానం నటిస్తారు. వీళ్ళంతా స్త్రీవాద సాహిత్య విమర్శను ఉద్దేశ్యపూర్వకంగా తిరస్కరిస్తారు. ఇక స్త్రీవాద విమర్శపై రెండో రకమైన తిరస్కరణ వివక్ష లేదని అంటూ విపరీతమైన ఆశావహదృక్పథాన్ని అవలంబించే పండితవర్గం నుంచి ఎదురవుతుంది. వీరు ప్రతీ సాహితీ విభాగంలోనూ ఒక స్త్రీవాది ఉంటే చాలనుకునే వర్గం. ఇక స్త్రీవాద విమర్శకు మూడో తరహా తిరస్కరణ ప్రత్యక్ష శత్రుత్వం ద్వారా జరుగుతుంది. చాలాసార్లు శత్రుత్వాన్ని బాహాటంగా ప్రదర్శించడానికి రచయితలు ఇష్టపడకపోయినా రచయిత్రులు ఏ మాత్రం మొహమాటపడకుండా తమ వ్యతిరేకతనూ, తిరస్కారాన్నీ ప్రదర్శిస్తారు. ఈ శత్రుత్వం వెనుక పితృస్వామ్య మూలాలుంటాయి. ఏదేమైనా "స్త్రీవాదులు గళం విప్పడం అన్ని చారిత్రక మూలాల్నీ సమూలంగా పెకలించివేస్తుంది" అనేది కేవలం ఒక మెటఫోర్‌గా చూడడం వరకే బావుంటుంది. స్త్రీవాదం వినాశనాన్ని కోరదు, ఎటువంటి వివక్షలకూ తావులేని సమాజాన్ని నిర్మించే దిశగానే ప్రయాణిస్తుంది. అందువల్ల స్త్రీవాద ఉద్యమాన్ని విచ్ఛేదనంగా చూడడం కంటే పునర్నిర్మించడంగా చూడాల్సిన అవసరం ఉంది.

గాయత్రి చక్రవర్తి స్పివాక్ అనేక రచనలను విశ్లేషించడానికి ఉపయోగించిన డెరిడా ప్రతిపాదించిన 'డీ కన్‌స్ట్రక్షన్ ప్రిన్సిపల్'ని స్త్రీ ఉనికిని పునఃనిర్వచించే దిశగా మన ప్రాచీన సాహిత్యం మొదలు సమకాలీన సాహిత్యం వరకూ వర్తింపజేయాలి. స్త్రీ అస్తిత్వాన్ని ఇప్పటి తూకపురాళ్ళతో మరోసారి తూచాలి. ఈ క్రమంలో స్త్రీవాద సాహిత్య విమర్శకుల అవసరం మునుపటి కంటే ఇప్పుడు మరింత ఎక్కువ ఉంది. అస్తిత్వం చాటుకునే దిశగా సంకెళ్ళు తెంచుకుంటూ మొదలైన స్త్రీవాద ఉద్యమం క్రమేపీ ఆధిపత్యపోరులోకి దిగకూడదని ఆశిద్దాం. స్వాతంత్ర్యం కోసం చేసే ప్రతీ పోరాటమూ గెలుపు దిశగా అడుగులు వేయిస్తుంది, కానీ ఆధిపత్యం కోసం చేసే ప్రతీ పోరాటంలోనూ కేవలం వినాశనమే మిగులుతుంది. స్వేచ్ఛనూ, సమానత్వాన్నీ మాత్రమే సాధించే దిశగా స్త్రీవాదం తన సాధికారతను చాటుకుంటుందని మనస్ఫూర్తిగా కోరుకుందాం.

(ఈ వ్యాస రచనకు సాంద్రా గిల్బర్ట్, సుసాన్ గుబార్, ఎలెనా ఫెరాంటే, వర్జీనియా వూల్ఫ్, గాయత్రి స్పివాక్‌ల పలు రచనలు సాయ పడ్డాయి.)

నాగిని కందాళ
nagini.kandala@gmail.com

హైకు



రాలుతున్న తుహిన కణాలతో
ఈ నశ్వర ప్రపంచం -
కడగాలని వుంది
బషో (జపాన్)



పుట్టగానే స్నానం
చావగానే స్నానం -
ఎంత మూర్ఖం
ఇస్సా (జపాన్)



హేమంత రాత్రి -
సాలెపురుగును చంపాక
నేనెంత ఏకాకిని
షికి (జపాన్)



సముద్ర తీరంలో
తలతిప్పి చూస్తే -
నా పాదముద్రలేవీ లేవు
హొసయ్ ఒజకి (జపాన్)



ఖాళీ రేవులో
చంద్రునితో -
నౌక మౌన సంభాషణ
చక్ బ్రిక్లీ(అమెరికా)



వేసవి రాత్రి
దీపాలన్నీ ఆర్పేసాం -
వర్షపుసడి వినడానికి
పెన్నీ హార్టర్ (అమెరికా)



ఆస్పత్రి కిటికీల గుండా
నొప్పి మాయమౌతోంది -
చెర్రీలు వికసిస్తూ
అమితవదాస్ గుప్తా (ఇండియా)



ఆలయ శిథిలాలు -
గాలి మాత్రమే ఇంకా
పూలు సమర్పిస్తోంది.
రోహిణీ గుప్తా (ఇండియా)



కరెంటు కోత -
ఈ రోజు
పక్షుల కిలకిలలు విన్నాను
- ఉషా కిరణ్ (ఇండియా)



జైలులో కవి -
అక్కడున్నది అతని నీడే..
అతనున్నది ప్రజల మధ్య
- అజిమ్ విన్నా (మెసడోనియా)

అనువాదం: పి. శ్రీనివాస్ గౌడ్
99494 29449

'కవిత్వ సౌరభం' కవి సమ్మేళనం

తెలంగాణ సాహితీ సమాఖ్య నిర్వహణలో 'కవిత్వ సౌరభం' శీర్షికన కవిసమ్మేళనం జనవరి 1 మధ్యాహ్నం 2 గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఇరవై మంది ప్రముఖ కవులు పాల్గొంటున్న ఈ కవి సమ్మేళనంలో అతిథులుగా దేశపతి శ్రీనివాస్, కొప్పర్తి, కాంచనపల్లి గోవర్ధన్ రాజు, ఏనుగు నరసింహారెడ్డి, వాజల శివకుమార్, వేముగంటి మురళి పాల్గొంటారు.

ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

'మాయని గాయాల నెత్తుటి చరిత్ర'

లక్ష్మణ్ రచించిన 'మాయని గాయాల నెత్తుటి చరిత్ర' (యదార్థ సంఘటనల సమాహారం) పుస్తకావిష్కరణ జనవరి 6 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో అన్నవరం దేవేందర్, ఘంటా చక్రపాణి, వి. ప్రకాష్, నారదాసు లక్ష్మణ్ రావు, ఎస్కే జకీర్, వెల్దండి శ్రీధర్ పాల్గొంటారు.

సాహితీ సోపతి

'నెవర్ ఎండ్ - వీరులకు మరణం లేదు'

తెలంగాణలో గత నలభై ఏళ్లుగా యువజనోద్యమంలో ప్రాణత్యాగం చేసి అమరులైన విస్మృత వీరుల చరిత్రను రాష్ట్ర వ్యాప్తంగా 822 కిలోమీటర్లు మోటారు సైకిల్ యాత్ర చేసి వెలికితీసి ఎం. విప్లవకుమార్, ఎ. విజయ్ కుమార్ రాసిన పుస్తకం 'నెవర్ ఎండ్ - వీరులకు మరణం లేదు' ఆవిష్కరణ సభ జనవరి 5 మధ్యాహ్నం 2 గంటలకు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్‌లో జరుగుతుంది. పుస్తకాన్ని ప్రజాకవి జయరాజ్ ఆవిష్కరిస్తారు. సభలో జయరాజ్, భూపతి వెంకటేశ్వర్లు, ఎ. నర్సిరెడ్డి, యాకూబ్, చింతల యాదగిరి, పసునూరి రవీందర్, తగుళ్ళ గోపాల్, ఆనగంటి వెంకటేష్, దాసరి యువరాణి, సాత్విక నన్నెబోయిన పాల్గొంటారు. వివరాలకు: 9573715656.

ఎ. విజయ్ కుమార్

'సముద్రం'పై కథల పోటీ

విశాలాక్షి సాహిత్య మాస పత్రిక ఆళ్ల దశరథరామిరెడ్డి స్మారకంగా 'సముద్రం' అంశంపై నిర్వహించే కథల పోటీకి ప్రథమ బహుమతి ఐదు కథలకు ఒక్కో కథకు రూ.5 వేలు, ద్వితీయ బహుమతి ఐదు కథలకు ఒక్కో కథకు రూ.3వేలు, తృతీయ బహుమతి ఐదు కథలకు ఒక్కో కథకు రూ.2వేలు బహుమతులు ఉంటాయి. సాధారణ ప్రచురణకు ఎన్నికైన ప్రతి కథకు వెయ్యి రూపాయల బహుమతి ఉంటుంది. ఈ కథలతో ప్రత్యేక కథా సంపుటి వెలువడుతుంది. కథలను జనవరి 20లోపు విశాలాక్షి సాహిత్య మాస పత్రిక, 27-5-487, పద్మావతి నగర్, బాలాజీ నగర్ ఎక్స్‌టెన్షన్, నెల్లూరు 524002, ఫోన్: 94405 29785కు పంపాలి.

ఈతకోట సుబ్బారావు



సమ తరంగద్వైతం

ఒకరు
కళ్ళు తెరచి ఓ దృశ్యం చూస్తారు
కాదు కాదు దర్శిస్తారు
అది
మనసులో ఇంకే దాకా
కనులు మూస్తారు
తర్వాతే
కాగితమ్మీద తెరచుకుంటారు

ఒకరు
కళ్ళు తెరచి దాన్ని చదువుతారు
తన మనసులో
అది ఇంకే దాకా
కనులు మూస్తారు

కవి పాదాలు రాస్తూ
ఓ రాస్తా వేస్తే
చదువరి తెరువరై
ఆ దారిని పవిత్రం చేస్తాడు

నలిమెల భాస్కర్

కొండను ఏమార్చే 'మార్కెట్'పై కథలు ఎక్కుపెట్టాడు!

గిరిజన ప్రాంతాలు ధన సముపార్జనకు పనికొచ్చే ప్రాంతాలు. అక్కడ దొరికే ఖనిజ సంపద నుంచి అటవీ కలప వరకు ప్రతీది మైదాన ప్రాంత 'అభివృద్ధి'కి కీలకం. అందుకే గిరిజన ప్రాంతాల్లోకి చొచ్చుకుపోయే ప్రయత్నంలో మైదాన ప్రాంతం, ప్రభుత్వాలు ఒక నూతన పరిభాషను సృష్టిస్తాయి. 'అటవీ పరిరక్షణ' అనీ, గిరిజనులకు నాగరికత నేర్పాలనీ, వారివి మూఢనమ్మకాలనీ.. ఇలాంటి పరిభాషను వాడతాయి. ఈ పరిభాష గిరిజనులపై మైదాన ప్రాంతీయుల సాంస్కృతిక దాడిగా పనిచేస్తూనే కొండపై పెట్టుబడి చొచ్చుకుపోవడానికి వీలు కలిగించే భావజాలాన్ని విస్తరింప చేస్తుంది. అయితే ఈ లోగుట్టును విప్పి చెప్పాల్సినవి కళా రూపాలే. అందులోనూ ముఖ్యంగా సాహిత్యమే!


గూడూరు రాజేంద్రరావు (చెంచు) మొదలుకొని సువర్ణముఖి వరకు ఈ లోగుట్టును విప్పుతూ ఆదివాసీల వెతలను సహానుభూతితో కథలుగా అల్లిన తెలుగు రచయితలు ఎందరో ఉన్నారు. అయితే వీరందరూ గిరిజనేతరులే. దెబ్బతిన్నవాడే నొప్పిని నిజాయితీగా చెప్పగలడు. ఇలాంటి సందర్భంలో ఒక గిరిజనుడు తన అనుభవాలను, తన సంస్కృతిపై జరుగుతున్న దాడిని అధ్యయనం ద్వారా ఎఱుక పరచుకొని, వాటి గురించి సృజన చేయడం మొదలుపెట్టాడు. అతడే తెలుగు సాహిత్యంలో తొలి ఆదివాసీ రచయితగా చెప్పబడుతున్న మల్లిపురం జగదీష్.

మల్లిపురం జగదీష్ వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ఇప్పటి వరకు 28 కథలను వెలువరించాడు. అవి 'గాయం', 'శిలకోల', 'గురి' అనే సంపుటాలుగా వచ్చి పాఠకుల ఆదరణను చూరగొన్నాయి. ఈ కథల ఇతివృత్తాలు మైదానప్రాంతం కొండపై చేస్తున్న సాంస్కృతిక దాడికి ప్రతిఫలనాలే.



> అడవికి దూరమైనా అడవితనాన్ని విడిచిపెట్టకుండా, తన మూలాలను కాపాడుకోవాలనే ఆలోచనను తన తరువాత తరానికి బలంగా తన కథల ద్వారా దిశా నిర్దేశం చేస్తున్నాడు మల్లిపురం జగదీశ్. వాళ్ళ జీవితాల్లోంచే వచ్చిన రచయితగా ఆదివాసీలు ఏమి కోల్పోతున్నారో, వాళ్ళ నిజమైన సంస్కృతి ఏంటో లోకానికి ఎఱుకపరచడానికి కథా ప్రక్రియను ఎంచుకున్నాడు.

నిజమైన కొండ సంస్కృతిని తన కథలలో బలంగా చూపించాడు జగదీష్. ప్రకృతితో, వన్యప్రాణులతో సామరస్య వాతావరణంలో కలసి జీవిస్తున్న జన సమూహం గిరిజనులు. అందుకే వీరి ప్రతీ పండుగా, ప్రతీ సాంప్రదాయం ప్రకృతితోనే ముడిపడి ఉంటాయి. "విత్తనం నాటితే పండుగ. మొలకెత్తితే పండుగ. పూత పూస్తే పండగ. కోత కోస్తే పండుగ. ఎంత గొప్ప సంస్కృతి!" ('గాయం'); "ఊరంటే సంబరం, నలుగురు కలిసే ఉత్సవం. ఊరంటే గుగ్గిలం పొగ. ఊరంటే ఎజ్జోడి మంత్రం. ఊరంటే కొత్తల సంబరం. ఊరంటే సన్నాయి, పిన్నలగర్రల గానం. ఊరంటే తుడుం డప్పుల హోరు" ('అడవితనం')... ఇలా ప్రతీ సందర్భాన్ని ఉత్సాహవంతం చేసుకుంటున్న గిరిజనుల ప్రతీ సంబరాన్ని సందర్భానుసారం తన కథల ద్వారా పాఠకలోకానికి అందించాడు జగదీష్.







కొన్ని వేల సంవత్సరాల నుంచి కొండల మీద కొనసాగుతున్న ఈ సందడి, సమిష్టి జీవనం గత కొన్ని దశాబ్దాలుగా నిర్వీర్యమౌతుంది. దీనికి కారణం కొండ జీవనానికి వ్యతిరేకమైన మతాలు కొండకు చేరుకొని, వారిని సమిష్టి జీవనానికి దూరం చేస్తున్నాయి. ఈ స్థితిని 'నా పేరు సొంబరా', 'గాయం' కథలలో చాలా ఆర్తితో చిత్రించాడు రచయిత. పల్లపు మతాలు, ముఖ్యంగా క్రైస్తవ మతం, కొండకు చేరుకొని ఆదివాసీల నిజమైన అస్తిత్వాన్ని నాశనం చేసి "చినుకురాలని చీకటి కొండలుగా" తయారు చేశాయని, తరతరాల కొండ సాంప్రదాయాలను మూఢనమ్మకాల పేరుతో కొట్టిపారేసి, వాళ్ళ నమ్మకాలను హేళన చేశాయని వాపోతున్నాడు రచయిత. అలాగని తాము హిందూ మతానికి కూడా దూరమని, తాము ఏ మతానికి సంబంధించినవారము కాదని, మా ఆచారాలన్నీ మా జీవన విధానానికి ఆలవాలమైనవనీ చెబుతున్నాడు.

అలాగే మార్కెట్ మేఘాలు అన్ని ప్రాంతాలను కమ్మినట్టే కొండను కూడా చుట్టుముట్టేశాయి. కొండలో జరిగే ప్రతీ మార్పుకీ కూడా పెట్టుబడి ప్రయోజనం ఖచ్చితంగా ఉంటుంది. దీని వలలో పడి గిలగిలా కొట్టుకుంటున్నాడు గిరిజనుడు. దీనిని సూక్ష్మంగా పరిశీలించి తన కథలలో చూపించాడు రచయిత. మార్కెట్‌ను ఈ రచయిత సిందవతో పోలుస్తాడు. "పులైతే.. వేటాడి తినేస్తుంది దానికాకలేస్తే, సిందవ అలాగ కాదు నక్కబుద్ధులున్న పులి, మాటు కాస్తుంది, అవసరమైతే చీకట్లో దాక్కుంటుంది, జడదు, అదును చూసి దొంగదెబ్బ తీసి కావల్సింది ఎత్తుకుపోతుంది." అలాంటి సిందవను కూడా తమ సమిష్టి జీవనంతో ఎదిరిస్తారు గిరిజనులు. కానీ మార్కెట్ సిందవ నుంచి తప్పించుకోలేకపోతున్నారని మార్కెట్ కొండను ఎలా ఏమార్చిందో తన కతలలో చూపించాడు.

"యువకులు తూలుతూ... పాన్‌పరాగ్‌లు, ఖైనీలు నములుతూ, పూరి జనం గడపల్లో రంగుల టీవీ సెట్‌ల ముందు... సీరియళ్ళ ప్రవాహంలో కొట్టుకుపోవడం లేదూ! వ్యాపార ప్రకటనల హోరులో లైవ్ క్రికెట్ మ్యాచ్‌ల్లో మునిగిపోయి, డాన్స్ షోలతో ఇళ్ళన్నీ వెలిగిపోతూ, జనం కునుకు తీస్తూ నిర్జీవంగా లేరూ! గడపల్లో కొన్ని గుంపులు పేకాట ప్రపంచంలో పడి..." ('కళ్ళం'). మార్కెట్ కొండకు కొత్త కొత్త అవసరాలు నేర్పింది. వాటిని నెరవేర్చుకోవడానికి ఫైనాన్స్ కంపెనీలను చేరారు. ఒకప్పుడు షావుకార్లకు వస్తువుల రూపంలో ఇన్‌స్టాల్‌మెంట్ కట్టేవారు. ఇప్పుడు ఫైనాన్స్ కంపెనీలకు కడుతున్నారు.

చదువుకొని అర్హతకు తగిన ఉద్యోగాన్ని సంపాదించుకున్న గిరిజనులు పట్నాలకు వచ్చి, నాగరిక మానవుడిగా మారి, తనలో సహజంగా ఉన్న సున్నితత్వాన్ని, నిజమైన అడవితనాన్ని కోల్పోతున్నాడనే ఆవేదనను తన కథలలో బలంగా చూపించాడు రచయిత. "నేస్తరికం చెయ్యడం... ఆశ్రయమివ్వడం... ఓదార్పునివ్వడం..." ఇవి అడవితనం లక్షణాలు. నాగరికత పేరుతో అభివృద్ధి మోజులోపడి వీటినిప్పుడు కోల్పోతున్నారనే ఆవేదన రచయితలో అడుగడుగునా కనిపిస్తుంది. అలాగే ఆడపిల్లలు సగం సగం చదువులతో, మైదాన ప్రాంత మాయలలో పడి జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్న స్థితి, వీళ్ళ రిజర్వేషన్‌లను వాడుకొని రాజకీయ పదవులు కూడా పొందుతున్న మైదాన ప్రాంత మోసాలు 'ఇప్పపూలు', 'శిలకోల' కథలలో మనకు కనిపిస్తాయి.

ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమం కోసం కొన్ని పథకాలు ప్రవేశపెట్టడం, గిరిజనులకు ఏమికావాలో అవి కాకుండా, ఆఫీసర్లకు ఏది మంచిదనిపిస్తే అదే సంక్షేమ పథకంగా పెట్టడాన్ని రచయిత ఆక్షేపిస్తాడు. ఈ క్రమంలో గిరిజనులను, నాగరిక లక్షణాలు అలవరచుకున్న సాటి గిరిజనులే మోసం చేయడాన్ని తన కథలలో చూపించాడు. 'పోరలు' కథలో ప్రభుత్వాధికారులు గిరిజనులను ఎలా మోసం చేస్తారో చెబితే, 'దారి' కథలో గిరిజనుడే రాజకీయ నాయకుడయ్యాక సాటి గిరిజనుల సబ్సిడీలను ఎలా దోచుకుంటున్నాడో నిర్మొహమాటంగా చెప్పాడు. అలాగే ఈ మధ్య కాలంలో కొండను బాగా ఆవరించిన మూఢాచారం 'సిల్లంగి' అనీ ఇది ప్రబలంగా పెరుగుతుందనే ఆవేదన రచయిత కథలలో మనకు కనిపిస్తుంది. ఇన్ని అవలక్షణాలు కొండను ఆవరించినా మరలా సమిష్టి తత్వం వస్తుందనే ఆశ రచయితలో బలంగా కనిపిస్తుంది. షావుకారుని నమ్మి మోసపోయిన సిరిమెల తన భూమిని ఊరంతా కలసి సమిష్టిగా వ్యవసాయం చేసుకోమని చెబుతుంది. ఊరు కూడా దానికి అంగీకరించడం 'కళ్ళం' కథలో మనకు కనిపిస్తుంది. అలాగే 'గురి' కథలో పెట్టుబడిని వ్యతిరేకించాలంటే జనాలందరినీ సంఘటితం చేసే అధ్యయనం అవసరం అనీ, ఆ దిశగా కొత్త తరం సిద్ధమౌతుందనే ఆశను వ్యక్తపరుస్తాడు.

అడవికి దూరమైనా అడవితనాన్ని విడిచిపెట్టకుండా, తన మూలాలను కాపాడుకోవాలనే ఆలోచనను తన తరువాతి తరానికి బలంగా తన కథల ద్వారా అందిస్తున్నాడు మల్లిపురం జగదీష్. వాళ్ళ జీవితాల్లోంచే వచ్చిన రచయితగా ఆదివాసీలు ఏమి కోల్పోతున్నారో, వాళ్ళ నిజమైన సంస్కృతి ఏంటో లోకానికి ఎఱుకపరచడానికి కథా ప్రక్రియను ఎంచుకున్నాడు. పాఠకుడిని ఉత్సుకతతో కథలోకి తీసుకువెళ్ళడమే కాకుండా, ఉత్కంఠతో చదివించడం, కొత్త కొత్త ప్రయోగాలను కథలోకి తీసుకురావడం, నిజాయితీగా కథను చెప్పడం ఈ రచయిత బలాలు.

అల్లి మోహన రావు
99638 95636

'ఈశాన్యం'లోనూ నిరాశే

- ఈ సీజన్‌లో ఏపీలో 24 శాతం లోటు వర్షపాతం
- రాయలసీమలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు
- కోస్తాలో పలు జిల్లాల్లోనూ వానలు తక్కువే
- వాతావరణ మార్పులతోనే వర్షాభావం: నిపుణులు

విశాఖపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో భారీగా లోటు వర్షపాతం నమోదుతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడింది. భూగర్భజలాలు దారుణంగా పడిపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమైంది. అక్టోబరులో ప్రారంభమైన ఈశాన్య రుతుపవనాల సీజన్ అయినా ఆదుకుంటుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. దక్షిణాది రాష్ట్రాలకు పరిమితమైన ఈశాన్య రుతుపవనాలు ఏపీకి చాలా వరకు ముఖం చాటేశాయి. ప్రధానంగా రాయలసీమలో తీవ్ర వర్షాభావం నెలకొనగా దక్షిణ కోస్తాలో ప్రకాశం జిల్లాలో ఆశించినంత వర్షాలు కురవలేదు. ఉత్తరాంధ్రలో లోటు వర్షపాతం నమోదైంది. డిసెంబరు 5న కోస్తాలో తీరం దాటిన మిచౌంగ్ తుఫాన్ సంభవించి ఉండకపోతే మరింత దుర్భిక్ష పరిస్థితులు నెలకొని ఉండేవి. ఈశాన్య రుతుపవనాల సీజన్ అయిన అక్టోబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు రాష్ట్రంలో 287.2 మి.మీ.లకుగాను 219 మి.మీ. (24 శాతం లోటు) వర్షపాతమే నమోదైంది. కోస్తాలో 322.2 మి.మీ.లకు 265.8 (సాధారణం కంటే 18 శాతం తక్కువ) మి.మీ, రాయలసీమలో 236.4 మి.మీ.లకు 164.7 (సాధారణం కంటే 30 శాతం తక్కువ) మి.మీ. వర్షపాతం నమోదైంది. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలు ఈశాన్య రుతుపవనాలపై ఆధారపడుతుంటాయి. ఈ నేపథ్యంలో రాయలసీమలో సాధారణం కంటే నంద్యాల జిల్లాలో 89 శాతం, అనంతపురంలో 73, కర్నూలులో 69, కడపలో 63, సత్యసాయిలో 55, అన్నమయ్యలో 35, చిత్తూరు జిల్లాలో 26 శాతం తక్కువ వర్షపాతం నమోదుకావడంతో తీవ్ర వర్షాభావం నెలకొంది. ఉత్తరాంధ్రలో సాధారణం కంటే శ్రీకాకుళం జిల్లాలో 75 శాతం, పార్వతీపురం మన్యంలో 51, విశాఖపట్నం, విజయనగరంలో 36 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఇంకా దక్షిణ కోస్తాలో ప్రకాశం జిల్లాలో 291.5 మి.మీ.లకు 201.2 మి.మీ. వర్షపాతం నమోదుతో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. అక్టోబరు నుంచి డిసెంబరు నెలాఖరుకు ఈశాన్య రుతుపవనాల సీజన్‌గా వాతావరణ నిపుణులు పరిగణిస్తారు. అయితే ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో మార్పుల కారణంగా అక్టోబరులో ఈశాన్య రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించిన నేపథ్యంలో మరి కొద్దిరోజులు కొనసాగే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు.

బలహీనంగా రుతుపవనాలు

ఈశాన్య సీజన్‌లో బంగాళాఖాతంలో తుఫాన్‌లు/వాయుగుండాలు, ఇంకా తూర్పుగాలుల ప్రభావంతో కోస్తా, రాయలసీమలో వర్షాలు కురుస్తుంటాయి. అయితే అక్టోబరు, నవంబరు నెలల్లో బంగాళాఖాతంలో ఏర్పడిన హమూన్, మిధిలీ తుఫాన్‌లు దిశమార్చుకుని బంగ్లాదేశ్ వైపు వెళ్లిపోయాయి. దీనికితోడు తూర్పుగాలులు బలంగా లేక రుతుపవనాలు బలహీనంగా మారడంతో నవంబరు నెలాఖరు వరకు వర్షాలు లేవు. డిసెంబరు మొదటి వారంలో సంభవించిన మిచౌంగ్ తుఫాన్ బాపట్ల వద్ద తీరం దాటడంతో కోస్తాలో నెల్లూరు నుంచి కాకినాడ వరకు (ప్రకాశం తప్ప) వర్షాలు కురిశాయి. రాయలసీమలో తిరుపతి తప్ప మిగిలిన జిల్లాల్లో చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. ఆ తర్వాత తూర్పుగాలులు జాడ కనిపించకపోవడంతో రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో పొడివాతావరణం నెలకొంది. విచిత్రమేమిటంటే ఈ ఏడాది తమిళనాడు, కేరళల్లో ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో కుంభవృష్టిగా వర్షాలు కురిశాయి. దక్షిణ తమిళనాడులో ఇంకా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. తమిళనాడు, కేరళకు మాత్రమే పరిమితమైన ఈశాన్య రుతుపవనాల సీజన్ వర్షాలు ఏపీకి ముఖం చాటేయడం అసాధారణమేనని ఆంధ్ర విశ్వవిద్యాలయ వాతావరణ విభాగం విశ్రాంత ఆచార్యులు ఓఎస్ఆర్‌యూ భానుకుమార్ పేర్కొన్నారు. గతంలో ఇటువంటి సందర్భాలున్నప్పటికీ తుఫాన్‌లు, తూర్పుగాలుల వల్ల దక్షిణ కోస్తా, రాయలసీమలో మంచి వర్షాలు కురిసేవని వివరించారు. వాతావరణ మార్పుల ప్రభావంతో బంగాళాఖాతంలో తుఫాన్‌లు దిశ మార్చుకున్నాయన్నారు. సాధారణంగా ఎల్‌నినో సంవత్సరాల్లో ఈశాన్య రుతుపవనాలు బలంగా ఉండి దక్షిణాది రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురవాలని, అయితే వాతావరణ మార్పుల ప్రభావంతో భారీ వర్షాలు తమిళనాడు, కేరళ రాష్ట్రాలను ముంచెత్తగా, ఆంధ్రప్రదేశ్‌లో వర్షాభావం నెలకొందని చెప్పారు. డిసెంబరు నెల మూడో వారం వరకు రాష్ట్రంలో చలి జాడ కనిపించలేదని వివరించారు.

యువతీయువకుల బలవన్మరణం

మిర్యాలగూడ అర్బన్, డిసెంబరు 31 : ఇద్దరు యువతీయువకులు రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వే ఎస్‌ఐ పవన్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మిర్యాలగూడ రైల్వేస్టేషన్ పరిధిలోని 115వ మైలురాయి వద్ద రైలుపట్టాలపై ఆదివారం వీరి మృతదేహాలను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. యువకుడి జేబులో శనివారం ఉదయం 11 గంటలకు విజయవాడ రైల్వేస్టేషన్‌లో కొన్న టికెట్ గుర్తించామన్నారు. జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించేందుకు టికెట్లు కొనుగోలు చేసినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. యువకుడి కుడిచేతిపై రామలక్ష్మ అనే పేరుతో టాటూ ఉంది. ఇతడి వయసు 30 ఏళ్లు, యువతి వయస్సు సుమారు 25 ఏళ్లు ఉంటుంది.



తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపులంకలోని పల్ల వెంకన్న నర్సరీలో నూతన సంవత్సరం-2024 సందర్భంగా వివిధ రకాల అందమైన వేలాది మొక్కలతో ఏర్పాటు చేసిన కొత్త ఏడాది స్వాగత తోరణం



తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపులంకలోని సత్యదేవ నర్సరీలో నూతన సంవత్సరం-2024 సందర్భంగా వివిధ రకాల అందమైన వేలాది మొక్కలతో ఏర్పాటు చేసిన కూర్పు

కార్నియా అంధత్వానికి మూలకణ చికిత్స

ఎల్వీ ప్రసాద్ వైద్యుల ఆవిష్కరణ

- 20 ఏళ్లకు పేటెంట్ మంజూరు
- ప్రస్తుతం క్లినికల్ ట్రయల్స్
- విజయవంతమైతే కంటి చికిత్సలో కీలక మైలురాయిగా నిలిచే అవకాశం


ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు వివేక్‌సింగ్, సయన్ బసు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పారదర్శకమైన కంటి బయటి పొర (కార్నియా) చికిత్సలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు ఆవిష్కరించిన ఓ వినూత్న ప్రక్రియకు పేటెంట్ లభించింది. మూలకణాలతో (స్టెమ్ సెల్స్‌తో) జరిపే ఈ చికిత్సకు 20 ఏళ్ల కాలానికి కేంద్ర ప్రభుత్వం పేటెంట్ మంజూరు చేసింది. ఈ సెల్ థెరపీని నేత్ర వైద్యులు సయన్ బసు, వివేక్ సింగ్ అభివృద్ధిపరిచారు. ప్రస్తుతం ఈ థెరపీ పరీక్ష (క్లినికల్ ట్రయల్స్) దశలో ఉంది. కార్నియా దెబ్బతిన్నప్పుడు ఇన్ఫెక్షన్, ప్రమాదాల కారణంగా పొర అపారదర్శకంగా మారి కార్నియల్ మచ్చలు ఏర్పడుతాయని డాక్టర్ సయన్ బసు, డాక్టర్ వివేక్‌సింగ్ తెలిపారు. అంధత్వం, దృష్టి లోపానికి కార్నియా సమస్య ఒక ప్రధాన కారణమని, అటువంటప్పుడు కార్నియల్ మార్పిడి అవసరమవుతుందన్నారు. అయితే కార్నియల్ మార్పిడి శస్త్రచికిత్స చాలా క్లిష్టమని, ఆపరేషన్ తర్వాత జీవితకాలం పాటు అనేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. తాము అభివృద్ధి పరిచిన స్టెమ్‌సెల్స్ చికిత్స ద్వారా కార్నియల్ మూలకణాలను ఉపయోగించి కార్నియాను మెరుగుపర్చటం సాధ్యపడుతుందని చెప్పారు. కార్నియా ఆకారాన్ని కలిగి ఉండే కనెక్టివ్ ప్రొటీన్ కార్నియల్ కొల్లాజెన్‌ను స్టెమ్‌సెల్ థెరపీతో పునరుజ్జీవింపచేయవచ్చని, తద్వారా కొల్లాజెన్ కార్నియాను బలోపేతం చేస్తుందని డాక్టర్ వివేక్ సింగ్ తెలియజేశారు. ఈ థెరపీ నేత్ర పరిశోధన రంగంలో ఓ కీలక మైలురాయి వంటిదని, అదే సమయంలో కార్నియల్ అంధత్వంతో సతమతమయ్యే ఎంతోమందికి మేలు చేస్తుందని డాక్టర్ సయన్ బసు తెలిపారు. క్లినికల్ ట్రయల్స్ విజయవంతమైతే కార్నియల్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు సంభవిస్తాయన్నారు.

కాకతీయులనాటి శిలాశాసనం లభ్యం

- ప్రకాశం జిల్లాలో వెలుగులోకి..
- 1193-1272 మధ్య చెక్కినట్టు గుర్తింపు

మార్కాపురం రూరల్, డిసెంబరు 31: కాకతీయుల కాలం నాటి రాతి శిలాశాసనం ఒకటి ప్రకాశం జిల్లాలో బయటపడింది. పెద్దారవీడు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన తిరుమల రెడ్డి యోగిరెడ్డి పొలం గట్టున దీన్ని ఇటీవల గుర్తించారు. దీనిపై ఉన్న లిపిని గుర్తించేందుకు ఢిల్లీలోని పురావస్తుశాఖ అధికారులకు పంపించారు. దానశాసనంగా గుర్తించిన వారు ఆ వివరాలను ఆదివారం బహిర్గతం చేశారు. రాతిశిలపై పురాతన తెలుగు అక్షరాలతో ఉన్న లిపి 1193-1272 మధ్య చెక్కినట్టు నిర్ధారించారు. ఆ కాలంలో కాయస్థ రాజైన త్రిపురారి దేవుడు త్రిపురాంతకేశ్వరునికి మహాశివ రాత్రి పర్వదినాన వాలూరు (ప్రస్తుతం ఎస్.కొత్తపల్లి అని పిలుస్తున్నారు.) గ్రామాన్ని బహుమతిగా ఇచ్చినట్లు ఉందన్నారు. అరుదైన ఈ శాసనాన్ని భావితరాలకు ఆ నాటి చరిత్రకు గుర్తుగా భావించి భద్రపరచాలని వారు సూచించారు.


ప్రకాశం జిల్లాలో బయటపడిన కాకతీయుల కాలంనాటి శిలాశాసనం


JAN 12
WORLDWIDE RELEASE
నూతన సంవత్సర శుభాకాంక్షలు
SMT. MAMATHA PRESENTS
HAARIKA & HASSINE CREATIONS
గుంటూరు కారం
SMOKING IS INJURIOUS TO HEALTH
HIGHLY INFLAMMABLE
TRIVIKRAM
S RADHA KRISHNA
(CHINABABU)
THAMAN S MANOJ PARAMAHAMSA NAVIN NOOLI
AS PRAKASH RAM LAXMAN YUGANDHAR T
ADITYA MUSIC


నూతన సంవత్సరంలో
దర్శకేంద్రుడి నూతన ప్రయోగం
నేడే
విడుదల
PRODUCED BY K.RAGHAVENDRA RAO B.A
సర్కారు నౌకరి
DIRECTED BY GANGANAMONI SHEKAR


NIHARIKA
VENKY75
జనవరి
13
సంక్రాంతి
విడుదల
Happy New Year
2024
VENKATESH
సైంధవ్
A SAILESH KOLANU FILM
PRODUCED BY VENKAT BOYANAPALLI
A SANTHOSH NARAYANAN MUSICAL
UA


PRIMESHOW ENTERTAINMENT
SMT CHAITANYA PRESENTS
HAPPY
NEW YEAR
2024
JAN
12TH
IN THEATRES
PAN WORLD
సంక్రాంతి
విడుదల
PRASANTH VARMA CINEMATIC UNIVERSE
హను-మాన్
TELUGU HINDI MARATHI TAMIL KANNADA MALAYALAM ENGLISH SPANISH KOREAN CHINESE JAPANESE


HAPPY NEW YEAR
GA2 PICTURES
FEB
2
2024
GRAND RELEASE
WORLDWIDE
BUNNY VAS & VENKATESH MAHA
PRESENT
అంబాజీపేట
మ్యారేజి బ్యాండు
DHEERAJ MOGILINENI DUSHYANTH KATIKANENI

నూతనోత్సాహం

నగరంలో అర్ధరాత్రి యువత కేరింత







కాలచక్రం గిర్రున తిరిగింది. చూస్తుండగానే 2023 కరిగిపోయింది. జిల్లాలోని వివిధ తరగతుల ప్రజలకు ఎన్నో అనుభవాలనిచ్చింది. కొన్ని గుణపాఠాలు నేర్పింది. కొన్ని సవాళ్లు విసిరింది. అడపాదడపా వినోదాలు పంచింది. విషాదాలూ నింపింది. ఇలా అన్నిరకాల అనుభూతులు ఇచ్చి కాలగర్భంలో కలిసిపోయింది. గతాన్ని గుర్తు చేసుకుంటూ.. కొత్త లక్ష్యాలు నిర్దేశించుకుంటూ.. ప్రతి ఒక్కరూ కొండంత బలంతో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆశిస్తూ 2024 సంవత్సరానికి స్వాగతం పలుకుదాం.







సండే సందడి

పుస్తక మహోత్సవానికి పెరిగిన పాఠకులు

- ఇతర జిల్లాల నుంచి సందర్శకుల రాక
- కిక్కిరిసిన ప్రాంగణం

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న పుస్తక మహోత్సవానికి పాఠకులు భారీగా తరలి వచ్చారు. ఆదివారం కావడంతో పుస్తక మహోత్సవ ప్రాంగణం పుస్తక ప్రియులతో సందడిగా కనిపించింది. విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచే కాకుండా ప్రకాశం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి సందర్శకులు వచ్చారు. పిల్లలకు కథల పుస్తకాలను, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను కొనుగోలు చేసిన తల్లిదండ్రులు వారికి ఆ ప్రాంగణంలోనే వాటిని చదివిస్తున్నారు. ఉపాధ్యాయులు వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చారు. కొంతమంది పాఠకులు మాత్రం ప్రసిద్ధి చెందిన పాత పుస్తకాల కోసం ప్రతి స్టాల్‌లో తిరుగు తున్నారు. ఈ మూడు రోజుల్లో పిల్లలకు సంబంధించిన కథల పుస్తకాలు ఎక్కువగా అమ్మకాలు సాగాయని ప్రచురణకర్తలు చెబుతున్నారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్



జోర్దార్.. షాపింగ్

నగరంలో న్యూ ఇయర్ సందడి

- వన్‌టౌన్‌లో డైరీలు, ఇయర్ ప్లానర్స్ భారీగా కొనుగోలు
- స్వీట్స్ దుకాణాలు, బేకరీలు కిటకిట
- బొకేలు, గిఫ్ట్ ఆర్టికల్స్ షాపుల్లోనూ సందడి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం నగరంలో ఆదివారం జోర్దార్ షాపింగ్ జరిగింది. సెలవు దినం కూడా కావటంతో షాపింగ్ పతాక స్థాయిలో జరిగింది. న్యూ ఇయర్‌ను పురస్కరించుకుని కంపెనీలు, సంస్థలు తమ ఉద్యోగులు, శ్రేయోభిలాషులు, ఖాతాదార్లకు బహుమతిగా ఇచ్చేందుకు డైరీలు, క్యాలెండర్స్, పాకెట్ క్యాలెండర్స్, ఇయర్ ప్లానర్స్, పెన్నులు, చిరు కానుకలు వంటివి పెద్దఎత్తున కొనుగోళ్లు జరిగాయి. బల్క్‌గా కొనుగోలు చేసేందుకు రావటంతో వన్‌టౌన్ కిటకిటలాడింది. డైరీలు, క్యాలెండర్లు విక్రయించే దుకాణాల దగ్గర విపరీతమైన రద్దీ నెలకొంది. వన్‌టౌన్ మార్కెట్ నుంచి భారీ స్థాయిలో డైరీలు, క్యాలెండర్లు, ఇయర్ ప్లానర్స్ కొనుగోళ్లు జరిగాయి. వీటి రవాణాతో వన్‌టౌన్ మార్కెట్‌లో కోలాహలం నెలకొంది. నగరంలో స్వీట్ దుకాణాలు ఫుల్ బిజీగా మారిపోయాయి. బల్క్ ఆర్డర్లు భారీస్థాయిలో ఉండటంతో.. స్వీట్ల దుకాణాలు అయితే ఖాళీగా లేవు. కంపెనీలు కూడా పెద్దఎత్తున ఆర్డర్లు ఇవ్వటంతో పాటు వ్యక్తిగతంగా కూడా కొనుగోలు చేయటానికి పెద్ద సంఖ్యలో రావటంతో స్వీట్ల దుకాణాలు అయితే ఖాళీగా లేవు. బేకరీ న్యూ ఇయర్ సందర్భంగా కేక్‌లకు డిమాండ్ ఉండటంతో.. న్యూఇయర్ కేకులకు సంబంధించి అవుట్‌లెట్స్ ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. బొకేలు విక్రయించే షాపులకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. జనవరి 1న భవానీ ఐల్యాండ్‌లో ఈవెంట్లు నిర్వహించటానికి వీలుగా బుకింగ్స్ కూడా భారీగా జరిగాయి. ప్రైవేటు మార్కెటింగ్ సంస్థలు, రియల్ ఎస్టేటు సంస్థలు తమ ఎగ్జిక్యూటివ్‌లను సన్మానించేందుకు పార్టీలను ఏర్పాటు చేసుకోవటానికి ఎక్కువగా బుకింగ్ చేసుకున్నాయి.


రిజిస్ట్రేషన్లతో కిటకిటలాడుతున్న గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రిజిస్ట్రేషన్ల కోలాహలం

కొత్త ఏడాది ముందే రుణ విముక్తి కోసం భారీగా మార్ట్‌గేజ్ రిలీజ్‌లు

నూతన సంవత్సరం రాబోతుండటంతో నగరంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి. పటమట, గాంధీనగర్, గుణదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు సందర్శకులతో కిక్కిరిసిపోతున్నాయి. ప్రధానంగా గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మూడు రోజులుగా రద్దీ నెలకొంటోంది. శనివారం కార్యాలయంలో రద్దీ పతాక స్థాయిలో ఉంది. నూతన సంవత్సరం ముగియటానికి ముందు సందర్శకులు పోటెత్తారు. గత మూడు రోజులుగా రాత్రుళ్లు ఎంత సమయం అయినా కూడా అధికారులు ఇక్కడే ఉండి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశాకే వెళుతున్నారు. కొత్త ఏడాది వచ్చేలోపే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ముగించుకోవాలన్న ఉద్దేశంతో పార్టీలంతా పెద్దసంఖ్యలో రావటంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఈ సందడి నెలకొంది.

- మూడు కార్యాలయాల్లో మార్ట్‌గేజ్ రిలీజ్‌ల సందడి
- పెళ్లి రిజిస్ట్రేషన్లు, గిఫ్ట్ డీడ్స్‌తో కార్యాలయాలు బిజీ
- గాంధీనగర్‌లో పోటెత్తిన సందర్శకులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నూతన సంవత్సరం ముగుస్తున్నందున సింహభాగం మార్ట్‌గేజ్ రిలీజ్‌లకు సంబంధించి అధిక భాగం డాక్యుమెంట్లు వస్తున్నాయి. నూతన సంవత్సరం నాటికి రుణ విముక్తులు కావాలన్న ఉద్దేశంతో మార్ట్‌గేజ్‌లను విడిపించుకోవటానికి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. నగరంలోని మూడు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో బ్యాంకు ప్రతినిధులు, మార్ట్‌గేజ్ రిలీజ్ చేయించుకునే వారితో కోలాహలంగా ఉంది. గిఫ్ట్ డీడ్స్ కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. ఇవి కాకుండా అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించిన డాక్యుమెంట్లు కూడా బాగానే వచ్చాయి. పెళ్లి రిజిస్ట్రేషన్లకు సంబంధించి కూడా గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎక్కువగా వస్తున్నారు. అన్ని కేటగిరీలకు సంబంధించి ఒక్కసారే రావటంతో.. అనూహ్యంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో రద్దీ ఏర్పడింది. అదృష్టవశాత్తూ ఎలాంటి సర్వర్ సమస్యలు లేకపోవటంతో.. సందర్శకులకు ఇబ్బందులు లేకుండా పోయాయి. ఇటీవల 2 ఎంబీపీఎస్ నుంచి 4 ఎంబీపీఎస్‌కు నెట్‌వర్క్ స్పీడ్‌ను పెంచటం వల్ల ఈ కేవైసీ, ఈ సైన్‌లు చేయటానికి గతంలో మాదిరిగా పెద్దగా సమయం తీసుకోవటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో సర్వర్ సమస్యలొస్తే తీవ్ర ఇబ్బందులు నెలకొనే అవకాశం ఉంది. అదృష్టవశాత్తూ అలాంటిదేమీ లేకపోవటంతో న్యూ ఇయర్ సందర్భంగా రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయి.

బెజవాడకు అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ రాక నేడే



ఆదివారం ప్రారంభించిన ప్రధాని మోదీ

- మాల్డా టౌన్ నుంచి బయలుదేరిన రైలు
- ఉదయం 8.30 గంటలకు బెజవాడకు..
- స్వాగతం పలికేందుకు అధికారుల ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పశ్చిమ బంగాలోని మాల్డా టౌన్ వయా విజయవాడ బెంగళూరు మధ్య ప్రధాని మోదీ ఆదివారం ప్రారంభించిన అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ సోమవారం ఉదయం 8.30 గంటలకు విజయవాడ రైల్వేస్టేషన్‌కు వస్తుంది. విజయవాడ రైల్వేస్టేషన్‌లో అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఘనస్వాగతం పలికేందుకు రైల్వే అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్, ఇతర రైల్వే అధికారులు ఈ రైలుకు స్వాగతం పలకనున్నారు. నూతన అమృత్ భారత్ రైలు విజయవాడ డివిజన్ పరిధిలో విశాఖపట్నం, తుని, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు , విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. అక్కడి నుంచి కట్పడి, జోలార్‌పేటల మీదుగా బెంగళూరు చేరుకుంటుంది.

మున్సిపల్ కార్మికుల దీక్ష భగ్నం

- సీఐటీయూ నేత అరెస్టు.. ఆసుపత్రిలో చేరిక
- మాట తప్పిన సీఎం: మాజీమంత్రి ఉమా

- 8లో..

న్యాయవాదుల ఉద్యమం విరమించలేదు

- బెజవాడ బార్ అధ్యక్షుడు కేబీ సుందర్

- 8లో..


అంగన్వాడీల నినాదాలు


మున్సిపల్ కార్మికుల నినాదాలు

అలుపెరగని పోరు

అంగన్వాడీలు అలుపెరగని పోరాటం చేస్తున్నారు. సీఎం జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నాచౌక్ వద్ద చేపట్టిన సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరింది. సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన దీక్ష ధర్నాచౌక్ వద్ద ఉధృతంగా సాగుతోంది.

సాహితీ సౌరభాలు..


జానీ కృష్ణ నాయక్ బి.రవీంద్ర

తొలి సందర్శకులు..

విజయవాడ సిటీలైఫ్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఒకరిది పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు. మరొకరిది తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం. ఇంకొకరిది ప్రకాశం జిల్లా మార్కాపురం. ముగ్గురి ప్రాంతాలు వేరయినా వృత్తి మాత్రం ఒక్కటే. పుస్తకాలతో నిత్యం సరస్వతీ నిలయంలో సహవాసం చేసే ఈ ముగ్గురు ఉపాధ్యాయులు తొలిసారిగి పుస్తక మహోత్సవానికి వచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన జానీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూనే గ్రూపు 2 పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను కొనుగోలు చేయడానికి స్నేహితులతో కలిసి ఆదివారం పుస్తక మహోత్సవానికి వచ్చాడు. ఇంతకుముందు హైదరాబాద్‌లో జరిగే బుక్ ఫెస్టివల్‌కు వెళ్లేవాడినని విజయవాడలో పుస్తక మహోత్సవానికి రావడం ఇదే తొలిసారి అని జానీ చెప్పారు. రాజమహేంద్రవరానికి చెందిన బి.రవీంద్ర ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పుస్తక మహోత్సవానికి వచ్చారు. ఇక్కడికి రావడం ఇదే మొదటిసారి అని రవీంద్ర చెప్పారు. తిలక్, బుచ్చిబాబు, చలం, బాపు, రమణల సాహిత్యం తనకు ఎంతో ఇష్టమని తెలిపారు. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన కృష్ణ నాయక్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు. ఎనిమిదేళ్ల వయస్సు నుంచే పుస్తక పఠనం ఒంటబట్టిందని ఆయన చెప్పారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతోపాటు ఆధ్యాత్మిక పుస్తకాలు, విప్లవాలకు సంబంధించిన పుస్తకాలు అంటే తనకు బాగా ఆసక్తి అని తెలిపారు. ఈ ముగ్గురు వారివారి పాఠశాలల్లో ప్రత్యేకంగా రీడింగ్ పిరియడ్లను పిల్లలకు ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో ఉన్న గ్రంథాలయంలో 400 - 500 వరకు చందమామ, బేతాళకథలు, పేదరాసి పెద్దమ్మ కథల పుస్తకాలు ఉన్నాయని, వారంలో రెండు సార్లు పిల్లలతో ఈ పుస్తకాలు చదివిస్తామని చెప్పారు.



నిలువెత్తు పాఠం..

విజయవాడ కల్చరల్ : నాగార్జున సాగర్ ఏపీ రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్గీయ వైవీ రెడ్డి వ్యక్తిగత, వృత్తి గత జీవితం రెండూ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారందరికీ మార్గదర్శకమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. 34వ పుస్తక మహోత్సవం నాలుగో రోజు ఆదివారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదిక నాగార్జున సాగర్ ఏపీ రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్గీయ వైవీ రెడ్డి స్మృతి సంచిక 'నిలువెత్తు పాఠం' పుస్తకాన్ని ఐఏఎస్ అధికారి మహ్మద్ ఇంతియాజ్ ఆవిష్కరించారు. లయోలా కళాశాల అధ్యాపకులు మొవ్వా శ్రీనివాసరెడ్డి, కుటుంబసభ్యులు బ్రిగేడియర్ వెంకటరెడ్డి తదితరులు మాట్లాడారు.

ఏ రచయిత ఏ పుస్తకం రాసినా.. ఎవరు ఏ నాటిక రాసినా.. దానికి ఒక గుర్తింపు రావాలనుకుంటారు. 'స్థానిక' గుర్తింపు కంటే కేంద్ర గుర్తింపును రచయితలు కోరుకుంటారు. ఇలా అనేక మంది రచయితలను, రచనలను కేంద్ర సాహిత్య అకాడమీ గుర్తించింది. కేంద్ర సాహిత్య అకాడమీ గుర్తింపు పొందిన ఉత్తమ రచనలకు సంబంధించిన పుస్తకాలు పుస్తక మహోత్సవంలో కొలువయ్యాయి. కేంద్ర సాహిత్య అకాడమీ బెంగళూరు శాఖకు చెందిన స్టాల్ ఏడులో ఉంది. కన్నడ - తెలుగు నిఘంటువు, శవాలను మోసేవాడి కథ, తెలుగు గిరిజన సాహిత్యం, అంతఃపురం, భారతీయ భాషా కథలు, పాకిస్తాన్ కథలు, ఆకాశం నా వశంతోపాటు అనేక పుస్తకాలకు కేంద్ర సాహిత్య అకాడమీ గుర్తింపును ఇచ్చింది. తెలుగులో ముద్రణ అయిన పుస్తకాలు, తెలుగు అనువాద పుస్తకాలు ఈ స్టాల్‌లో ఉన్నాయి. సీనియర్ సిటిజన్లు ఈ పుస్తకాలను కొనుగోలు చేయడానికి ఆసక్తిని చూపిస్తున్నారు.



న్యాయ రూపాలు

ఒక్కో కేసుకు ఒక్కో చట్టం. ఒక్కో చట్టానికి ఒక్కో పుస్తకం. న్యాయస్థానాలు, అందులో దాఖలయ్యే పిటిషన్లకు వర్తించే సెక్షన్లు, నేరాల విచారణకు సంబంధించిన పుస్తకాలను కొనుగోలు చేయడానికి యువ న్యాయవాదులు ఆసక్తిని చూపిస్తున్నారు. పుస్తక మహోత్సవంలో స్టాల్ నంబర్ 22లో సుప్రీం లా హౌస్‌లో న్యాయస్థానాలకు, కేసులు, చట్టాలకు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయి. వివాహం, విడాకుల చట్టం, మహిళా వివాదాలు, కట్నం నిషేధ చట్టం 1961, ఏపీ భూసంస్కరణల చట్టం, ఏపీ అపార్ట్‌మెంట్ల చట్టం, కోర్టు ఫీజులు, మేధో సంపత్తి చట్టం, నేర విచారణ ప్రక్రియ స్మృతితోపాటు వివిధ చట్టాలకు చెందిన పుస్తకాలను ప్రదర్శనలో ఉన్నాయి. న్యాయవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, న్యాయవాద వృత్తిలోకి కొత్తగా అడుగు పెట్టిన యువన్యాయవాదులు ఈ పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు.



పసలపూడి అక్షరాలు

అక్షరాల్లో ప్రకృతిని, పల్లెవాతావరణాన్ని ప్రతిబింబించే రచయిత వంశీ. ఆయన స్వగ్రామం కోనసీమ జిల్లా పసలపూడి పేరుతో అనేక పుస్తకాలు రాశారు. పసలపూడి కథల పేరుతో వంశీ రాసిన పుస్తకాలు పాఠక లోకాన్ని ఆకట్టుకున్నాయి. వంశీ కలం నుంచి జాలువారిన రచనల పుస్తకాలు పుస్తక మహోత్సవంలో ప్రత్యేకార్షణగా ఉన్నాయి. స్టాల్ నంబర్ 90లో ఉన్న ఎమెస్కో ప్రచురణ సంస్థలో వంశీ రాసిన మన్యంరాణి, ఆకుపచ్చని జ్ఞాపకం, వంశీకి నచ్చిన కథలు, పసలపూడి కథలు, ఏవో... కొన్ని గుర్తుకొస్తున్నాయి, మా దిగువ గోదావరి కథలు, గోకులంలో రాధా, మంచుపల్లకి, పొలమారిన జ్ఞాపకాలు పుస్తకాలను సినిమా ప్రియులు పరిశీలిస్తున్నారు.



(ఆంధ్రజ్యోతి - విజయవాడ సిటీలైఫ్)


మరో కుంతి పుస్తకాన్ని జేడీ లక్ష్మీనారాయణకు అందిస్తున్న ఐఏఎస్ అధికారి ఇంతియాజ్, వెన్నా వల్లభరావు తదితరులు

అనువాదం.. ఒక వరం

విజయవాడ కల్చరల్, డిసెంబరు 31 : మూల భాషలో చదువుకోలేని వారికి అనువాదాలు ఒక వరమని ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ అన్నారు. 34వ పుస్తక మహోత్సవంలో ఆదివారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై డాక్టర్ వెన్నా వల్లభరావు రాసిన మరో కుంతి కథా సంపుటాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనాటి సమాజంలో ప్రతిబింబించే కథలన్నీ కూడా ఈ మరో కుంతీ సంపుటంలో చేర్చారన్నారు. సంపుటంలో ఉన్న కథల విశిష్టలను గుమ్మా సాంబశివరావు మట్లాడుతూ, వెన్నా వల్లభరావు అనువాదాన్ని అలవోకగా రాయకుండా మూల రచయిత చెప్పిన భావానికి తగినట్టు తెలుగు పదాలను ఏ విధంగా ప్రయోగిస్తే బాగుంటాయో ఆ శైలిని వినియోగించడం ఆయన ప్రత్యేక అనువాద మార్గమన్నారు. తెలుగు పలుకుబడిను జాగ్రత్తగా మేళవిస్తూ అనువాదం చేయడంలో ప్రావీణ్యత వుందన్నారు. దాని వల్ల పట్టణావళి అధికంగా పెరుగుతుందన్నారు. పాటిబండ్ల రజని వివరిస్తూ అనువాదకుడి సామర్థ్యాన్ని ప్రశంసించారు. పురాణకాలం నుంచి ఆధునిక కాలం వరకు స్త్రీలు విషాద జీవితాన్ని అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంపుటంలోని సామాన్య మానవులలోని విభిన్న కోణాలను హృద్యంగా చర్చించారని వివరించారు. డాక్టర్ కొచ్చెర్లకోట వెంకట సుబ్బారావు, సాహితీ పోషకులు గోళ్ల నారాయణరావు సభకు అధ్యక్షత వహించారు. తొలి పుస్తకాన్ని మాజీ సీబీఐ అధికారి లక్ష్మీనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో చింతా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తెలుగు కథాలోకంలో కారా స్థానం సుస్థిరం

తెలుగు సాహిత్యంలో నిజాయితీతో కూడిన రచయిన కాళీపట్నం రామారావు (కారా) అని వక్తలు అన్నారు. ఆదివారం కేతు విశ్వనాథ రెడ్డి సాహిత్య వేదికపై కాళీపట్నం రామారావు శతజయంతి సభ నిర్వహించారు. సభలో ప్రధాన వక్తగా కాళీపట్నం రామారావు శిష్యుడు సన్నిహితుడు అట్టాడ అప్పలనాయుడు మాట్లాడారు. కారా మాస్టారి కథలు పాఠకులకు తమ చుట్టూ వున్న సమాజాన్ని లోతుగా అర్థం చేసుకొనే శక్తిని కల్పిస్తాయన్నారు. సామాజిక, ఆర్థిక న్యాయాలకు సబంధించిన మౌలిక సూత్రాలను తన కథలలో అంత లీనంగా పొదగడం ఆయన గొప్పదనమన్నారు. కథా నిలయం స్థాపకులుగా కాళీపట్నం రామారావు తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానం సంపాదించారని అరసం అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ చెప్పారు. విశాలాంధ్ర పబ్లికేషన్స్ మేనేజర్ మనోహరనాయుడు పాల్గొన్నారు.

● కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై విశాలాంధ్ర పబ్లిషర్స్ వారు 'వివృత' పేరుతో ప్రచురించిన కథా విమర్శ వ్యాసాల సంపుటిని మురహరి నాగరాజకుమార్ ఆవిష్కరించారు. కథా రచయితలు కూనపరాజు కుమార్, అజయప్రసాద్, కాకుమాని శ్రీనివాసరావులు ప్రసంగించారు.

పుస్తక మహోత్సవ పాదయాత్ర నేడు

పుస్తక మహోత్సవంలో ఐదో రోజు సోమవారం పుస్తక ప్రియుల పాదయాత్ర నిర్వహిస్తారు. సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాల వద్ద పాదయాత్రకు జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పచ్చజెండా ఊపుతారు. సంపాదకులు వర్దెల్లి మురళి నాయకత్వం వహిస్తారు. పాదయాత్ర 5 నెంబరు రోడ్డుమీదుగా పుస్తక ప్రాంగణానికి చేరుకుంటుంది. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

సమాజ మార్పు కోసమే సాహిత్యం, కళలు..

విజయవాడ కల్చరల్, డిసెంబరు 31 : సమాజ మార్పు కోసమే సాహిత్యం, కళలు అని, సమాజం నుంచి స్ఫూర్తిపొందిన కవిత్వమే సమాజాన్ని కదల్చగలుగుతుందని పాత్రికేయుడు కవి జాలూరు గౌరీశంకర్ చెప్పారు. 34వ పుస్తక మహోత్సవంలో నాలుగో రోజు ఆదివారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై 'జాలూరు పథం' పేరుతో పాత్రికేయుడు జాలూరు గౌరీశంకర్ రాసిన దీర్ఘ కవిత పుస్తకాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత్వంపై సాహిత్యం యొక్క, సమాజం యొక్క ప్రభావాన్ని గురించి నారాయణ, గౌరీ శంకర్‌లు ముఖాముఖీ చర్చ నిర్వహించారు. సమాజంలో చైతన్యాన్ని కవులు అందంగా ప్రభావవంతంగా ప్రతిఫలించి మరో పదిమందికి చేరుస్తారని ఆయన వివరించారు. కవులు, సాహిత్యకారులు సమాజంలో మార్పుకు స్ఫూర్తినిస్తూ, సమాజ పరిమాణంలో వివిధ దశలకు దోహదం చేస్తారని చెప్పారు. కళ కళకోసం మాత్రమే వుంటే అది ప్రజల మెప్పు పొందలేదని ఆయన అభిప్రాయపడ్డారు. కళ ప్రజల కోసం వ్యక్తీకరించబడి, ప్రజల మెప్పు పొందలేవన్నారు. తెలంగాణా ఉద్యమం లాంటి అనేక ఉద్యమాలు సఫలం కావడానికి సంగీత సాహిత్యాలు ఎంతో దోహదం చేశాయన్నారు. బిగ్‌బాస్ కార్యక్రమం కుటుంబసమేతంగా చూస్తున్నప్పుడు, నాగార్జున మాటలు ఆకర్షణీయమైనపుడు, వాటికి చప్పట్లు కొట్టే సమాజం వున్నపుడు, సమాజం అంతా ప్రశ్నించుకోవాల్సిన ఆవశ్యకత వుందన్నారు. సామాజిక స్పృహతో ఎలా దాన్ని తిప్పి కొట్టాలి అనేది సాహిత్యమా.. కళలు, న్యాయపరమైన విధానమా అనేది చూడాలన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం తర్వాత నీటి విషయంలోను, స్వేచ్ఛ విషయంలోను చాలా సానుకూలత వచ్చిందన్నారు. తెలంగాణలో దళిత పాలన రావాల్సిన అవసరం వుందన్నారు. దళితుల్ని తెలంగాణలో గేట్ల వరకే రానిస్తున్నారని, ఇండ్లలోకి ఆహ్వానించే సంప్రదాయం రావాలన్నారు. అన్ని విధాల అభివృద్ధి కోసం తెలంగాణ గళం కలం కొనసాగుతూనే వుంటుదన్నారు. ఈ సభకు అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. విశాలాంధ్ర పబ్లికేషన్స్ మేనేజర్ మనోహర నాయుడు పాల్గొన్నారు.


జాలూరు పథం ఆవిష్కరిస్తున్న సీపీఐ నారాయణ



భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా న్యాయవాదుల నిరసన దీక్ష

న్యాయవాదులు ఉద్యమం విరమించలేదు

» బెజవాడ బార్ అధ్యక్షుడు కేబీ సుందర్

విజయవాడ లీగల్, డిసెంబరు 31 : ఏపీ భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు 11 రోజులుగా చేస్తున్న దీక్షలను విరవించినట్టుగా ప్రభుత్వానికి చెందిన ఒక పత్రికలో (ఆంధ్రజ్యోతి కాదు) వచ్చిన వార్తను ఆదివారం ఆయన ఖండించారు. శనివారం న్యాయవాదుల జేఏసీ అధ్వర్యంలో సీఎంవో అధికారికి న్యాయవాదులు వినతిపత్రం సమర్పించారని, దానికి ఆయన సీఎంతో మాట్లాడి చట్టం వలన కలిగే నష్టాలను తెలియజేస్తామని చెప్పారన్నారు. దీనికి న్యాయవాదులు దీక్ష విరమించినట్టు తప్పుడు కథనం ప్రచురించడం జరిగిందని, దీనిని న్యాయవాదులంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నట్టు సుందర్ తెలిపారు. 2024 జనవరి 5వ తేదీ వరకు దీక్షలు కొనసాగుతాయని, అనంతరం న్యాయవాదులతో చర్చించి నిర్ణయం తెలియజేస్తామన్నారు. ఏపీ భూ హక్కు చట్టం-2022కు వ్యతిరేకంగా బెజవాడ బార్ న్యాయవాదుల నిరసన దీక్షలు ఆదివారం 11వ రోజు కొనసాగాయి. దీక్షలో న్యాయవాదులు ఎ.ఎ.ఎస్.రాంప్రసాద్, వీఎన్‌వీ రాజ్యలక్ష్మి, బి.పుష్పకుమారి, కె.జయశ్రీ, ఎన్.యోనాతాన్, సీహెచ్.వీర్రాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో బెజవాడ బార్ ఉపాధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జన్ను శ్రీధర్, మాజీ ప్రధాన కార్యదర్శి గంధం శ్రీనివాసరావు, కండెల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి బహిరంగ చర్చకు రావాలి

» పోతిన వెంకట మహేశ్



వన్‌టౌన్, డిసెంబరు 31 : ముఖ్యమంత్రి జగన్, మంత్రి జోగి రమేశ్‌లు బహిరంగ చర్చకు రావాలని జనసేన అధికార ప్రతినిధి, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతిన వెంకట మహేశ్ సవాల్ విసిరారు. ఆదివారం వన్‌టౌన్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి జోగి రమేశ్ మీడియా సమావేశంలో పవన్‌కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యల పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం సెంటు భూమి ఇళ్ల పథకం పేరుతో రూ.35వేలకోట్లు మేర భారీ కుంభకోణం చేశారని, సీబీఐ, ఈడీల చేత విచారణ జరిపించాలని పవన్‌కల్యాణ్ శనివారం ప్రధానమంత్రికి లేఖ రాశారన్నారు. దీంతో జగన్‌కు, జోగి రమేశ్‌కు వెన్నులో వణుకు పుట్టి నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. వాళ్ళు కోరుతున్నట్టుగానే బహిరంగ చర్చకు తాను సిద్ధమని మహేశ్ పేర్కొన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌కు రావడానికి కూడా సిద్ధమేనన్నారు. బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. దమ్ముంటే తమ సవాల్‌ను స్వీకరించాలన్నారు. కేంద్రం నుంచి ఇళ్ల కోసం 14,360 కోట్లు రాగా 11,358 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మిగతా డబ్బులు కొట్టేశారని ఆరోపించారు. పవన్ కల్యాణ్ చెప్పింది నిజం కాదని, చెప్పే ధైర్యం, దమ్ము ఉన్నాయా అంటూ నిలదీశారు. జోగి రమేశ్ జక్కంపూడి వస్తే ఇళ్ల విషయంలో జరిగిందేమిటో చెబుతామని, జోగి వల్లే వసంతకృష్ణ ప్రసాద్ పార్టీకి దూరంగా ఉన్నారని చెప్పారు.

వేడుకలు లేకుండా చేసిన సీఎం జగన్

● మున్సిపల్ కార్మికుల ఆవేదన



ధర్నాచౌక్, డిసెంబరు 31: సీఎం జగన్ తమకు నూతన సంవత్సర వేడుకలు లేకుండా చేశారని మున్సిపల్ కార్మికులు వాపోయారు. తమ సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా చే పట్టిన నిరవధిక సమ్మెలో భా గంగా ధర్నాచౌక్ వద్ద 6వ రోజు శనివారం కొనసాగింది. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సీఐటీయూ రాష్ట్ర నేత సీహెచ్.బాబూరావు, దోనేపూడి కాశీనాథ్, టాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆంజనేయులు, డివైఎఫ్ఐ నేత జి.రామన్న పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల దీక్ష భగ్నం

» సీఐటీయూ నేత అరెస్టు.. ఆసుపత్రిలో చేరిక

» మాట తప్పిన సీఎం: మాజీమంత్రి ఉమా



ఇబ్రహీంపట్నం, డిసెంబరు 31 : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కొండపల్లిలో చెత్త సంపద తయారీ కేంద్రం వద్ద మున్సిపల్ కార్మికుల నిరసన దీక్షను పోలీసులు భగ్నం చేశారు. ఆదివారం పోలీసులు సీఐటీయూ నేత ఎం.మహేశ్, మున్సిపల్ కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. కొద్ది సేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈక్రమంలో తీవ్ర అస్వస్తతకు గురైన మహేశ్‌ను కొండపల్లిలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. మహేశ్‌ను మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పరామర్శించారు. అనంతరం కార్మికులకు సంఘీభావం తెలిపారు. కొండపల్లి మున్సిపాలిటీలో వైసీపీ నాయకులు రూ.10 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఇందుకు సీఎం జగన్, మైలవరం ఎమ్మెల్యే వసంత బాధ్యత వహించి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహేశ్‌ను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మసాని సుబ్బారావు పరామర్శించారు. న్యాయమైన కోర్కెల కోసం నిరసన చేస్తున్న కార్మికులపై, పోలీసులు భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. సీపీఎం నాయకులు మధు, పీవీ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ అమ్మాజీలు మహేశ్‌ను పరార్శించారు.


కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న బొమ్మసాని సుబ్బారావు


భవానీ దీక్షల విరమణల ఏర్పాట్లపై చర్చిస్తున్న ఈవో రామారావు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఈ రమాదేవి

భవానీ దీక్షల విరమణకు ఏర్పాట్లు

వన్‌టౌన్, డిసెంబరు 31: దుర్గగుడిలో బుధవారం నుంచి జనవరి 7 వరకు జరగనున్న భవానీ దీక్షల విరమణలకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆదివారం ఈవో కేఎస్ రామారావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఈ లింగం రమాదేవి ఇతర అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. దీక్షల విరమణలకు రానున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఇరుముడుల సమర్పణల కోసం ఏర్పాట్లు చేయడానికి పలు సూచనలు చేశారు. క్యూలైన్లు, ఘాట్‌ల వద్ద స్నాన సౌకర్యాలు, కేశ ఖండనశాలలు, టికెట్ కౌంటర్లు, హోమగుండాల ఏర్పాటు, ప్రసాదాల కౌంటర్లు, అన్నవితరణ వంటి ప్రదేశాలన్నింటి వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. ఇరుముడుల సమర్పణకు ఏర్పాట్లు చేస్తున్నారు. హోమగుండాల వద్ద తొక్కిసలాట లేకుండా భక్తులు నెయ్యి కూర్చిన కొబ్బరికాయలను సమర్పించేందుకు క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకున్న శ్రీదేవి నృత్య ప్రదర్శన



ధర్మపథం వేదికపై ఆదివారం సాయంత్రం అమెరికాకు చెందిన శ్రీదేవి చేసిన నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. పలు కీర్తనలకు ఆమె కూచిపూడి నాట్యంలో అలరించారు. ప్రదర్శన అనంతరం ఆమెకు ఈవో రామారావు, స్థానాచార్యుడు విష్ణుభట్ల శివప్రసాదశర్మ జ్ఞాపికను అందజేశారు. కంచికామకోటి పీఠ పాఠశాల విద్యార్థినిలు సామూహిక భక్తిగీతాలతో స్వరార్చన చేశారు. విష్ణుభట్ల పద్మావతి విద్యార్థులకు సమన్వయ కర్తగా వ్యవహరించారు.

బీసీలకు గౌరవమివ్వని జగన్‌రెడ్డి

విద్యాధరపురం, డిసెంబరు 31: జగన్‌రెడ్డి పార్టీలో బీసీలకు ఏమాత్రం గౌరవం లేదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం గౌడ్ అన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వబ్రాహ్మణుల సామాజిక వర్గానికి జగన్‌రెడ్డి ప్రభుత్వంలో కలిగిన మేలు ఏమిటో చెప్పాలని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్‌ను టీడీపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సింహాద్రి కనకాచారి ప్రశ్నించారు.

వన్‌టౌన్: జగన్‌రెడ్డి పాలనంతా మోసాలమయమని టీడీపీ సీనియర్ నేత ఎంఎస్ బేగ్ అన్నారు. వన్‌టౌన్‌లోని టీడీపీ పశ్చిమ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతితో మూడుముక్కలాట ఆడుకుని కౌలు రైతులకు డబ్బులు కూడా వేయలేదన్నారు. టీడీపీ నేతలు సారేపిల్లి రాధాకృష్ణ, జెవర సాయిసుధాకర్, బూరా కనకారావు, మీర్జా ముజాఫర్ బేగ్ పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెట్లు స్ఫూర్తి: కలెక్టర్

విజయవాడ స్పోర్ట్సు: వయస్సు పైబడినా ఇంకా ఏదో సాధించాలనే తపనతో పరుగులు పెడుతున్న మాస్టర్స్ అథ్లెట్లు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కొనియాడారు. ఉమ్మడి కృష్ణా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కంది గంగాధరరావు, జీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఐజీఎంసీ స్టేడియంలో ఇటీవల ఎస్వీ వర్సిటీలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ 77 పతకాల సాధించిన అథ్లెట్లను కలెక్టర్ ఘనంగా సత్కరించారు.

హక్కుల కోసం ముదిరాజ్‌లు పోరాడాలి

మధురానగర్: రాష్ట్రంలోని ముదిరాజ్‌లందరూ పార్టీలకతీతంగా రాజకీయ హక్కుల కోసం సమైక్యంగా పోరాడాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కోర్ల నారాయణ ముదిరాజ్ పిలుపు ఇచ్చారు. ఈ నెల 22న ప్రకాశం జిల్లా ఒంగోలులో ప్రారంభమైన ముదిరాజ్ ప్రచార చైతన్య రథం ఆదివారం మధురానగర్ చేరుకుంది. ఈ సందర్భంగా ప్రజా కళాకారుడు బుల్లెట్ వెంకన్న ముదిరాజ్ ఆధ్వర్యంలో కళాకారులు ప్రజా గేయాలను ఆలపించారు. మహాసభ ప్రధాన కార్యదర్శి వలిబోయిన రాజు ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ గణేష్, ఉపాధ్యక్షుడు కోలా ఏడుకొండలు, తొకల రవి, బుస్సా రామకృష్ణ, శంకర్, సాంబశివరావు పాల్గొన్నారు.

పోరాటాన్ని ఉధృతం చేయాలి: జల్లి

ధర్నాచౌక్: రాష్ట్రవ్యాప్తంగా దళితులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వీటిపై దళిత సంఘాలను కలుపుకుని పోరాటాలను ఉధృతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పిలుపునిచ్చారు. దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం స్థానిక దాసరిభవన్‌లో ఆదివారం జరిగింది. దళితులపై దాడులు, అక్రమ కేసులు ఎదుర్కొనేందుకు ఆందోళనలు, దీక్షలు నిర్వహించడాన్ని ఆయన అభినందించారు. సమితి ప్రధానకార్యదర్శి కె.సుబ్బరావు సమితి నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరు శోచనీయం..

ధర్నాచౌక్: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. విజయవాడ ధర్నాచౌక్‌లో ధర్నా శనివారం 20వ రోజు కొనసాగింది. రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ప్రతిపక్ష నేతగా సీఎం జగన్ తమకిచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అధిక సంఖ్యలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమశాఖలో పోస్టులకు

దరఖాస్తుల ఆహ్వానం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, డిసెంబరు 31 : జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ-ఐసీపీఎస్, శిశుగృహ, బాలసదన్‌లో కాంట్రాక్టు/ఔట్ సోర్సింగ్/పార్ట్‌టైం పద్ధతిపై పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టుల భర్తీకి సంబంధించి 2023, నవంబరు 7న ఇచ్చిన నోటిఫికేషన్‌లో వయసుకు సంబంధించి మార్పులు చేసినట్టు తెలిపారు. 18 నుంచి 42 ఏళ్లలోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, వికలాంగులకు 10 ఏళ్ల సడలింపు వుంటుందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా స్థానిక అభ్యర్థులు ఎన్‌టీఆర్.ఏపీ.జీఓవీ.ఇన్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తుకు గెజిటెడ్ అధికారి అటెస్ట్ చేసిన ధృవీకరణ పత్రాలను జతచేసి జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి వారి కార్యాలయం, డోరు నెం.6-93, కార్మెల్ చర్చి ఎదురు రోడ్డు, కానూరు, విజయవాడ కార్యాలయమునందు జనవరి 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

శుభాకాంక్షలకు పుస్తకాలు, పెన్నులతో రండి

నూతన సంవత్సరం సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే అధికారులు, ఉద్యోగులు, ఆత్మీయులు, సన్నిహితులు బొకేలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలకు బదులు నోట్ పుస్తకాలు, పెన్నులు వంటివి తీసుకురావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నోట్ పుస్తకాలు, పెన్నులు వంటి చిరుకానుకలు పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడతాయని, పుష్పాలు, పండ్లు ఒక్కరోజుతోనే నిరుపయోగమవుతాయని, ఒక పుస్తకం పేద విద్యార్థుల జీవితంలో విద్యావెలుగులు నింపుతుందని అలాంటి గొప్ప కార్యక్రమంలో మీరు కూడా భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. మీరిచ్చే పెన్నులు, పుస్తకాలు పేద విద్యార్థులకు అందించడం జరుగుతుందని, వారి కృతజ్ఞతలు, ఆశీస్సులు మీపై ఎప్పటికీ వుంటాయని పేర్కొన్నారు.

నేటి స్పందన రద్దు

కృష్ణలంక, డిసెంబరు 31 : జనవరి 1వ తేదీ సోమవారం జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా విజయవాడలోని కలెక్టరేట్‌లో నిర్వహించే జిల్లాస్థాయి స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు వెల్లడించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ కోరారు.

వైసీపీకి బొమ్మసాని చలపతి రాజీనామా

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 31 : మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఒంటెత్తు పోకడ కారణంగా పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ఇబ్రహీంపట్నం మండల వైసీపీ మాజీ అధ్యక్షుడు బొమ్మసాని చలపతిరావు ప్రకటించారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ, పార్టీ కార్యాలయాన్ని సొంత ఎస్టేట్‌గా మార్చి ఇన్‌చార్జిలను సూపర్‌వైజర్లుగా నాయకులు, కార్యకర్తలను స్వీపర్లుగా ఎమ్మెల్యే మార్చాడని దుయ్యబట్టారు. వీటీపీఎస్ కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు.

త్వరలో సైకో పాలన అంతం

● రాష్ట్రంలో రామరాజ్యం రాబోతోంది: బొండా ఉమా


మాట్లాడుతున్న బొండా ఉమా

సత్యనారాయణపురం, డిసెంబరు 31: "రాష్ట్రంలో త్వరలో సైకోపాలన అంతమవుతుంది. రామరాజ్యం రాబోతోంది. ప్రజల కష్టాలు తీరుతాయి." అని టీడీపీ పొలిట్‌బ్యూరోసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సత్యనారాయణపురం 33వ డివిజన్ జనరల్‌బాడీ సమావేశాన్ని ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. వైసీపీని ఎప్పుడు బంగాళాఖాతంలో కలుపుదామా అని ప్రజలు ఎదురు చూస్తున్నారని, కష్టపడి పనిచేసే వారికి ఎపుడూ టీడీపీలో గుర్తింపు ఉంటుందని, పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కార్యకరలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని ఉమా పిలుపునిచ్చారు. ఓటును అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డివిజన్ ఇన్‌చార్జి గార్లపాటి విజయకుమార్, అధ్యక్షుడు ఎస్.కోటేశ్వరరావు, కార్యదర్శి సి.రవిబాబు, సి.శ్రీనివాస్, నాగయ్య, సాయి, కృష్ణప్రసాద్, విజయలక్ష్మి, రామలక్ష్మి పాల్గొన్నారు.

మెస్సీయా ఫెలోషిప్‌లో నూతన సంవత్సర వేడుకలు

ఆటోనగర్(పెనమలూరు), డిసెంబరు 31: ఆటోనగర్ వంద డుగుల రోడ్డులోని మెస్సీయా ఫెలోషిప్ చర్చిలో క్రైస్తవులు నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని చైర్మన్ డాక్టర్ సజ్జా రత్నకుమార్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలు, ప్రత్యేక ఆరాధనలకు నున్న, గొల్లపూడి, పెనమలూరు, గన్నవరం, ఉయ్యూరు, గుడివాడ ప్రాంతాల భక్తులు హాజరయ్యారు.

అరకొరగా మంచినీటి సరఫరా

భవానీపురం, డిసెంబరు 31: వీఎంసీలో కార్మికుల సమ్మె ప్రభావంతో 44వ డివిజన్‌లో నాలుగు స్తంభాల సెంటర్, విద్యాధరపురం, ఎరుకుల బజార్ ప్రాంతాల్లో శని, ఆదివారాల్లో మంచినీటి సరఫరా అరకొరగా జరిగింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సిబ్బంది సమ్మెలో ఉండటంతో ప్రత్యామ్నాయ సిబ్బందిని సరిగ్గా వినియోగించలేకపోవడంతో బూస్టర్ పాయింట్ల వద్ద పర్యవేక్షణ కొరవడింది. వాటర్ వర్క్స్ ఏఈ అహ్మద్‌ను వివరణ కోరగా సమస్య ఉందని, రెండు పూటలా నీటిని వదులుతామని తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ..ఒకరికి తీవ్రగాయాలు

విద్యాధరపురం, డిసెంబరు 31: బైక్‌పై వస్తున్న వ్యక్తిని మరో బైక్ ఢీకొట్టడంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. బబ్బూరి గ్రాండ్స్ ప్రాంతంలో నివసిస్తున్న కర్రి నరసింహారావు(34) తన బైక్‌పై సూరాయపాలెం నుంచి వస్తుండగా నల్లకుంట సమీపంలో మరో బైక్ వచ్చి ఢీకొట్టింది. దీంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సత్యనారాయణపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అతని సోదరుడు ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అహంకారాన్ని వదలడమే యోగం

పటమట, డిసెంబరు 31: "మనుసును నశింపచేయడం, అహంకారాన్ని వదిలివేయడమే యోగం." అని యోగా గురువు ఎం.రఘు గురూజీ తెలిపారు. సమభావన మిత్రమండలి 95వ సమావేశం అధ్యక్షుడు కోనేరు నరేంద్రబాబు ఆధ్వర్యంలో వాసవ్య మహిళా మండలిలో నిర్వహించారు. ఆరోగ్యానికి, వ్యక్తిత్వ వికాసానికి యోగ అనే అంశంపై గురూజీ మాట్లాడారు. పోకల నాగేంద్రరావు, శ్రీదేవి, కుసుమ కుమారి, టి.శోభనాద్రి, యార్లగడ్డ రంగారవు, సీహెచ్ వెంకటరెడ్డి, డాక్టర్ గుమ్మ సాంబశివరావు, డాక్టర్ ఎంపీ రావు, ప్రొఫెసర్ ప్రసాద్ పాల్గొన్నారు.


భారతీనగర్ కాలనీ మెయిన్‌రోడ్డులో చెత్త

పేరుకుపోతున్న చెత్త

భారతీనగర్, డిసెంబరు 31: 4వ డివిజన్‌లో కొద్దిరోజుల నుంచి పారిశుధ్య కార్మికులు విధులకు రాకపోవడంతో భారతీనగర్ కాలనీ, శ్రీనగర్ కాలనీల్లోని అంతర్గత రోడ్లలో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయిది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్‌లోని కాలనీల్లో చెత్తను వాహనం పెట్టి డైలీ, పర్మినెంట్ వర్కర్లతో తొలగిస్తున్నామని డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.రాయల్ తెలిపారు.

చీరల పంపిణీ

భవానీపురం, డిసెంబరు 31: 41వ డివిజన్ భవానీపురంలోని అంబేడ్కర్ కాలనీలో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు ఎంఎస్ బేగ్ ఆధ్వర్యంలో పేదలకు ఆదివారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. సయ్యద్ కరీముల్లా, శానం వాణిలు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

పాతరాజరాజేశ్వరి పేట, డిసెంబరు 31: యలవర్తి సునీల్ చౌదరి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ యలవర్తి శ్రీకాంత్ సౌజన్యంతో సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో రోడ్లపై ఉండే నిరాశ్రయులకు దుప్పట్లను పంపిణీ చేశారు. బొండా ఉమా యువజన విభాగం నగర అధ్యక్షుడు చల్లగాలి అనీల్‌కుమార్ వేల్పుల రాజేష్, జగన్నాధం సాంబ శివరావు, మల్లవరపు బాలసుబ్రహ్మణ్యం, ఆలేటి వినయ్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గవర్నర్‌పేట: లెనిన్ సెంటర్ లోని ఓం శ్రీ షిర్డి నాగసాయిబాబా-నాగమానసాదేవి మందిరంలో సాయి బాబా సంస్థాన్ ట్రస్ట్ (షిర్డి) ముద్రించిన క్యాలెండర్‌ను, బాబా డైరీని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆవిష్కరించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధా స్వామి భక్తులకు వాటిని పంపిణీ చేశారు.

ప్రకటన

నా క్లయింట్, యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ, సత్యనారాయణపురం, చల్లపల్లి వారి వీధి, భాష్యం స్కూలు ప్రక్కన, డోరు నెం. 23-24-72 ఎరు వాస్తవ్యులు పులివెందుల విజయేంద్రకుమార్ గారి భార్య పులివెందుల శాంత కుమారి గారి సంజాయిషీ పొంద్యాపస్నందికి తెలియజేయునది ఏమనగా.
క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని శ్రీ కోలవెన్ను జనార్ధనరావు గారి కుమారుడు కోలవెన్ను హరిబాబు గారు యన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ, దుర్గాపురం, డోరు నెం. 24-26-19, ఫౌండ్రీ వీధి, రిజిష్టరు దస్తావేజు 1వ పుస్తకం, ద.నెం. 16082/2023 ద్వారా క్రయంపొంది తదాది నేటి వరకు వారి స్వాధీన హక్కు భుక్తములలో కలిగివున్నారు అని తెలియజేసినారు నా క్లయింట్ క్రింది తెలిపిన షెడ్యూలు దాఖలా ఆస్తిని కోలవెన్ను హరిబాబు నుండి క్రయం పొందుటకు విక్రయ ఖరారు పొంది రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు ఎవరికైన ఎటువంటి అభ్యంతరములు, క్లయిములు గాని మరియేయితర అగ్రిమెంట్స్, తనఖాలు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన 10 రోజులలోగా వారి అభ్యంతరములు గానీ, క్లయిములు గాని క్రింది తెలిపిన అడ్రసుకు రిజిస్టర్ పోస్టు విత్ ఎకనాలడ్జిమెంటు ద్వారా తెలియజేయగలరు. లేని యెడల ఆపై వచ్చు అభ్యంతరములు గానీ, క్లయిములు గానీ నా క్లయింటుని బైండు చేయజాలవు అని తెలియజేయడమైనది.
షెడ్యూలు : యన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ ఏరియాలో చేరిన, విజయవాడ విలేజ్ పోర్షన్ విజయవాడ సత్యనారాయణపురం, చల్లపల్లివారి వీధిలో గల ఆస్తికి ఆర్.యస్.నెం.128/1, మున్సిపల్ వార్డు నెం.21ఎ, అసిస్మెంటు నెం.18116, న్యూ అసిస్మెంటు నెం. 126138, డోరు నెం. 23-28-69రు దాఖలా చ.గ.39.0లు లేక చ.మీ.32.60లు స్థిరాస్థి నివేశన స్థలమునూ అందలి ఎ.సి.సి. రేకుల ఇంటితో సహా గల ఆస్తికి హద్దులు: తూర్పు : శాస్త్రి గారి ఆస్తి, దక్షిణం : ఉదయభాస్కరావు గారి ఆస్తి, పడమర : వల్లూరి రంగారావు గారి ఆస్తి, ఉత్తరం : అ. 40. 0లు వెడల్పు గల రోడ్డు
మునుబ్రోలు సత్యనారాయణ, బి.కాం, బి.యల్. న్యాయవాది, కోటావారి బిల్డింగ్, గాంధీనగర్, విజయవాడ. సెల్ : 99480 41607

ఫైవ్స్ హాకీ కెప్టెన్‌గా రజని

FIH HOCKEY5s WORLD CUP

పురుషుల టీమ్‌కు సిమ్రన్‌జీత్ ● ఎఫ్ఐహెచ్ వరల్డ్‌కప్ జట్ల ఎంపిక



న్యూఢిల్లీ: ప్రయోగాత్మక హాకీ ఫైవ్స్ వరల్డ్‌కప్ కోసం భారత మహిళలు, పురుషుల జట్లను ఎంపిక చేశారు. ఈనెల 24 నుంచి 27 వరకు ఒమన్‌లో జరిగే మహిళల వరల్డ్‌కప్‌లో తిరుపతికి చెందిన రజని యతిమరపు భారత హాకీ జట్టు కెప్టెన్‌గా ఎంపికైంది. 33 ఏళ్ల ఈ వెటరన్ గోల్‌కీపర్ సారథ్య బాధ్యతలు తీసుకోవడం ఇదే మొదటిసారి. 2009లో అరంగేట్రం చేసిన తనకు ఒలింపిక్స్, వరల్డ్‌కప్, ఆసియా గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొన్న అనుభవం ఉంది. అలాగే 2016 ఆసియా చాంపియన్‌షిప్స్, 2017 మహిళల హాకీ ఆసియాకప్‌లో స్వర్ణం సాధించిన భారత జట్టులో సభ్యురాలు. పూల్ 'సి'లో ఉన్న భారత మహిళలకు నమీబియా, పోలెండ్, అమెరికా పోటీనివ్వనున్నాయి. 'అంతర్జాతీయ అనుభవం కలిగిన యువ ప్లేయర్లతో మహిళల జట్టును ఎంపిక చేశాం. సవాళ్లను దీటుగా ఎదుర్కొనే సత్తా వీరికి ఉంది' అని కోచ్ సౌందర్య యెండల తెలిపింది. సౌందర్య స్వస్థలం నిజామాబాద్. మరోవైపు జనవరి 28 నుంచి 31 వరకు ఒమన్‌లోనే జరిగే పురుషుల వరల్డ్‌కప్‌లో భారత జట్టు సిమ్రన్‌జీత్ సింగ్ ఆధ్వర్యంలో బరిలోకి దిగబోతోంది. పూల్ 'బి'లో భారత్‌తో పాటు ఈజిప్టు, జమైకా, స్విట్జర్లాండ్ జట్లున్నాయి. పురుషుల, మహిళల విభాగాల్లో 16 జట్లు చొప్పున పాల్గొంటున్నాయి.

మహిళల జట్టు షెడ్యూల్		
ప్రత్యర్థి	తేదీ	సమయం
పోలెండ్	జనవరి 24	సా.4.50
అమెరికా	జనవరి 24	రాత్రి 1.10
నమీబియా	జనవరి 25	సా.6.30
పురుషుల జట్టు షెడ్యూల్		
స్విట్జర్లాండ్	జనవరి 28	మ.3.10
ఈజిప్టు	జనవరి 28	రా.11.30
జమైకా	జనవరి 29	మ.1.30

ఏమిటీ.. హాకీ ఫైవ్స్

టీ20 క్రికెట్ తరహాలోనే హాకీ ఫైవ్స్ అనేది సూపర్ ఫాస్ట్‌గా ముగిసే మ్యాచ్. కేవలం 20 (10+10) నిమిషాలపాటు మాత్రమే ఆట సాగుతుంది. మధ్యలో రెండు నిమిషాల విరామం ఉంటుంది. అలాగే రెగ్యులర్ హాకీ మ్యాచ్‌లా 11 మంది కాకుండా ఇందులో గోల్‌కీపర్‌తో కలిపి మొత్తం ఐదుగురు మాత్రమే ఆడుతారు. నలుగురు సబ్‌స్టిట్యూట్స్‌లను అనుమతిస్తారు. విస్తీర్ణం కూడా రెగ్యులర్ కోర్టులో సగం మాత్రమే ఉంటుంది. 'డీ' సర్కిల్ కూడా కనిపించదు. దీంతో మైదానంలో ఎక్కడి నుంచైనా ప్లేయర్ గోల్ చేయవచ్చు. తొలిసారిగా 2014 యూత్ ఒలింపిక్ గేమ్స్‌లో అడుగిడిన ఈ క్రీడ, ఇప్పుడు 60 దేశాల్లో ప్రాచుర్యం పొందింది.

ఉత్కంఠ పోరులో యోధాస్ విజయం

కటక్: అల్టిమేట్ ఖో-ఖో సీజన్-2లో తెలుగు యోధాస్ జట్టు 2023 ఏడాదిని విజయంతో ముగించింది. ఆదివారం కటక్‌లో జరిగిన తమ ఐదో మ్యాచ్‌లో యోధాస్ ఒక్క పాయింట్ తేడాతో గెలిచింది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో ఆట ఆఖరి నిమిషంలో కీలక పాయింట్ సాధించిన యోధాస్ 29-28తో ఒడిశా జగర్‌నాట్స్‌పై విజయం సాధించింది. యోధాస్ కెప్టెన్ ప్రతీక్ 10 పాయింట్లతో, జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించాడు.

మూడో టీ20లో కివీస్ గెలుపు

సిరీస్ సమం

మౌంట్‌మాంగనుయ్ (న్యూజిలాండ్): స్వల్ప స్కోర్ల ఆఖరి టీ20లో 17 పరుగుల (డ/లూ)తో గెలుపొందిన న్యూజిలాండ్..బంగ్లాదేశ్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో డ్రా చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పర్యాటక జట్టు తొలుత 19.2 ఓవర్లలో 110 పరుగులకే కుప్పకూలింది. శాంట్నర్ (4/16) నాలుగు వికెట్లు సాధించాడు. స్వల్ప ఛేదనలో షోరిఫుల్ (2/17), మెహిదీ హసన్ (2/18) దెబ్బకు 49/5తో న్యూజిలాండ్ ఇక్కట్లలో పడింది. అయితే నీషమ్ (28 నాటౌట్), శాంట్నర్ (18 నాటౌట్) ఆరో వికెట్‌కు 46 పరుగులు జోడించారు. ఈ దశలో వర్షంతో మ్యాచ్ నిలిచిపోవడంతో..అప్పటికి 14.4 ఓవర్లలో 95/5 స్కోరుతో ఉన్న కివీస్‌ను విజేతగా ప్రకటించారు. కాగా ఈ రెండుజట్ల మధ్య రెండో టీ20 వర్షంతో రద్దయింది.

భారత పేసర్ల సమర్థతకు పరీక్ష

అలెన్ డొనాల్డ్

కేప్‌టౌన్: తొలి టెస్టులో భారత్ ఓటమికి, దక్షిణాఫ్రికా విజయానికి బౌలర్లే కారణమని దిగ్గజ పేసర్ అలెన్ డొనాల్డ్ అభిప్రాయపడ్డాడు. 'సెంచూరియన్ కంటే రెండో టెస్టు జరగనున్న కేప్‌టౌన్ పిచ్ బౌలర్లకు మరింత కఠిన పరీక్ష పెట్టనుంది. ఇక్కడ వికెట్లు కావాలంటే భారత బౌలర్లు తెలివిగా బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. ఒక విధంగా చెప్పాలంటే భారత బౌలర్ల సమర్థతకు ఇదొక పరీక్ష. ఇక్కడ స్పిన్నర్లకు ఎలాంటి సహకారం లభించదు. తొలి ఇన్నింగ్స్‌లో పేసర్లకు అనుకూలిస్తుంది' అని డొనాల్డ్ తెలిపాడు.

టాప్‌లో గుజరాత్ జెయింట్స్

నోయిడా: ప్రొ కబడ్డీ సీజన్-10లో గుజరాత్ జెయింట్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకొచ్చింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 51-42తో బెంగాల్ వారియర్స్‌పై నెగ్గి, 32 పాయింట్లతో టాప్‌నకు చేరుకుంది. గుజరాత్ రైడర్ ప్రతీక్ దహియా 25 పాయింట్లతో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం పాయింట్లలో సగం సాధించిన ప్రతీక్‌నే గుజరాత్ విజయానికి కారణం. బెంగాల్ రైడర్లు నితిన్ (12 పాయింట్లు), మణిందర్ (11 పాయింట్లు), శ్రీకాంత్ (9 పాయింట్లు) రాణించినా, ప్రతీక్ దెబ్బకి పరాజయం పాలవక తప్పలేదు. మరో ఉత్కంఠభరిత మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 38-37తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది.

ఐపీఎల్.. మరో ఒలింపిక్స్



జస్టిన్ లాంగర్

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా మాజీ కోచ్ జస్టిన్ లాంగర్ ఐపీఎల్‌ను ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌తో పోల్చాడు. ప్రస్తుతం అతను ఆండీ ఫ్లవర్ స్థానంలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ప్రధాన కోచ్‌గా వ్యవహరించబోతున్నాడు. 'ఐపీఎల్ అతిపెద్ద టోర్నమెంట్. ఒలింపిక్ గేమ్స్ తరహాలోనే పోటీలు భారీ స్థాయిలో జరుగుతుంటాయి. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది తిలకించే ఈ టోర్నీలోని ప్రతీమ్యాచ్ ప్రేక్షకుల సందడి మధ్య అద్భుతంగా సాగుతుంటుంది. ఇలాంటి టోర్నీలో నేను కూడా భాగం కాబోతున్నందుకు సంతోషంగా ఉంది' అని లాంగర్ తెలిపాడు.


ఒలింపిక్ నామ సంవత్సరం



2024 స్పోర్ట్స్ క్యాలెండర్

కొత్త ఏడాది..క్రీడాకారులకు పండుగే పండుగ. ప్రపంచవ్యాప్త అథ్లెట్లందరికీ ఘనమైన ఆటల వేదిక ఒలింపిక్స్ ఈ సంవత్సరమే. పారిస్‌లో జరిగే ఈ ప్రతిష్ఠాత్మక క్రీడా సంరంభంలో పాల్గొనడమే ప్రతి ఆటగాడి జీవిత ధ్యేయమైతే, పోటీపడి పతకం అందుకొంటే ఇక అతడి కెరీర్ ధన్యమైనట్టే. అంతటి విఖ్యాత ఈవెంట్‌లో సత్తా చాటేందుకు అథ్లెట్లందరూ ఇప్పటికే కఠోర సాధన మొదలు పెట్టేశారు..క్రికెట్‌కు సంబంధించి నూతన వత్సరంలో పురుషులు, మహిళల టీ20 వరల్డ్ కప్‌లు జరుగనున్నాయి. ఇక చదరంగానికి తలమానికంగా భాసించే క్యాండిడేట్స్ టోర్నీలో ఈ ఏడాది మన ఆటగాళ్లు ఏకంగా ఐదుగురు తలపడుతుండడం విశేషం.





ప్రధాన టోర్నీలు

జనవరి 12-ఫిబ్రవరి 10 : ఆసియా కప్ ఫుట్‌బాల్-ఖతార్
జనవరి 31-ఫిబ్రవరి 11: ఖేలో ఇండియా యూత్ గేమ్స్-మధ్యప్రదేశ్
జనవరి 23-28 : వరల్డ్ టీటీ స్టార్ట్ కంటెండర్-గోవా
ఫిబ్రవరి : ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్-గువాహటి
ఫిబ్రవరి 2-18 : వరల్డ్ అక్వాటిక్ చాంపియన్‌షిప్స్-దోహా
ఫిబ్రవరి 16-25: వరల్డ్ టేబుల్ టెన్నిస్ టీమ్ చాంపియన్‌షిప్స్-దక్షిణాఫ్రికా
ఏప్రిల్ 11-16: ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్-కిర్గిస్థాన్
ఏప్రిల్ 12-14 : శాఫ్ జూ.అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్-చెన్నై
ఏప్రిల్ 20-మే 6: వరల్డ్ స్నూకర్ చాంపియన్‌షిప్స్-యూకే
జూన్ 6 : ఎన్‌బీఏ ఫైనల్స్-అమెరికా/కెనడా
జూలై 6-ఆగస్టు 11: ఒలింపిక్స్- పారిస్
జూన్ 29-జూలై 21: టూర్ డి ఫ్రాన్స్ సైక్లింగ్-ఫ్రాన్స్
సెప్టెంబరు 20-22 : ఇండియన్ గ్రాండ్ ప్రీ మోటో జీపీ-గ్రేటర్ నోయిడా

హాకీ

జనవరి 24-31: హాకీ ఫైవ్స్ వరల్డ్‌కప్ వేదిక -ఒమన్
జనవరి 13-21: మహిళలు, పురుషుల ఒలింపిక్ క్వాలిఫయర్స్-స్పెయిన్, భారత్, ఒమన్
ఫిబ్రవరి 3-9 : ప్రొ.హాకీ లీగ్, మహిళలు-భువనేశ్వర్
ఫిబ్రవరి 10-16: ప్రొ.హాకీ లీగ్, పురుషులు-భువనేశ్వర్

బ్యాడ్మింటన్



జనవరి 16-21 : ఇండియా ఓపెన్ -న్యూఢిల్లీ
మార్చి 12-17 : ఆల్ ఇంగ్లండ్ -బర్మింగ్‌హామ్
ఏప్రిల్ 28-మే 5: థామస్, ఉబెర్ కప్-చైనా
నవంబరు 26-డిసెంబరు 1: సయ్యద్ మోదీ టోర్నీ-లఖ్‌నవూ
డిసెంబరు 11-15: బ్యాడ్మింటన్ వరల్డ్ టూర్ ఫైనల్స్-చైనా

చెస్




ఫిబ్రవరి 19-25: ఫిడే వరల్డ్ ర్యాండమ్ చెస్
ఏప్రిల్ 2-25: క్యాండిడేట్స్ చెస్-కెనడా
ఏప్రిల్ 25-29: వరల్డ్ క్యాడెట్ ర్యాపిడ్, బ్లిట్జ్-అల్బేనియా
జూన్ 1-14: వరల్డ్ జూ. అండర్-20 చాంపియన్‌షిప్స్-న్యూఢిల్లీ
జూన్ 22-జూలై 8: వరల్డ్ కప్-అండర్ 8, 10, 12-జార్జియా
జూలై 1-12: వరల్డ్ సీనియర్ టీమ్ చాంపియన్‌షిప్స్-పోలెండ్
సెప్టెంబరు 10-23: ఒలింపియాడ్-హంగేరి
అక్టోబరు-22 - నవంబరు 2: వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్స్-బ్రెజిల్

ఫుట్‌బాల్

జూన్ 14-జూలై 14: యూరో ఫుట్‌బాల్-జర్మనీ
జూన్ 20-జూలై 14: కోపా అమెరికా కప్-అమెరికా

పురుషుల క్రికెట్

జనవరి 3-7: భారత్ x దక్షిణాఫ్రికా రెండో టెస్టు
జనవరి 11-17: భారత్‌లో అఫ్గానిస్థాన్ టూర్- 3 టీ20లు
జనవరి 25-మార్చి 11: భారత్‌లో ఇంగ్లండ్ టూర్-5 టెస్టులు
మార్చి నుంచి మే మధ్య : ఐపీఎల్
జూన్ 4-30 : ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ -వెస్టిండీస్/అమెరికా
జూలై : శ్రీలంకలో భారత జట్టు టూర్-3 వన్డేలు, 3 టీ20లు
సెప్టెంబరు: భారత్‌లో బంగ్లా జట్టు టూర్-2 టెస్టులు, 3టీ20లు
అక్టోబరు: భారత్‌లో న్యూజిలాండ్ జట్టు టూర్-3 టెస్టులు
నవంబరు-డిసెంబరు: ఆస్ట్రేలియాలో భారత్ టూర్-5 టెస్టులు




జనవరి 3-మార్చి 14: రంజీట్రోఫీ
జూన్ 28-జూలై 16: దులీప్ ట్రోఫీ
జూలై 24-ఆగస్టు 3: దేవధర్ ట్రోఫీ
అక్టోబరు 1-5: ఇరానీ కప్
అక్టోబరు16-నవంబరు 6: ముస్తాక్ అలీ ట్రోఫీ
నవంబరు 23-డిసెంబరు15: విజయ్ హజారే ట్రోఫీ

మహిళల క్రికెట్

ICC WOMEN'S T20 WORLD CUP

డిసెంబరు 21-జనవరి 9: భారత్‌లో ఆస్ట్రేలియా జట్టు టూర్ - ఏకైక టెస్టు, 3 టీ20లు, 3 వన్డేలు
ఫిబ్రవరి-మార్చి: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)
సెప్టెంబరు-అక్టోబరు : ఐసీసీ మహిళల టీ 20 వరల్డ్‌కప్-బంగ్లాదేశ్
డిసెంబరు: ఆస్ట్రేలియాలో భారత జట్టు టూర్-3 వన్డేలు
డిసెంబరు: భారత్‌లో వెస్టిండీస్ జట్టు టూర్-3 వన్డేలు, 3 టీ20లు

టెన్నిస్



జనవరి 14-28 : ఆస్ట్రేలియన్ ఓపెన్-మెల్‌బోర్న్
మే 20-జూన్ 9: ఫ్రెంచ్ ఓపెన్-పారిస్
జూలై 1-14: వింబుల్డన్-లండన్
ఆగస్టు 26-సెప్టెంబరు 8: యూఎస్ ఓపెన్-న్యూయార్క్

బిజినెస్


ఈక్విటీల్లోకి ఎఫ్‌పీఐల పెట్టుబడుల వెల్లువ

2023లో రూ.1.7 లక్షల కోట్లు ఇన్వెస్ట్

న్యూఢిల్లీ: విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)కు భారత ఈక్విటీ మార్కెట్ పట్ల రోజురోజుకు మరింతగా విశ్వాసం పెరిగిపోతోంది. అంతర్జాతీయంగా పలు సవాళ్లున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ ఫండమెంటల్స్ పటిష్ఠంగా ఉండటంతో 2023 సంవత్సరంలో ఎఫ్‌పీఐలు.. దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి రూ.1.7 లక్షల కోట్ల పెట్టుబడులను గుమ్మరించారు. ఇందులో రూ.66,134 కోట్లు ఒక్క డిసెంబరు నెలలోనే రావటం గమనార్హం. 2024లో అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న అంచనాలతో ఎఫ్‌పీఐలు.. రానున్న రోజుల్లో పెట్టుబడులు మరింతగా పెంచే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2023లో భారత ఈక్విటీల్లో ఎఫ్‌పీఐలు రూ.1.71 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేయగా డెట్ మార్కెట్లోకి రూ.68,663 కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఈ రెండింటిని కలిపితే మొత్తంగా ఎఫ్‌పీఐలు రూ.2.4 లక్షల కోట్ల పెట్టుబడులను పెట్టినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఎఫ్‌పీఐలు 2022లో రూ.1.21 లక్షల కోట్లు, 2021లో కేవలం రూ.25,752 కోట్లు ఇన్వెస్ట్ చేయగా 2020లో మాత్రం రూ.1.7 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టారు.

అన్నీ మంచి శకునములే...

నూతన సంవత్సరం 2024 ఎన్నో ఆశలు చిగురింపచేస్తోంది. ఆర్థిక రంగం, ఈక్విటీ మార్కెట్లు, నియామకాలు, వేతన పెంపు అన్నింటిలోనూ ఆశావహ ధోరణులే ఉంటాయని అంటున్నారు. ప్రధానంగా కొత్త సంవత్సరం ఏప్రిల్, మే నెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు అన్ని రంగాలకు చోదకశక్తిగా నిలుస్తాయని మార్కెట్ పండితుల అంచనా. ఈ నేపథ్యంలో ఏఏ రంగం ఏ విధంగా ఉండవచ్చో పరిశీలిద్దాం.



ఆర్థిక రంగంలో వేగం ఖాయం

భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చిన నేపథ్యంలో సంపన్న దేశాల్లో నిరాశావహమైన వాతావరణం నెలకొన్నప్పటికీ అన్ని రకాల ఎదురుగాలులను తట్టుకుని భారత ఆర్థిక రంగం జోరును కొనసాగిస్తోంది. ద్రవ్యోల్బణం అదుపులో ఉండడం, స్థిరమైన వడ్డీ రేట్లు, శక్తివంతంగా ఉన్న విదేశీ మారకం నిల్వలు దేశీయ ఆర్థిక రంగానికి కుషన్‌లా పని చేస్తున్నాయి. ఈ వాతావరణంలో కొత్త సంవత్సరంలో కూడా భారత ఆర్థిక రంగం అదే జోరును కొనసాగిస్తూ ప్రపంచంలో వేగవంతమైన వృద్ధిని సాధిస్తున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలవడం ఖాయమని ఆర్థికవేత్తలంటున్నారు. సర్వత్రా నిరాశా నిస్పృహలు గూడు కట్టుకున్న స్థితిలో కూడా 2023-24 ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో 7.7 వృద్ధి రేటుతో (క్యూ1- 7.8%, క్యూ2- 7.6%) చైనా సహా ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలన్నింటి కన్నా ముందువరుసలో నిలిచింది. ఓఈసీడీ ఎంతో కన్జర్వేటివ్‌గా ప్రకటించిన అంచనా ప్రకారం సైతం భారత ఆర్థిక వ్యవస్థ 2024 సంవత్సరంలో 6.1% వృద్ధి సాధించే ఆస్కారం ఉంది. చైనా, బ్రెజిల్ దేశాల కన్నా ఇది చాలా మెరుగైన స్థితి. ఎన్నో ప్రతికూలతను సైతం తట్టుకుని 2023లో భారత్ వేగవంతమైన వృద్ధి సాధిస్తున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని ఆర్‌బీఐ ఇటీవల విడుదల చేసిన నివేదికలో తెలిపింది.

రిటైల్ ద్రవ్యోల్బణం జూలైలో గరిష్ఠ స్థాయి 7.44 శాతంగా నమోదైనప్పటికీ నవంబరులో 5.55 శాతానికి దిగివచ్చింది. ద్రవ్యోల్బణం మరింత దిగివచ్చినట్టయితే రెపోరేట్ల తగ్గింపు ప్రక్రియకు 2024లో ఆర్‌బీఐ శ్రీకారం చుట్టవచ్చు. మరోవైపు నాలుగు నెలల విరామం అనంతరం డిసెంబరులో విదేశీ మారకం నిల్వలు 60,000 కోట్ల డాలర్ల స్థాయిని దాటడం కూడా ఎలాంటి విదేశీ ఆటుపోట్లనైనా తట్టుకోగల స్థితి ఆర్థిక రంగానికి అందిస్తుందని పరిశీలకులంటున్నారు.

బుల్ జోరు ఆగదు

ఈక్విటీ మార్కెట్ గత తొమ్మిది వారాలుగా కనివిని ఎరుగని బుల్‌రన్‌లో పురోగమిస్తూ చారిత్రక రికార్డులను నమోదు చేసింది. కొత్త సంవత్సరంలో కూడా ఈ జోరు అలాగే కొనసాగవచ్చని మార్కెట్ పండితుల అంచనా. వడ్డీ రేట్లు, లోక్‌సభ ఎన్నికలు, భౌగోళిక రాజకీయ అంశాలు మార్కెట్ దిశను నిర్దేశిస్తాయి. ఏదిఏమైనా వచ్చే 3-6 నెలల మధ్య కాలంలో ప్రధాన సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ 7 శాతం వరకు వృద్ధి సాధించవచ్చన్నది వారి అభిప్రాయం.

రాజకీయ సుస్థిరత మార్కెట్లకు బలం చేకూరుస్తాయని పేర్కొంటూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం మంచి మెజారిటీతో తిరిగి అధికారంలోకి రావడం కీలకమని వారన్నారు. అలాగే ఎన్నికల అనంతరం వచ్చే తొలి బడ్జెట్ కూడా మార్కెట్ దిశను నిర్దేశిస్తుందంటున్నారు. వీటన్నింటికీ తోడు ఆర్‌బీఐ రెపో రేటును తగ్గించినట్టయితే బుల్ జోరుకు ఆకాశమే హద్దవుతుందన్నది మార్కెట్ పండితుల అభిప్రాయం. అమెరికాలో బాండ్లపై రాబడులు తగ్గడంతో విదేశీ ఇన్వెస్టర్లు తిరిగి భారత ఈక్విటీ పెట్టుబడులు ప్రారంభించడం ఒక శుభపరిణామమని వారంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కొంత అప్రమత్తమైన ఆశావహ స్థితి నెలకొందని, ఇన్వెస్టర్లు తక్షణం మూడో త్రైమాసికం ఆర్థిక ఫలితాలపై దృష్టి పెడతారని నిపుణుల అభిప్రాయం.

జాబ్ మార్కెట్ ఆశావహం

2024 సంవత్సరం ఉపాధి మార్కెట్‌కు కూడా ఆశావహంగానే ఉండవచ్చని అంటున్నారు. డేటా చోదక నియామకాలు, వేతనాల్లో రెండంకెల వృద్ధి ఉండవచ్చని మానవ వనరుల రంగం నిపుణులంటున్నారు. కంపెనీలు నిపుణులైన మానవ వనరులను నియమించుకోవడంపై దృష్టి పెట్టవచ్చు. గత కొద్ది సంవత్సరాల కాలంలో అటు యాజమాన్యాలు, ఇటు ఉద్యోగుల అంచనాల్లో విశేషమైన మార్పు ఏర్పడింది. పక్షపాత రహితమైన నియామక విధానాలు, పని ప్రదేశాల్లో మరింత అనుకూల వాతావరణం ఉండాలని ఉద్యోగులు కోరుతుండగా అత్యున్నత నైపుణ్యాలు గల వారిని నిలబెట్టుకునేందుకు అనుభవజ్ఞులకు పెద్ద పీట వేయాలని యాజమాన్యాలు భావిస్తున్నాయి. ఇందుకోసం ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలు, సానుకూల పని పరిస్థితులు, ఉద్యోగ-వ్యక్తిగత జీవితంలో సమతూకం కల్పించేందుకు యాజమాన్యాలు కృషి చేస్తున్నాయి.

2023 సంవత్సరంలో ఎడ్‌టెక్ రంగంలో పలువురు ఉద్యోగాలు కోల్పోయారు. ఐటీ రంగంలో కూడా అప్రమత్త స్థితి ఏర్పడింది. కొత్త సంవత్సరంలో ఐటీ నియామకాలు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించవచ్చని, అలాగే నైపుణ్యాల ఆధారంగా వేతనాలు ఇచ్చే వైఖరి ఏర్పడవచ్చని నిపుణులంటున్నారు. కృత్రిమమేధ, ఆటోమేషన్ సంబంధిత విభాగాలు ఉపాధి రంగాన్ని ఆశావహంగా నిలపవచ్చునన్నది వారి అభిప్రాయం. అయితే 2023తో పోల్చితే కొత్త సంవత్సరంలో వేతనాలు పెంపు స్వల్పంగా తగ్గవచ్చని వారంటున్నారు.

22,025 పైన బుల్లిష్

(జనవరి 1-5 తేదీల మధ్య వారాని



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో గైడ్

గత వారం నిఫ్టీ: 21,731 (+382)

నిఫ్టీ గత వారం 21,801-21,329 పాయింట్ల మధ్యన కదలాడి 382 పాయింట్ల లాభంతో 21,731 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,025 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 20,659, 20,127, 19,611, 19,131 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,125 బ్రేక్‌డౌన్ స్థాయి: 21,325
నిరోధ స్థాయిలు: 21,925, 22,025, 22,125 (21,831 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 21,525, 21,425, 21,325 (21,325 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

31వ తేదీ			
హైదరాబాద్	576	విజయవాడ	580
1 జనవరి		విశాఖపట్నం	625
చిత్తూరు	608	వరంగల్	578
గోదావరి	580	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	గోదావరి	114
వరంగల్	110	విజయవాడ	114
కరీంనగర్	110	గుంటూరు	110
మహబూబ్‌నగర్	110	ఒంగోలు	110
కర్నూలు	110	చిత్తూరు	115
విశాఖపట్నం	109		

కన్సాలిడేషన్ బాటలోనే..!

కొత్త ఏడాది మొదటి వారంలో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మిశ్రమంగా కదలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. బెంచ్‌మార్క్ సూచీలు ఇప్పటికే జీవితకాల గరిష్ఠాల్లో కొనసాగుతున్నాయి. మరోవైపు ఫియర్ ఇండెక్స్‌గా భావించే ఇండియా విక్స్ పెరుగుతోంది. ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఇది సూచిస్తోంది. ప్రస్తుత అప్‌ట్రెండ్‌కు తెరపడి సూచీలు కొన్నాళ్లు కన్సాలిడేషన్‌లో సాగే వీలుంది. నిఫ్టీ ప్రస్తుతం ఉన్న 21,731 పాయింట్ల నుంచి 21,750 పాయింట్లు లేదా 21,100 పాయింట్ల వరకు కరెక్షన్‌కు లోనుకావచ్చు. ఈ దశలో ఇన్వెస్టర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభించే మంచి స్టాక్స్‌ను అక్యుములేట్ చేసుకోవాలి.

స్టాక్ రికమండేషన్స్

టాటా మోటార్స్: ఈ కౌంటర్ 2023లో పూర్తిగా బుల్లిష్ ధోరణిలో కొనసాగింది. డిసెంబరులో మూమెంటమ్ మరింత పెరిగింది. కొత్త ఏడాదిలో వాహన ధరలు పెరిగే అవకాశం ఉండటంతో లాభాదాయకత పెరగొచ్చు. గత శుక్రవారం ఈ షేరు రూ.779.40 వద్ద క్లోజైంది. ట్రేడర్లు రూ.700-750 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.820/950 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.680 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

టాటా కన్స్యూమర్ లిమిటెడ్: సుదీర్ఘ కన్సాలిడేషన్ తర్వాత ఈ కౌంటర్‌లో మంచి బేస్ ఏర్పడింది. అనిశ్చితికి తావు లేకుండా షేరు ధర పెరుగుతోంది. టాటా కాఫీతో విలీనం తేదీ సమీపిస్తుండటంతో చివరి 12 సెషన్లలో ఈ షేరు 17 శాతం పెరిగింది. గత శుక్రవారం ఈ షేరు రూ.1,086.80 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోని రూ.1,050 శ్రేణిలో ఎంటర్ అయి రూ.1,200/1,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.970 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హిందుస్థాన్ యూనిలీవర్: ఈ కంపెనీ టెక్నికల్ చార్ట్ చాలా బాగుంది. మూడు వారాల నుంచి ఈ షేరు లాభాల్లోనే ముగుస్తూ వస్తోంది. సమీప నిరోధ స్థాయిని అధిగమించటంతో ట్రేడింగ్, డెలివరీ పరిమాణం పెరిగింది. రేటింగ్ సంస్థలు 'బై, హోల్డ్ కాల్స్' ఇవ్వటం సానుకూల అంశం. గత శుక్రవారం ఈ షేరు రూ.2,659.70 స్థాయిల్లో క్లోజైంది. స్వింగ్ ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.2,625/2,600 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,855/2,940 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,575 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐఈఎక్స్: జూన్ నెలలో ఒక్కసారిగా పతనబాటలోకి జారుకున్న ఈ షేరులో సుదీర్ఘ కాలం కన్సాలిడేషన్ జరిగింది. రూ.162 స్థాయిలో నిరోధ స్థాయి బ్రేక్ అవ్వటంతో మూమెంటమ్ వచ్చింది. గత శుక్రవారం ఈ షేరు రూ.167.30 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ షేరులో రూ.160/150 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.185/210 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.143 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్: ఎలక్ట్రిక్ బస్సులు, వాహనాలకు గిరాకీ పెరగటంతో పాటు కంపెనీకి పెద్దఎత్తున ఆర్డర్లు వస్తుండటంతో షేరు ధర పెరుగుతూ వస్తోంది. ఈ షేరులో రూ.1,300 స్థాయిలో క్రాస్‌లైన్ రెసిస్టెన్స్ బ్రేక్ అయ్యింది. వాల్యూమ్ అసాధారణంగా పెరిగింది. గత శుక్రవారం ఈ షేరు రూ.1,346 వద్ద క్లోజైంది. ట్రేడర్లు రూ.1,310/1,330 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.1,475/1,655 టార్గెట్ ధరతో ఈ షేరును కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,270 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

21,800 వద్ద మార్కెట్ అప్రమత్తం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 21,350 నుంచి అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తూ 21,800 వరకు వెళ్లి మైనర్ రియాక్షన్‌లో పడింది. అయినా చివరికి 380 పాయింట్ల లాభంతో ముగిసింది. వరుసగా తొమ్మిదో వారంలో కూడా ర్యాలీని కొనసాగించి రికార్డు స్థాయిలో 2,800 వరకు లాభపడింది. మిడ్‌క్యాప్ సూచీ అన్ని సూచీల కన్నా మెరుగ్గా ట్రేడి 1,100 పాయింట్లు లాభపడగా స్మాల్‌క్యాప్ సూచీ 300 పాయింట్ల మేరకు లాభపడింది. అయితే చివరి రెండు రోజుల్లో 21,800 వద్ద నిరోధం ఏర్పడినట్టు కనిపిస్తోంది. ప్రధాన ట్రెండ్ ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉంది. అమెరికన్ మార్కెట్లలో గత వారం మైనర్ బలహీనత కారణంగా ఈ వారంలో మన మార్కెట్ ఫ్లాట్/అప్రమత్తంగా ప్రారంభం కావచ్చు. గత వారం కీలక నిరోధం 21,500ని బ్రేక్ చేసిన కారణంగా పుల్‌బ్యాక్ రియాక్షన్ కూడా ఏర్పడవచ్చు. ట్రేడర్లు అప్రమత్తంగా ఉండాలి.

బుల్లిష్ స్థాయిలు: టెక్నికల్‌గా కరెక్షన్ ఏర్పడవలసి ఉంది. మరింత అప్‌ట్రెండ్ కోసం 21,800 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ తర్వాత కొత్త శిఖరాల్లో మానసిక అవధి 22,000 దిశగా కదులుతుంది. ఇక్కడ కన్సాలిడేషన్ ఉండవచ్చు.

బేరిష్ స్థాయిలు: రియాక్షన్‌లో పడినా మైనర్ మద్దతు స్థాయి 21,650 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మైనర్ బలహీనత మరింతగా ఏర్పడుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 21,400. భద్రత కోసం మార్కెట్ ఇక్కడ తప్పనిసరిగా నిలదొక్కుకోవాలి. విఫలమైన స్వల్పకాలిక బలహీనతగా భావించాలి.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా గత వారం 800 పాయింట్ల మేరకు లాభపడి 48,300 వద్ద క్లోజయింది. తదుపరి నిరోధ స్థాయి 48,650. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. బలహీనత ప్రదర్శించినా భద్రత కోసం ప్రధాన మద్దతు స్థాయి 48,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి.

పాటర్న్: ఆర్ఎస్ఐ సూచీల ప్రకారం డెయిలీ చార్టుల్లో నెగిటివ్ డైవర్జెన్స్‌తో ఓవర్‌బాట్ స్థితి కొనసాగుతోంది. 21,400 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద బ్రేక్‌డౌన్ అయితే అప్రమత్తత ఏర్పడుతుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి రివర్సల్ ఉంది.

సోమవారం స్థాయిలు	
నిరోధం	21,800, 21,855
మద్దతు	21,650, 21,570

www.sundartrends.in

నవ్య

కుటుంబ కదంబం

నూతన సంవత్సర శుభాకాంక్షలు



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో మేరు నగధీర **రేఖ**. సాధారణత్వం నుంచి గ్లామర్ శిఖరాగ్రం వరకు ఆమె ప్రయాణం అసాధారణం. రేఖ జీవిత చరిత్రను 'రేఖ- ది- అన్‌టోల్డ్ స్టోరీ' పేరుతో నవలీకరించాడు యాసిర్ ఉస్మాన్. దీన్ని 'స్వయంసిద్ధ- ఒక అభినేత్రి జీవనరేఖ' గా తెలుగులో అనుసృజన చేశారు శ్రీదేవీ మురళీధర్. ఆ పుస్తకంలోని కొన్ని విశేషాల సమాహారమే ఇది.!

ఇదొక అభినేత్రి జీవన 'రేఖ'

తన తొలి చిత్రాలు విజయఢంకా మోగిస్తుంటే 1972లో రేఖ బొంబాయి జుహూ ప్రాంతంలో తన సొంత ఫ్లాట్ కొనుక్కుంది. పద్దెనిమిదేళ్ల రేఖ హోటల్ అజంతా నుండి జుహూ బీచ్ అపార్ట్‌మెంట్‌కు మారింది. అదే అపార్ట్‌మెంటులో నటి జయ బాధురి కూడా నివసించేది. రేఖ, జయ తమ సినిమా కెరీర్‌ను దాదాపు ఒకేసారి ప్రారంభించారు. అయితే నటులుగా వారిద్దరి ఎదుగుదల పూర్తి భిన్న పథాలలో నడిచింది. రేఖ నటిగా తనను తాను ఎన్నడూ సీరియస్‌గా తీసుకోలేదు. పరిశ్రమ కూడా ఆమెను సమర్థురాలైన నటిగా పరిగణించలేదు. ఆమె నటన గురించి కాకుండా ఆమె చుట్టూ గాలివార్తలు ఆమె వ్యక్తిగత జీవితం గురించి, ప్రచారం అవసరం లేని అనేకమైన విషయాల గురించి వెలుగులోకి వచ్చేవి. అది సునీల్‌దత్ వంటి సీనియర్ నటుడైనా, అప్పటి సూపర్ స్టార్ రాజేష్ ఖన్నా అయినా, రేఖ తన కోసం

> 'అతడు వివాహితుడు అన్న వాస్తవం వల్ల నా ఆలోచనలో ఎటువంటి తేడా లేదు. గులాబీ ఏ పేరుతో పిలిచినా గులాబీయే. అతడొక ఆసక్తికరమైన వ్యక్తిత్వం కల పురుషుడు, అంతే. నేను ఈ వ్యక్తితో అనుబంధం కలిగి ఉన్నాననే గౌరవాన్ని పొందాలనుకుంటున్నాను. కాబట్టి నన్ను ఆపగలిగేదేమిటి? నేను అతడి ఇంటిని, కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చెయ్యటం లేదు. కేవలం అతడిని చూసి, అతడి గాలి సోకి, ఆనందించగల మామూలు మనిషిగా ఉంటాను,' అని సిమి గరేవాల్ షోలో రేఖ చెప్పింది. సూపర్‌స్టార్ అమితాబ్ ఆకర్షణలో, ప్రేమలో రేఖ తలమునకలైంది. అయితే దీనిపై అమితాబ్ అధికారికంగా ఏనాడూ స్పందించలేదు.

ప్రతి ఒక్కరినీ సెట్స్ మీద వేచి ఉండేటట్లు చేసేది, మరి అది సాహసమో, వెర్రి ధైర్యమో! ఒకప్పుడు హృషీకేశ్ ముఖర్జీ వంటి గౌరవనీయుడైన దర్శకుడు కూడా 'నమక్ హరామ్' (1973) సెట్‌లో షూటింగ్ నిలిపివేయవలసి వచ్చింది. సగం రోజు పాటు అందరూ ఎదురు చూసినా రేఖ మాత్రం రాలేదు. ఆమె అప్పటికింకా యుక్త వయస్సు, స్వేచ్ఛా ప్రవృత్తి, భావోద్వేగం, త్వరగా చలించిపోయే సున్నితమైన మనసు కల స్టార్‌గా పేరు తెచ్చుకుంది.


అమితాబ్‌తో పరిచయం

బీచ్ అపార్ట్‌మెంట్స్‌లో, రేఖ, జయ తరచుగా కలుసుకునేవారు. రేఖ జయను ఆప్యాయంగా 'దీదీ భాయ్' అని పిలుస్తూ, ఆమెతో గడపడానికి జయ ఫ్లాట్‌కి వెళ్తూ ఉండేది. జయ రేఖకు జీవితం, వృత్తి గురించి సలహాలు ఇస్తూ ఉండేది. అక్కడే రేఖ జయ సన్నిహితుడు, స్నేహితుడైన అమితాబ్ బచ్చన్‌ను మొదటిసారి కలుసుకుంది.

జయ మీద కినుక...

నటుడు మెహమూద్ అధికారిక జీవిత చరిత్ర రచయిత హనీఫ్ ఝావేరి ఇలా అంటాడు. 'అమితాబ్, అన్వర్(మొహమూద్ సోదరుడు) సన్నిహితులు. అమితాబ్, జయలను తరచూ లాంగ్ డ్రైవ్‌లకు తీసుకెళ్లేవాడినని అన్వర్ నాతో చెప్పాడు. ఇద్దరూ అతనితో పాటు కారు, ముందు సీటులో కూర్చొని మాట్లాడుకునేవారు. వెనుక సీటులో రేఖ కూర్చునేది.' జయ, రేఖ ఒక రకంగా సినీ పరిశ్రమలో పోటీదారులు అయినప్పటికీ, జయ ఎంతో ప్రతిభావంతురాలిగా మంచి గౌరవం పొందింది. ఒక ఇంటర్వ్యూలో రేఖపై వ్యాఖ్యానించమని జయను అడిగితే.. రేఖ తనను తాను నటిగా సీరియస్‌గా తీసుకోలేదని జయ చెప్పింది. ఆ ఇంటర్వ్యూలో జయ మాటలు రేఖకు ఏమాత్రం నచ్చలేదని చెబుతారు.

అమితాబ్-జయ నటించిన 'జంజీర్' విజయం సాధించిన తర్వాత అమితాబ్, జయ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. 1973, జూన్ 3వ తేదీన, వారి వివాహం ఘనంగా జరిగింది. అయితే రేఖకు ఆహ్వానం అందకపోవటం ఆమెకు బాధ కలిగించింది. ఒక ఇంటర్వ్యూలో రేఖ మాట్లాడుతూ, 'ఒకప్పుడు నేను జయను సోదరిగా భావించాను. ఆమె ఆపేక్ష నిజమనుకున్నాను. ఎందుకంటే ఆమె చాలా గంభీరంగా, ప్రేమపూర్వకంగా నాకు సలహాలు



ఇచ్చేది. కానీ నాకొక్కదానికే కాదు, ఆమె అందరికీ సలహాలిస్తుందని ఇప్పుడు నేను తెలుసుకున్నాను. ఆమెకు కావలసింది మనుషుల మీద ఆధిపత్యం చలాయించటం మాత్రమే. అది కూడా తనకు అవసరమైనంత వరకే!' రేఖ అంతటితో ఆగలేదు. 'ఆమె పైపైన ఎంత ఆప్యాయత, స్నేహం చూపించినా, నేను తానుండే బిల్డింగ్‌లోనే ఉంటున్నా. తన పెళ్లికి మాత్రం నన్ను ఆహ్వానించలేదు' అంటూ జయ మీద కినుక వ్యక్తం చేసింది.

బచ్చన్ ప్రభావం

అందరిలాగే, రేఖ కూడా అమితాబ్ వ్యక్తిత్వాన్ని చూసి అప్రతిభురాలైంది. 2004లో సిమి గరేవాల్‌తో ఒక ప్రముఖ ఇంటర్వ్యూలో, 'మిస్టర్ అమితాబ్ బచ్చన్ ముందు నిలబడటం తేలికైన విషయం కాదు' అని, 'దో అంజానే'లో అమితాబ్ నాయకు

> 'నేను చేస్తున్న పనిని ఒక సరదాగా భావిస్తాను. అమ్మాయిలు కాలేజీ ఎగ్గొట్టినట్లు నేను షూటింగ్ ఎగ్గొడతాను. అయితే వాళ్లు కాలేజీలకు డబ్బు చెల్లిస్తారు. నా విషయంలో నిర్మాతలు నాకు డబ్బు చెల్లిస్తారు. ఎంత ధైర్యంగా కనిపించినా నా కోసం వెదికి, వేటాడే నిర్మాతలంటే నాకు ఎంతో భయం. స్నేహితుల దగ్గర దాక్కుని, మరునాడు సెట్స్‌లో అనారోగ్యంగా ఉన్నట్లు నటిస్తాను' అంటుంది రేఖ.

> సూటిగా, ధైర్యంగా, రహస్యాల, గోప్యతల ముసుగులు విడిచి రేఖ బాహాటంగా చేసే ప్రకటనలు కలకలం సృష్టించాయి. అయితే ఆమె మాటల్లో నిజానిజాలు నిర్ధారించటం సాధ్యం కాదు. ఈ పరిస్థితిలో ఎవరికి తోచినట్లు వాళ్లు ఊహాగానాలు చేస్తూ, బచ్చన్ పరివారానికి సంఘంలో ఉన్న నిష్కళంకమైన పేరు ప్రతిష్ఠల మీద రేఖ దాడి మొదలు పెట్టినట్లు భావించారు.

డన్న విషయం తెలియగానే ఆమెకు మతిభ్రమించినంత పనైందని చెప్పింది. షూటింగ్ సమయంలో తనకెంతో భయంభయంగా ఉండేదని రేఖ గుర్తు చేసుకుంది. భయాందోళనలతో తాను చెప్పవలసిన డైలాగులు మరచిపోతుంటే అమితాబ్ బచ్చన్ ఒక రోజు తన మంద్రస్వరంలో గంభీరంగా ఆమెను మందలించాడని నవ్వుతూ చెప్పింది రేఖ.

ఇంకా ఆమె ఇలా చెప్పింది. 'అమితాబ్ లాంటి వాళ్లను నేను మునుపెన్నడూ చూసి ఉండలేదు. ఇన్ని మంచి లక్షణాలు ఒకే మనిషిలో ఎలా ఉండగలవు? నేను మూర్ఖురాలిని కాను, తెలివైనదాన్ననే అనుకుంటున్నాను. ఉత్తమత్వాన్ని చూసినప్పుడు గుర్తించగలను'. అమితాబ్ అంకితభావం, చిత్తశుద్ధి, వృత్తిపట్ల శ్రద్ధ రేఖ మనసును చూరగొని, మంత్రముగ్ధురాలిని చేశాయి. అతడు ఆమెపై చూపుతున్న ప్రభావం అందరికీ స్పష్టంగా కనిపించింది.

దీన్ని 'బచ్చన్ ఎఫెక్ట్' (బచ్చన్ ప్రభావం) అని పిలవచ్చేమో గాని రేఖ తన జీవితంలో ఎప్పుడూ చేయని పని ఇప్పుడు చేయటం ప్రారంభించింది. ఆమె 'దో అంజానే' సెట్స్‌కి ఉదయం 6 గంటలకు, అంటే సరైన సమయానికి చేరుకోవటం అందరినీ ఆశ్చర్యపరిచేది. ఆమెలో మార్పు అక్కడితో ఆగలేదు. తన పాత్ర గురించి లోతుగా ఆలోచించడం మొదలుపెట్టి, అమితాబ్‌లాగానే పాత్ర చిత్రణలో చక్కటి అంశాలను చర్చించసాగింది. దశాబ్దాల పాటు సినీ పరిశ్రమను ఉర్రూతలూగించే ప్రణయగాథకు అలా రంగం సిద్ధమైంది! 'దో అంజానే' కారణంగా అందరి దృష్టికి వచ్చిన విషయం ఒకటి లేకపోలేదు. రేఖ తొలిసారి ఒక చక్కటి నటిగా గుర్తింపు తెచ్చుకుంది. ఈ ఒక్క చిత్రం రేఖకు కొత్త గౌరవాన్ని తెచ్చిపెట్టింది. ఔను, ఆమె తహతహలాడిన గౌరవం. దీనికి సంబంధించిన గొప్పతనమంతా అమితాబ్‌కే చెందుతుందన్నది రేఖ. ఒక వ్యక్తిలో ఆమె కోరుకున్న ప్రతి సుగుణానికి అతడు చిహ్నమైనాడు. రేఖ నెమ్మది నెమ్మదిగా అమితాబ్‌ను ప్రేమించసాగింది.

విడిపోవాలని నిర్ణయించుకుంది.

'చిన్నతనంలో నా మీద మా అమ్మ ప్రభావం ఉన్నట్లే, యౌవనంలో ఆ ప్రభావం నా జీవితంపై ప్రగాఢమైన ముద్ర వేసింది. సమయపాలన, మౌనం, క్రమశిక్షణ, అంకితభావం, ఏకాగ్రత వంటి వృత్తి నైపుణ్యాలు నేను అతడి నుండి నేర్చుకున్నాను. అతడు నా ప్రవర్తనను, జీవనశైలిని ప్రభావితం చేశాడు. నేను శాకాహారిగా మారి, ప్రమాదకరంగా జీవించడం మానేశాను. మార్పు మాత్రమే కాదు, ఆ మార్పు జరిగిన ప్రక్రియ కూడా ఎంతో అందమైనది' అని ఆమె భావనా సోమయాతో చెప్పింది. 'ముఖద్దర్ కా సికందర్' విడుదల తర్వాత అమితాబ్ రేఖతో కలసి పనిచేయడంపై అతడి భార్య జయ నిషేధం విధించినట్లు విశ్వసనీయ సమాచారం సినీపరిశ్రమలో వేగంగా వ్యాపించింది. ఈ విషయం గురించి రేఖ మాట్లాడుతూ, 'ఒక వారం తర్వాత (ముఖద్దర్ కా సికందర్ ట్రయల్ షో తర్వాత) సినీ పరిశ్రమలో ప్రతి ఒక్కరూ నాతో, 'అతు', నాతో పనిచేయనని తన నిర్మాతలకు స్పష్టం చేశాడని చెప్పటం మొదలెట్టారు. కానీ అతడు నాతో ఈ విషయమై ఒక్క మాట కూడా మాట్లాడలేదు. నేను అతడిని దాని గురించి ప్రశ్నించడానికి ప్రయత్నించినప్పుడు, అతడు 'ఆ విషయం నన్ను అడగవద్దు, దాని గురించి నేను ఒక్క మాట కూడా మాట్లాడను' అని తేల్చి చెప్పాడు' అని చెప్పింది.

అదే ఇంటర్వ్యూలో, తాను ఎప్పుడూ ధరించే రెండు ఉంగరాలను అమితాబ్ తనకు బహుమతి చేశాడని ఆమె పేర్కొంది. తనతో కలసి పనిచేయడానికి అమితాబ్ నిరాకరించటంతో, ఆమె ఆ రెండు ఉంగరాలను తిరిగి ఇచ్చి అతడితో విడిపోవాలని నిర్ణయించుకుంది. ఆమె మాటల్లోనే, 'సహజంగానే నేనెంతో కలతపడ్డాను, మేము ఆ తర్వాత విడిపోయాము. ఆ సమయంలో నేను 'ఖూబ్‌సూరత్'లో పని చేస్తున్నాను. నా పాత్రలో త్రికరణశుద్ధిగా లీనమైనాను. సినిమా చివరిభాగంలో నేను నా రెండు ఉంగరాలు ధరించకపోవటం మీరు గమనించవచ్చు. అవి 'అతడిచ్చిన' ఉంగరాలు, నేను వాటిని నిద్రపోయేప్పుడు కూడా వేళ్ల నుండి తియ్యను. కానీ విడిపోయి

> **స్వయంసిద్ధ**
> **ఒక అభినేత్రి జీవనరేఖ**
> ప్రచురణ: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా
> **ధర: రూ.350;**
> **ప్రతులకు:** శ్రీదేవి మురళీధర్ (99081 32166)



నప్పుడు నేను వాటిని అతడికి తిప్పి పంపాను'.

అమితాబ్ అవలంబించిన తీరు తనను తీవ్రంగా బాధించిందని రేఖ పేర్కొంది. ఆమెతో పని చేయకూడదన్న అతడి నిర్ణయానికి జయను బాధ్యురాలిగా నిందించింది. జయ వేదనకంటే తాను అనుభవించే బాధ ఎంతో ఎక్కువ అని రేఖ నాటకీయకంగా నొక్కి చెప్పింది. 'కొంతకాలం క్రితం ఓ అవార్డు ఫంక్షన్‌లో నేను కొన్ని కవిత్వ పంక్తులు గానం చేశాను. అందరూ ఆ పంక్తులు 'అతడి'కోసం ఉద్దేశించానని పొరబడ్డారు. నిజానికి ఆ మాటలు జయను ఉద్దేశించి అన్నాను', అని రేఖ చెప్పింది.

అక్కడ రోజంతా చదువుకోవచ్చు...

"పాఠాలు చెప్పడంతోనే టీచర్ బాధ్యత తీరిపోదు. పిల్లల్లో జ్ఞానాన్ని పెంచాలి. సొంత నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం కలిగించాలి" అంటారు మమతా సింగ్. ఆమె నెలకొల్పిన గ్రంథాలయం పిల్లలకే కాదు, పెద్దలకూ విజ్ఞానాన్ని పంచుతోంది. ఏ సీజన్‌లోనైనా రోజంతా తెరిచి ఉండే లైబ్రరీగానూ అది ప్రసిద్ధి చెందింది. అయితే దీని ఏర్పాటు కోసం మొదట్లో ఎన్నో అభ్యంతరాలు, ఇబ్బందులు ఎదుర్కొన్నానంటున్న మమతాసింగ్ కథ ఆమె మాటల్లోనే...

"సావిత్రీబాయి పూలే పేరుతో గ్రంథాలయం ఏర్పాటు చేస్తానని చెప్పినప్పుడు మా గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. "మీ అమ్మ పేరు పెట్టుకో. లేదా మరేదైనా పేరు పెట్టుకో. ఆ పేరు మాత్రం వద్దు" అని కరాఖండిగా చెప్పారు. "సావిత్రీబాయి గొప్ప సంఘ సేవకురాలు. భారత దేశంలోని మొదటి బాలికల పాఠశాలకు తొలి మహిళా టీచర్. దాన్ని మీరు ఎందుకు వద్దంటున్నారు?" అని ప్రశ్నించాను. కానీ దానికి సమాధానం నాకు తెలుసు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో కుల వ్యవస్థ చాలా బలంగా ఉంటుంది. ఎవరైనా కళాశాలలు, పాఠశాలలు పెట్టాలనుకుంటే... వాళ్ళ అమ్మ పేరో, నాన్న పేరో పెట్టుకుంటారు. సావిత్రీబాయి దళితురాలు, మహిళ. కాబట్టే ఈ అభ్యంతరాలు. కానీ ఆమె బాలికా విద్య కోసం ఎంతగానో పాటుపడ్డారు. అందుకే ఎవరు ఏమన్నా నేను తలవంచలేదు. అలా 2018 జనవరిలో... 'సావిత్రీబాయి పూలే గ్రంథాలయం' ఉత్తరప్రదేశ్ అమేథీ జిల్లాలో నా స్వగ్రామమైన అగ్రేసర్‌లో ప్రారంభమయింది. దీని స్థాపన వెనుక ప్రధాన కారణం... ఉపాధ్యాయురాలిగా పాఠాలతో పాటు విజ్ఞానాన్ని, ఆలోచనాశక్తినీ అందించాలన్న కోరిక, పుస్తక పఠనం అంటే నాకున్న ఆసక్తి.



నా చిన్నప్పటి కల...

మా అమ్మ, నాన్న ఇద్దరూ టీచర్లే. చదువుకోవడానికి మంచి వాతావరణం ఉండేది. ఇంట్లో మ్యాగజైన్లు కొనేవాళ్ళు బడి పాఠాలతో పాటు... కథల పుస్తకాలు ఎక్కువగా చదివేదాన్ని. నెలకు కనీసం ఎనిమిది, తొమ్మిది పుస్తకాలైనా పూర్తి చేసేదాన్ని. నాకు ఒక ప్రత్యేకమైన గది ఉండాలి. అది పై నుంచి కిందవరకూ పుస్తకాలతో నిండి ఉండాలి. ఇదీ నా చిన్నప్పటి కల. అయితే అది లైబ్రరీ కూడా కావచ్చని అప్పట్లో నేను ఊహించలేదు. మొదట్లో నన్ను బాగా చదువుకోవాలని చెప్పిన అమ్మానాన్నా... నేను ఇంటర్‌లో ఉన్నప్పుడు... చదువు మాన్పించేశారు. పెళ్ళి సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. అయితే నా అన్నలిద్దరూ ప్రోత్సహించడంతో... ప్రైవేటుగానే గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. పోటీ పరీక్షలు కూడా రాశాను. వివాహం అయిన వెంటనే... టీచర్ సెలక్షన్ ఎగ్జామ్ రాసి, సెలక్ట్ అయ్యాను. అలా 2002లో అధ్యాపకురాలుగా కెరీర్ మొదలైంది. నిజం చెప్పాలంటే ఇదేదీ నేను ప్రణాళిక వేసుకొని చేసింది కాదు. టీచర్ అవుతానని అస్సలు అనుకోలేదు. కానీ తొందరలోనే ఆ వృత్తి ఎంతగానో నచ్చింది. పిల్లలకు పాఠాలు చెబుతున్నప్పుడు ఒక విషయం గ్రహించాను. వాళ్ళు తరగతిలో చెప్పేవి కష్టపడి గ్రహిస్తున్నా... అంతకుమించిన పరిజ్ఞానమేదీ లేదు. అది పుస్తక పఠనం ద్వారానే వస్తుంది. కానీ మా ఊళ్ళో వాళ్ళకి పుస్తకాలు అందుబాటులో లేవు. ఈ అంతరాన్ని తగ్గించి, వారిని పుస్తకాలకు చేరువ చేయాలంటే... నేనే లైబ్రరీ ఏర్పాటు చేస్తే మంచిదనుకున్నాను. దాని ఫలితమే 'సావిత్రీబాయి పూలే లైబ్రరీ'. మా ఊరిలో అదే మొదటి గ్రంథాలయం. నా దగ్గర ఉన్న పుస్తకాలను అందులో ఉంచాను. మరికొన్ని పుస్తకాలు కొన్నాను. కథలు, జనరల్ నాలెడ్జ్ లాంటి వాటికి ప్రాధాన్యం ఇచ్చాను. పుస్తకాలు చదవడం, తరగతులు ముగిశాక వాటి గురించి చర్చించడం లాంటివి ప్రోత్సహించాను. పిల్లలు కూడా ఎంతో ఉత్సాహం చూపించారు.



అంతా ఉచితం...

ఆశ్చర్యమేమిటంటే... క్రమంగా వయోధికులు, మహిళలు కూడా లైబ్రరీకి రావడం మొదలుపెట్టారు. ఖాళీ సమయాల్లో చిన్న చిన్న బాధ్యతలు కూడా తీసుకోవడానికి ముందుకొచ్చారు. గ్రామ పెద్దల వైఖరిలో కూడా మార్పు కనిపించింది. దాంతో నాకో ఆలోచన వచ్చింది... లైబ్రరీని రోజంతా తెరిచి ఉంచితే ఎలా ఉంటుందని. ఎవరు ఎప్పుడైనా రావచ్చు. తమకు కావలసిన పుస్తకాన్ని చదువుకోవచ్చు లేదా ఇంటికి తీసుకువెళ్ళి, చదివి తిరిగి ఇవ్వవచ్చు. ఈ ప్రతిపాదన అందరికీ నచ్చింది. ఇప్పుడు... వర్షాకాలమైనా, శీతాకాలమైనా, వేసవి సెలవుల్లోనైనా... పండగలైనా, మరే సెలవులు వచ్చినా... మా లైబ్రరీ పని చేస్తూనే ఉంటుంది. డైబ్బెల వయసున్నవారి నుంచి ఏడేళ్ళ వయసువారి వరకూ ఇక్కడికి వస్తారు. వారికి నచ్చినవి చదువుకుంటారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతోంది. రోజూ పొద్దున్నే లైబ్రరీకి వచ్చి, వార్తాపత్రికలు చదివి... ఆ తరువాత తమ పనులకు వెళ్ళేవారు ఎంతో మంది ఉన్నారు. మంచి పుస్తకాలను ఎవరైనా సూచిస్తే... వాటిని తెప్పిస్తున్నాను. ఇక్కడ అంతా ఉచితం. ఎలాంటి మెంబర్‌షిప్ ఛార్జీలూ తీసుకోవడం లేదు. ఎక్కువగా నా సొంత డబ్బే ఖర్చు చేస్తున్నాను. ప్రస్తుతం బడి, లైబ్రరీ... ఇవే నా లోకమైపోయాయి. నేను ఏ రోజైనా పూజ చేయడం మానేశానేమో కానీ... లైబ్రరీకి వెళ్ళడం మానలేదు. తీర్థయాత్రల్లాంటి వాటికన్నా... ఎక్కడైనా మంచి పుస్తకాలు దొరుకుతాయంటే అక్కడికి వెళ్ళి తీసుకొస్తాను. దీని వెనుక నా స్నేహితుల సహకారం కూడా ఎంతో ఉంది. దూరప్రాంతాల్లో ఉన్నవాళ్ళు పుస్తకాలను పంపిస్తూ ఉంటారు. ఎక్కడినుంచైనా బరువైన పార్సిల్ వచ్చిందంటే... వాటిలో కచ్చితంగా పుస్తకాలే ఉంటాయని... పోస్ట్‌మ్యాన్లు నేరుగా మా లైబ్రరీకి తీసుకొచ్చేస్తారు. ఇప్పుడు పక్క గ్రామాల వాళ్ళు కూడా మా ఊరికి వచ్చి, పుస్తకాలు తీసుకువెళ్తున్నారు. తమ ఊళ్ళలో ఇటువంటి లైబ్రరీల ఏర్పాటుకోసం నన్ను సంప్రతిస్తున్నవారు కూడా ఉన్నారు. ఇలా రోజంతా నడిచే మా లైబ్రరీ నమూనాను అధ్యయనం చెయ్యడానికి అధికారుల బృందాన్ని రాష్ట్రప్రభుత్వం పంపింది. త్వరలోనే ఇతర

నవ్య | చిత్రజ్యోతి



సిద్ధు జొన్నలగడ్డ హీరోగా రూపొందుతున్న చిత్రం 'టిల్లూ స్క్వేర్'. అనుపమా పరమేశ్వరన్ కథానాయిక. మల్లిక్‌రామ్ దర్శకత్వంలో నాగవంశీ నిర్మిస్తున్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది.

మాస్ మెచ్చేలా బెల్లంకొండ సినిమా



బెల్లంకొండ శ్రీనివాస్ కొత్త సినిమా తొలి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. సాగర్‌చంద్ర దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రానికి రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మాతలు. ఈ భారీ షెడ్యూల్‌లో కీలకసన్నివేశాలను పూర్తిచేశారు. అత్యుత్తమ సాంకేతికనిపుణులు పనిచేస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన వర్కింగ్‌స్టిల్స్‌ని ఆదివారం విడుదల చేశారు. ఈ నెల 3న బెల్లంకొండ శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన టైటిల్‌ను, ఫస్ట్‌లుక్‌ని విడుదల చేయనున్నట్టు మేకర్స్ తెలిపారు. బెల్లంకొండ పాత్ర అత్యంతశక్తిమంతంగా ఉంటుందని, మాస్ ప్రేక్షకులు మెచ్చే కథ, కథనాలతో రూపొందుతోన్న ఈ చిత్రం తప్పకుండా మంచి విజయం సాధిస్తుందని నిర్మాతలు నమ్మకం వెలిబుచ్చారు. ఈ చిత్రానికి కెమెరా: ముఖేష్ జ్ఞానేష్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాణం: 14రీల్స్ ప్లస్.



'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'

కోలీవుడ్ హీరో విజయ్ నటిస్తున్న 68వ చిత్రం టైటిల్‌ను నిర్మాణ సంస్థ ఏజీఎస్ ప్రొడక్షన్స్ ఆదివారం ప్రకటించింది. వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌పై 'వెలుతురు చీకటిని మింగేయగలదు.. కానీ, చీకటి వెలుతురును వింగలేదు' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ఈ చిత్రంలో విజయ్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. మీనాక్షి చౌదరి, స్నేహ, లైలా, రాఘవ లారెన్స్, ప్రశాంత్, మైక్ మోహన్, ప్రేమ్‌జీ తదితరులు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతాన్ని అందిస్తున్నారు.



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందించిన ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు.

టీనేజ్ లవ్‌స్టోరీ



ఓ యదార్థ సంఘటన ఆధారంగా దర్శకుడు శ్రీనాథ్ పులకురం తెరకెక్కించిన టీనేజ్ లవ్‌స్టోరీ 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు 500143'. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. గాయని మంగ్లీ ఆలపించిన 'డూడుం డుక్కుడుం' పాటను సంగీత దర్శకుడు జీవీప్రకాశ్ కుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ గీతానికి సాయికిరణ్ సాహిత్యం అందించారు. కార్తిక్ రోడ్రిగ్జ్ స్వరాలు సమకూర్చారు. ప్రణవ్ సింగంపల్లి, రామ్ పటాస్ ముఖ్య తారాగణం. భువన్‌రెడ్డి కొవ్వూరి నిర్మాత.

జీవితం చెప్పిన కథ



దేవ్, ప్రియ చౌహాన్, సరిత ప్రధాన తారాగణంగా మురళీ రామస్వామి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దీనమ్మ జీవితం'. వై మురళీకృష్ణ, డి. దివ్యసంతోషి, బి సోనియా నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఇటీవలే చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'డిఫరెంట్ కంటెంట్‌తో వస్తున్న చిత్రమిది. తమిళంలోనే కాదు తెలుగులోనూ కంటెంట్ ఆధారిత సినిమాలు తీయగలరని నిరూపిస్తుంది' అని చెప్పారు. సమాజంలో జరుగుతున్న సంఘటనల ఆధారంగా అల్లుకున్న కథ ఇది, పెద్ద విజయాన్ని అందుకుంటామనే నమ్మకం ఉందని దేవ్ అన్నారు.

బ్రహ్మానందంకు స్వర్ణకంకణం ప్రదానం 3న



ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ రాగ సప్తస్వరం 35వ వార్షికోత్సవం సందర్భంగా ప్రఖ్యాత హాస్య నటుడు బ్రహ్మానందంకు జీవన సాఫల్య పురస్కారంతో పాటు స్వర్ణ కంకణం ప్రదానం చేయనున్నారు. ఈ నెల 3న రవీంద్రభారతిలో సాయంత్రం 6గంటలకు జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. దీంతో పాటు ప్రముఖ నాట్య గురువు సుజత వింజమూరికి ఆత్మీయ సత్కారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాగసప్తస్వరం అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ బుధవారం జరగనున్న వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎంపీ లక్ష్మణ్, నటుడు మురళీమోహన్ హాజరవుతారని తెలిపారు.



తమిళసీమలో చంద్రబాబుకు అభిమానుల నీరాజనం

చెన్నై (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుకు తమిళనాడు రాష్ట్రంలోని తిరుపత్తూరు జిల్లాలో ఆయన అభిమానులు ఘన స్వాగతం పలికారు. శనివారం రాత్రి తిరుపత్తూరు జిల్లాలోని నాట్రాంపల్లి సమీపంలోని పచ్చూరు సమీపంలోని జాతీయ రహదారిలో ఆయన కాన్వాయ్ వెళ్ళింది. ఆ విషయం తెలుసుకున్న స్థానిక తమిళ ప్రజలు భారీ సంఖ్యలో జాతీయ రహదారిపైకి తరలివచ్చి.. చంద్రబాబుకు పూలమాల వేసి, ఆయనపై పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు.

గవర్నర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన సందేశం విడుదల చేశారు. నూతన సంవత్సర 2024 ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఉల్లాసం, సంతోషం, శాంతి, శ్రేయస్సును అందించాలని ఆకాంక్షించారు.

కొత్త ఆశలతో 2024ను ఆహ్వానిద్దాం: బాబు

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కొత్త ఆశలతో, కొత్త సంకల్పంతో, కొత్త విశ్వాసంతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదామంటూ టీడీపీ అధినేత చంద్రబాబు ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో హింసకు, అవినీతికి, అశాంతికి, అక్రమాలకు తావులేని రాష్ట్రం కావాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. 'నాలుగున్నరేళ్ల నరకానికి పరాకాష్ఠగా 2023లో ప్రత్యక్షంగా అనుభవించామని, భరించాం. నూతన సంవత్సరంలో మరో నూరు రోజుల్లో ఆటవిక పాలన నుంచి తెలుగు ప్రజలకు విముక్తి కల్పిస్తామ'ని పేర్కొన్నారు. అలాగే, రాష్ట్ర ప్రజలందరికీ ఏపీ టీడీపీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త ఏడాదిలో మంచి నిర్ణయం తీసుకోండి: పవన్

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. 2024 సంవత్సరంలో ఏపీ ప్రజలు తీసుకొనే నిర్ణయం రాష్ట్ర పురోగతికి మేలు మలుపు కావాలని సూచించారు. ప్రజా నిర్ణయం కచ్చితంగా రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమంపై ప్రభావం చూపిస్తుందని పేర్కొన్నారు.

అనాథాశ్రమాన్ని సందర్శించిన పవన్ సతీమణి

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నారపల్లి ప్రాంతంలోని ఫ్రెండ్స్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలోని అనాథ శరణాలయాన్ని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సతీమణి అనా కొణిదెల సందర్శించారు. అక్కడి అనాథ బాలబాలికలతో ముచ్చటించి కేక్ కట్ చేశారు. అయిదుగురు బాలికల చదువులకు స్కూల్ ఫీజులు చెల్లించాల్సిన అవసరం ఉందని తెలుసుకుని ఆ మొత్తాన్ని ఆమె అందించారు.

బీసీ నేతలకు గుర్తింపు లేదు.. లోకేశ్ ట్వీట్

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): 'బీసీ నేతలకు గుర్తింపులేదు, దళిత నేతలకు అపాయింట్‌మెంట్ లేదు. జగన్ స్టయిల్ సామాజిక న్యాయం అంటే ఇదేనే మో!' అంటూ టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.

టీడీపీ గెలుపు ఖాయం

▸▸ వైసీపీ బీఫాంపై పోటీ చేస్తే ఓటమే: బుద్దా వెంకన్న

విజయవాడ(వన్‌టౌన్), డిసెంబరు 31: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ బీ ఫాంపై పోటీ చేసేవారంతా ఓడిపోతారని టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి, పార్టీ ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న పేర్కొన్నారు. చంద్రబాబును అన్యాయంగా అరెస్టు చేయడంతో టీడీపీపై ప్రజల్లో సానుభూతి పెరిగిందని, 2024లో టీడీపీ విజయం ఖాయమని చెప్పారు. ఆదివారం విజయవాడలోని తన కార్యాలయంలో బుద్దా వెంకన్న మాట్లాడారు. ఈసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ ఇవ్వబోమని వైసీపీ అధిష్ఠానం చెబుతుంటే మంత్రులు, ఆ పార్టీ ఎమ్మెల్యేలు చాలా సంతోషంగా వెనుదిరిగి వెళ్లిపోతున్నారన్నారు. ఎలాగూ ఓడిపోతామని భావించి సీఎం నిర్ణయానికి వారు అంగీకరిస్తున్నారని విశ్లేషించారు. 2023 సంవత్సరాన్ని జగన్‌రెడ్డి విధ్వంస నామ సంవత్సరంగా పేర్కొన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి విజయం సాధిస్తాడని ఆకాంక్షించారు.



దళితనేత కొలికపూడిపై వేధింపులు దుర్మార్గం: అచ్చెన్న

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై స్పందిస్తున్న దళిత ఉద్యమనేత కొలికపూడి శ్రీనివాసరావుపై జగన్‌రెడ్డి వేధింపులు దుర్మార్గమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో విమర్శించారు. కొలికపూడిపై సీఐడీని ఉసిగొల్పి కేసు నమోదు చేసి అరెస్టుకు యత్నించడం దారుణమని పేర్కొన్నారు. నోటీసులిచ్చేందుకు హైదరాబాద్‌కు వెళ్లిన సీఐడీ పోలీసులు 11 ఏళ్ల పాపకు నోటీసులిస్తామని బెదిరించడం అమానవీయమని, నియంతలు పాలిస్తున్న దేశాల్లో కూడా ఇంతటి క్రూరత్వం లేదని విమర్శించారు.

సీఎంగా జగన్‌కు ఇదే ఆఖరి న్యూ ఇయర్: విష్ణు

విశాఖపట్నం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సీఎంగా జగన్‌కు ఇదే ఆఖరి న్యూఇయర్ అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యానించారు. జగన్‌కి అధికారం పోయే రోజులు దగ్గర పడ్డాయి. వైసీపీ నుంచి ఒక్కొక్కరుగా బయటకు వస్తూ జరిగిన అవమానాలను ఏకరువు పెడుతున్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలకు కూడా ఏళ్ల తరబడి అపాయింట్‌మెంట్ ఇవ్వని జగన్ సీఎంగా ఉండడం రాష్ట్ర ప్రజల దురదృష్టం.

ఇండియా కూటమితోనే ప్రజలకు రక్ష

▸▸ కాంగ్రెస్ పార్టీ సమాలోచన సమావేశంలో నేతలు

విజయవాడ(ధర్నాచౌక్), డిసెంబరు 31: దేశం, రాష్ట్రంలోని దళిత, గిరిజన, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అన్నారు. ఇండియా కూటమితోనే రాజ్యాంగానికి, ప్రజలకు రక్ష అన్నారు. దళిత, గిరిజన, బీసీ, మైనారిటీ సంఘాలు, భావసారూప్యత కలిగిన రాజకీయ పార్టీల నేతలతో కాంగ్రెస్ పార్టీ సమాలోచన సమావేశం గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి బీజేపీపై పోరాడాలని, దీనికి కాంగ్రెస్ పార్టీ నేతృత్వం వహించాలని అన్నారు. రాష్ట్రంలోనూ బీజేపీకి మద్దతిస్తున్న మూడు ప్రధాన రాజకీయ పార్టీలను ఓడించి కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి సూచనలు, సలహాలు తీసుకుని ముందుకు వెళ్తామన్నారు. సీపీఐ, సీపీఎం రాష్ట్ర నేతలు జల్లి విల్సన్, వై.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలు వస్తుంటాయి.. పోతుంటాయి

▸▸ కాంగ్రెస్‌లో షర్మిల చేరే అంశంపై మంత్రి బొత్స వ్యాఖ్యలు

బొబ్బిలి, డిసెంబరు 31: 'రాజకీయ పార్టీలు కొత్తగా వస్తుంటాయి.. పోతుంటాయి! కొన్నే మనగలుగుతాయి. అదో నిరంతర ప్రక్రియ.. దాని గురించి పెద్దగా ఆలోచించాల్సిన పనిలేదు' అని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పక్కి గ్రామంలో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం ముగింపు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. షర్మిల కాంగ్రెస్‌లో చేరితే వైసీపీపై ఎటువంటి ప్రభావం చూపుతుందని ప్రశ్నించగా మంత్రి పైవిధంగా స్పందించారు. విజయనగరం జిల్లాలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిల మార్పు ఉంటుందా? అని ప్రశ్నించగా 'మార్పు జరిగిన తరువాత మాట్లాడదాం, జరగని వాటి గురించి ఎందుకని మంత్రి సమాధానాన్ని దాటవేశారు.



ప్లీజ్.. ఏపీకి రావొద్దు చెల్లీ!



(మొదటి పేజీ తరువాయి)

చూడలేదు కానీ.. ఏపీకి వస్తానంటే రాయబారానికి వచ్చారా? ఏనాడైనా నా తరఫున మాట్లాడారా? నాకు ఊరట కలిగించేలా చేశారా? నేను ఎంతో మానసిక క్షోభ అనుభవించాను. అప్పుడెప్పుడూ లేనిది, ఇప్పుడు జగన్‌కు ఇబ్బంది అవుతుందని నా దగ్గరకు వచ్చారు. ఇదేమి న్యాయం? కుదరదులే. నా ఆలోచనలు నాకున్నాయి. నా మానాన నన్ను బతకనివ్వండి" అని ముఖం మీదే షర్మిల కుండబద్దలు కొట్టినట్లు తెలిసింది. అసలు ఈ పరిస్థితుల్లో వచ్చి ఉండకూడదని, తప్పుడు సంకేతాలు వెళ్తాయని ఆమె మండిపడినట్లు సమాచారం. 'అదేంటమ్మా.. మనమంతా ఒకే కుటుంబం కదా'.. అని సుబ్బారెడ్డి బుజ్జగించే ప్రయత్నం చేయగా... 'నన్ను రోడ్డు మీద వదిలేసినప్పుడు కుటుంబంలో నేనూ ఒకరిని అన్న విషయం గుర్తుకులేదా?' అని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

గతంలో అంతా తానై..

జగన్ జైలులో ఉన్నప్పుడు, గత ఎన్నికల సమయంలోను ఆయన తరఫున సోదరి షర్మిల విస్తృతంగా ప్రచారం చేశారు. 'జగనన్న వదిలిన బాణాన్ని' అని సగర్వంగా చెప్పుకొన్నారు. షర్మిలను ఇన్నాళ్లూ నిర్లక్ష్యం చేసి దూరదూరంగా పెట్టి, అనేక రకాల వేధింపులకు గురి చేసిన జగన్ ఇప్పుడు తన బంధువర్గాన్ని ఆమెపై పురమాయిస్తున్నారు. ఇప్పటికే జగన్ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడటం.. పార్టీలో రోజురోజుకూ ధిక్కార స్వరాలు పెరుగుతుండటం.. దీనికితోడు షర్మిల ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు చేపడుతున్నారని వార్తలు రావడంతో తాడేపల్లి శిబిరం మరింత ఆందోళన చెందుతోంది. వైసీపీ ప్రేరేపిత సోషల్ మీడియా ఇప్పటికే షర్మిలపై విమర్శలు గుప్పించడం మొదలుపెట్టింది. ట్విటర్, ఫేస్‌బుక్ ఖాతాల ద్వారా షర్మిల వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా పోస్టులు పెడుతున్నారు.

అదా.. సంగతి!

▸▸ పద్మాజనార్ధన్‌రెడ్డిపై జగన్‌కు వల్లమాలిన ప్రేమ

▸▸ వివేకా కేసులో ఏ5 శివశంకర్‌రెడ్డికి వియ్యంకుడు

▸▸ సీపీడీసీఎల్ సీఎండీగా ముగిసిన పదవీకాలం

▸▸ ఇప్పటికి రెండేళ్లు చొప్పున రెండుసార్లు పోస్టింగ్

▸▸ మూడోసారి పొడిగించేందుకూ సిద్ధమైన జగన్!

▸▸ మంత్రి వ్యతిరేకించినా బుజ్జగించే యత్నం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పద్మా జనార్ధన్‌రెడ్డి.. కేరాఫ్ కడప. మొన్నటి వరకు సీపీడీసీఎల్ సీఎండీగా ఉన్న ఆయన ఇప్పుడు అధికార వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారారు. ఇప్పటికే అధికారంలోకి వచ్చాక రెండుసార్లు సీపీడీసీఎల్ సీఎండీగా ఆయనకు అవకాశం ఇచ్చారు. ముచ్చటగా మూడోసారి అవకాశం ఇవ్వాలని తహతహలాడుతున్నారు. అంతగా ఆయనలో నచ్చిన అంశాలేమిటి? ఆయన పనితీరు మహాద్భుతంగా ఉందా? లేక సర్కారుకు వేలకోట్ల కొత్త ప్రాజెక్టులు తీసుకొస్తున్నారా? ఇంధన శాఖ మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి ఆయన నియామకాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఫైలుపై 'నాకిష్టంలేదం'టూ అడ్డంగా రాసినా సీఎం కార్యాలయం ఎందుకంత పట్టుదలగా జనార్ధన్‌రెడ్డినే తిరిగి ఆ పోస్టులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోంది? సామాన్యులకు అర్థమయ్యే విషయం కాదు. పెద్దపెద్ద ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లకు కూడా అర్థమయ్యే విషయం కాదట. మరి ఆ విషయం ఏమిటనుకుంటున్నారా?... ముఖ్యమంత్రి జగన్ బాబాయి, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు గురించి తెలిసి ఉండాలి. ఈ కేసులో ఏ5గా ఉన్న శివశంకర్‌రెడ్డి గురించి తెలిసి ఉండాలి. అప్పుడే పద్మా జనార్ధన్‌రెడ్డి నియామకం కోసం జగన్ ఎంతలా ఆరాటపడుతున్నారో తెలిసిపోతుంది. ఆ సంగతే వేరు. పద్మా జనార్ధన్‌రెడ్డి స్వస్థలం కడప జిల్లా. ఆయన ఇంధన శాఖ పరిధిలోని ఎలక్ట్రికల్ విభాగంలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. ఆయన కడప వైసీపీ నేత శివశంకర్‌రెడ్డికి స్వయానా వియ్యంకుడు. శివశంకర్‌రెడ్డి ఎవరో తెలుసా? మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో ఏ5. వివేకా హత్యలో ఆయనదే కీలకపాత్ర అన్న ఆరోపణలున్నాయి. ఇదీ అసలు సంగతి. అంటే, వివేకా హత్యకేసులో కీలక నిందితుడిగా ఉన్న శివశంకర్‌రెడ్డి స్వయానా వియ్యంకుడు కావడం వల్లే పద్మా జనార్ధన్‌రెడ్డి పట్ల జగన్ సర్కారు అవాజ్యమైన ప్రేమను చూపిస్తోంది.

జగన్ సర్కారు రాగానే పద్మాజనార్ధన్‌రెడ్డికి పోస్టింగ్ ఇచ్చేందుకు ఎస్‌పీడీసీఎల్‌ను ముక్కలు చేశారు. దాని నుంచి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలను వేరుచేసి కొత్తగా సీపీడీసీఎల్ అనే సంస్థను ఏర్పాటు చేసి దానికి పద్మా జనార్ధన్‌రెడ్డిని సీఎండీగా నియమించారు. తొలుత రెండేళ్లు అని పోస్టింగ్ ఇచ్చారు. ఆ తర్వాత మరో రెండేళ్లు పొడిగించారు. తాజాగా ఆయన పదవీకాలం ఈనెల 26తోనే ముగిసిపోయింది. ముచ్చటగా మూడోసారీ ఆయనకు మరో రెండేళ్ల పొడిగింపు ఇచ్చేందుకు సర్కారు ప్రతిపాదనలు పంపించగా ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అడ్డుతిరిగారు. ఆయనను కొనసాగించవద్దని తేల్చిచెబుతూ ఫైల్‌పై అడ్డంగా రాశారు.

తాడేపల్లి ప్యాలెస్ పెద్దలు, తమ సొంత అధికారులను పంపించి రాయబారం నడిపినా మంత్రి పెద్దిరెడ్డి కుదరదని చెప్పారు. మంత్రి ఆమోదం లేకుండా ఆయన కొనసాగింపు కుదరదని తేలిపోయింది. అయితే, పద్మా జనార్ధన్‌రెడ్డి మాత్రం తాను ఎలాగైనా పోస్టులోకి వస్తానంటూ, అప్పటి వరకు కొత్తగా ఎవ్వరినీ నియమించవద్దంటూ ఇంధనశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. అంతేనా...ఆయన అనధికారింగా ఆఫీసుకు వెళ్లి కూర్చుంటున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. ఆఫ్‌లైన్ ఫైళ్లను కూడా పరిశీలన చేస్తున్నారని వారు చెబుతున్నారు. ఇటీవల జరిగిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు. మంత్రికి ఏమాత్రం ఇష్టంలేకున్నా, తిరిగి తనే వస్తానని ఆయన ఏ ధైర్యంతో చెబుతున్నారన్నదే ఉద్యోగులకు అంతుచిక్కని ప్రశ్న. దాని వెనుక ఉన్న బలమైన కారణం...ఆయన జగన్‌కు, కడప ఎంపీ అవినాశ్‌రెడ్డికి సన్నిహితుడైన శివశంకర్‌రెడ్డి వియ్యంకుడు కావడమే!. ఆ ధైర్యంతోనే ఆయన పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఇదీ అసలు కథ. అంతేకానీ, ఆయనేదో నిజాయతీపరుడు, సర్కారుకు వేల కోట్ల కొత్త ప్రాజెక్టులు తెచ్చిపెట్టిన ఘనుడని పోస్టుల్లో కొనసాగించడంలేదని స్పష్టమవుతోంది. సీపీడీసీఎల్ పరిధిలో వెయ్యికోట్ల మేర అక్రమాలు జరిగాయంటూ అప్పుడే ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వాటిపై విచారణ జరిపించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇందులో కొన్ని ఫిర్యాదులు మంత్రి పెద్దిరెడ్డికీ చేరినట్లు తెలిసింది.



ఫ్లెక్సీల విషయంలో వాగ్వాదం చేసుకుంటున్న పరిటాల శ్రీరామ్, గోనుగుంట్ల సూర్యనారాయణ వర్గీయులు

పరిటాల వర్సెస్ గోనుగుంట్ల

▸▸ ధర్మవరంలో ఫ్లెక్సీల వివాదం

▸▸ టీడీపీపై గోనుగుంట్ల విమర్శలు

▸▸ తిప్పికొట్టిన యువ నేత శ్రీరామ్

▸▸ ఇరు వర్గీయుల మధ్య వాగ్వాదం

▸▸ పరస్పర విమర్శలతో రాజకీయ కాక

ముదిగుబ్బ/ధర్మవరం, డిసెంబరు 31: శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండల కేంద్రలో ఫ్లెక్సీల వివాదం రాజుకుంది. ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ వర్గీయులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దీనిలో టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్, ఎమ్మెల్యే బాలకృష్ణ ఫొటోలు ముద్రించారు. దీనిని టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ వర్గీయులు వ్యతిరేకించారు. ఫ్లెక్సీలో తమ నాయకుల ఫొటోలు ఎందుకు వేశారని, వాటిని తొలగించాలని పట్టుబట్టారు. గోనుగుంట్ల సూర్యనారాయణ ప్రస్తుతం బీజేపీలో కొనసాగుతున్నందున ఆ పార్టీ అగ్రనేతలు మోదీ, అమిత్‌షా ఫొటోలు వేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం తలెత్తింది. పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, గోనుగుంట్ల సూర్యనారాయణ 2014లో టీడీపీ తరఫున ధర్మవరం ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. 2019 ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసి ఓడిపోయాక బీజేపీలో చేరిపోయారు.

ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి

▸▸ నినాదాలతో హోరెత్తించిన అంగన్వాడీలు

▸▸ నడిరోడ్డుపై ఆట పాటలు, నృత్యాలు

▸▸ 20వ రోజూ కొనసాగిన ఆందోళనలు

▸▸ నెల్లూరులో ఎద్దు కొమ్ములకు వినతిపత్రం

▸▸ మదనపల్లెలో సాష్టాంగ నమస్కారాలు

▸▸ ఏలూరు జిల్లాలో పొర్లుదండాలతో నిరసన

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



రైల్వేకోడూరులో 20 ఆకారంలో కూర్చుని అంగన్వాడీల నిరసన

వేతనాలు పెంచకపోతే రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వంతో కబడ్డీ ఆడేస్తామని అంగన్వాడీలు హెచ్చరించారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ వీరు చేపట్టిన ఆందోళనలు ఆదివారం 20వ రోజూ కొనసాగాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ రోడ్లపైనే ఆటాపాటా నిర్వహించారు. ఉద్యమంపై ప్రత్యేకంగా రూపొందించిన పాటలకు నృత్యాలు చేస్తూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నెల్లూరులోని మైపాడు గేటు నుంచి సత్యనారాయణపురం వరకు ప్రదర్శన నిర్వహించారు. అక్కడ ఎద్దు కొమ్ములకు వినతిపత్రం కట్టి ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలంటూ నినాదాలు చేశారు. "సమస్యలు పరిష్కరించమని నాలుగేళ్లుగా అడుగుతున్నా మాపై కనికరం లేదు.. మీకో దండం స్వామీ... మా డిమాండ్లు పరిష్కరించండి" అంటూ అన్నమయ్య జిల్లా మదనపల్లె ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు సాష్టాంగ నమస్కారాలు పెట్టి నిరసన తెలిపారు. అనంతరం మదనపల్లె రూరల్, అర్బన్ గ్రామ వార్డు సచివాలయాల్లో వినతిపత్రాలు ఇచ్చారు. తంబళ్లపల్లె ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ప్రాజెక్టు పరిధిలోని తంబళ్లపల్లె, కురబలకోట, పెద్దమండ్యం మండలాలకు చెందిన అంగన్వాడీలు నిరసనను కొనసాగించారు. రైల్వేకోడూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 20వ ఆకారంలో కూర్చుని అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. రాయచోటి, రాజంపేటలో ఆందోళనలు కొనసాగాయి. కడప జిల్లా మైదుకూరులో కబడ్డీ ఆడి, పోరుమామిళ్లలో ఉరితాళ్లతో నిరసన తెలిపారు. కొండాపురంలో గోవుకు వినతిపత్రం ఇచ్చారు. జమ్మలమడుగులో అంగన్వాడీల సమ్మెకు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి మద్దతు ప్రకటించారు. ఏలూరులో పొర్లుదండాలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. చాట్రాయిలో అంగన్వాడీలు నిరసన దీక్షకు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య మద్దతు తెలిపారు. పోలవరం, లింగపాలెంలో ఆటపాటలతో నిరసన తెలిపారు. పెదపాడు, చింతలపూడి, కైకలూరు, ముదినేపల్లి, పెదవేగి, మండవల్లి, కలిదిండి, కామవరపుకోట అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల ధర్నాలు కొనసాగాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు జాతీయ రహదారిపై ఖోఖో, కబడ్డీ ఆడి నిరసన తెలిపారు. పాలకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద రంగుల ముగ్గులు వేసి, ఆటపాటలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్వతీపురం కలెక్టరేట్ వద్ద స్కిప్పింగ్, బంతితో ఆటలాడారు. అనంతరం సర్కారుకు వ్యతిరేకంగా గీతాలు ఆలపించారు. కురుపాంలోనూ ఆటపాటలు, నృత్యాలతో నిరసన తెలిపారు. గరుగుబిల్లిలో కోలాటంతో నిరసన ప్రదర్శన చేపట్టారు. వారికి ప్రజా సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో అంగన్వాడీలు నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని కలెక్టరేట్ ఎదుట కార్యకర్తలు, ఆయాలు కబడ్డీ ఆడారు. గిద్దలూరులో తెల్ల టోపీలు పెట్టుకుని మా నెత్తిన ప్రభుత్వం టోపీ పెట్టిందంటూ నిరసన వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు కేంద్రాల్లో కబడ్డీ, సాంస్కృతిక కార్యక్రమాలతో హోరెత్తించారు. 'మీరిచ్చిన హామీనే మరిచిపోయారా జగన్..' అంటూ పాటలు పాడి.. ఆటలు ఆడి నిరసన గళాన్ని వినిపించారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద కొనసాగుతున్న శిబిరంలో అంగన్వాడీలంతా కబడ్డీ ఆడారు.

రుషికొండ, కార్తీకవనంపై నివేదికలివ్వండి

▸▸ ఏపీ కోస్టల్ జోన్ అథారిటీకి కేంద్ర అటవీశాఖ ఆదేశం

విశాఖపట్నం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కోస్టల్ రెగ్యులేషన్ జోన్(సీఆర్‌జడ్) చట్టాన్ని ఉల్లంఘిస్తూ విశాఖ నగరానికి ఆనుకుని ఉన్న రుషికొండ, కార్తీకవనం (రాడిసన్ బ్లూ హోటల్)లో నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదు మేరకు పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ, ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీని ఆదేశించింది. ఈ మేరకు డిసెంబరు 22న లేఖ రాసింది. ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రుషికొండపై ప్రకృతి విధ్వంసానికి పాల్పడి, సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించారని విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ వేర్వేరుగా దాఖలుచేసిన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరుగుతున్నదని ఈ లేఖలో ప్రస్తావించింది. హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ నిపుణుల కమిటీ ఇటీవల రుషికొండను సందర్శించి అధ్యయనం చేసింది. ఈ కమిటీ త్వరలో తన నివేదికను సమర్పించనుంది. ఇంకా సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘిస్తూ కార్తీకవనంలోనూ నిర్మాణాలు చేపట్టారని పీతల మూర్తి యాదవ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో రుషికొండ, కార్తీకవనంలో నిర్మాణాలపై కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ నివేదిక కోరడం ప్రాధాన్యం సంతరించుకుంది.



అనంతపురంలో అర్ధనగ్న ర్యాలీ చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పారిశుధ్య కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

▸▸ మోకాళ్లపై నిలబడి నిరసనలు .. చెత్త సేకరణ వాహనాల ముందు చలిమంటలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం 6వ రోజుకు చేరుకుంది. అనంతపురం కార్పొరేషన్‌తో పాటు ఇతర మున్సిపాలిటీల్లో కార్మికులు మోకాళ్లపై నిలబడి అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. అనంతపురం నగరంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా చెత్తను ప్రైవేటు వాహనాల్లో తరలిస్తుండగా అడ్డుకునే క్రమంలో స్థానికులతో కార్మికులు వాదనకు దిగారు. గార్బేజ్, మున్సిపల్ కార్మికులకు రూ.15వేలు ఇవ్వలేని అధికారులు ప్రైవేటు వాహనాలకు రూ.లక్షలు ఖర్చు పెడుతుండటంపై మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు మండిపడ్డారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో మున్సిపల్ కార్మికులు వంటావార్పు చేయగా, ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు ధర్నాలో ఉన్నవారిని పోలీసుల సహాయంతో బలవంతంగా బయటకు తీసుకొచ్చారు. దీన్ని కార్మికులు అడ్డుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. కడప కార్పొరేషన్ ఎదుట, జమ్మలమడుగు, బద్వేలులో మున్సిపల్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. బద్వేలులో చెత్త పేరుకుపోవడంతో ప్రైవేటు వ్యక్తులతో తీయించేందుకు ప్రయత్నించగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణను కార్మికులు అడ్డుకున్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో మున్సిపల్ కార్మికులు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. రాజంపేటలో భిక్షాటన చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు, పార్వతీపురంలో ఇంజనీరింగ్ విభాగం కార్మికులతో కలిసి అర్ధనగ్న ప్రదర్శనతో ర్యాలీ చేశారు. పాలకొండలో ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలిపారు. ఒంగోలు నగరంలో ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయిస్తుండగా కార్మికులు అడ్డుకున్నారు. రోడ్లపైనే చెత్త సేకరణ వాహనాల ముందు చలిమంటలు వేసి నిరసన తెలిపారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా తోపులాట జరిగి, కొంత ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకొంది. పలువురు ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కనిగిరిలో విధుల్లోకి వెళ్లిన ఔట్ సోర్సింగ్ కార్మికులను అడ్డుకున్నారు.

జగన్ పాలనలో అన్నీ బ్లాక్ డేస్

▸▸ సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ ధ్వజం

▸▸ అనంతలో నల్ల దుస్తుల్లో నిరసనలు

▸▸ 12వరోజూ కొనసాగిన ఆందోళనలు

అనంతపురం విద్య, డిసెంబరు 31: జగన్ నాలుగున్నరేళ్ల పాలన మొత్తం ఉద్యోగులకు బ్లాక్ డేస్ అని సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ నాయకులు ధ్వజమెత్తారు. సమస్యల పరిష్కారం కోరుతూ అనంతపురంలోని కలెక్టరేట్ వద్ద వారు చేపట్టిన సమ్మె 12వరోజు ఆదివారం కొనసాగింది. సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ విజయ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లదుస్తులు ధరించి, నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విజయ్ మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో ఉద్యోగులు, టీచర్లకు మంచిరోజే లేదన్నారు. అన్నివర్గాల ఉద్యోగులకు చీకటి రోజులేనన్నారు. అందుకే నలుపు డ్రెస్సుల్లో నిరసన తెలుపుతున్నామన్నారు. సీఎం ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికైనా సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేవరకూ సమ్మె చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.



నల్లదుస్తుల్లో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు, నాయకులు

మీ సమస్యలు పట్టించుకోరు!

▸▸ జగన్ ఎన్నికల మూడ్లో ఉన్నారు.. కార్మిక సంఘాల నేతలతో వైసీపీ ఎమ్మెల్యే చెన్నకేశవ ఆసక్తికర వ్యాఖ్యలు

ఎమ్మిగనూరు, డిసెంబరు 31: "ఏ సీటులో ఎవరిని పోటీకి పెట్టాలి. ఎవరిని తీసెయ్యాలి. డబ్బులు ఎక్కడ నుంచి తెచ్చుకోవాలి. ఎన్నికలు ఎలా నడపాలనే మూడ్లో సీఎం జగన్ ఉన్నారు. ప్రజా సమస్యలకు ఎన్నికలయ్యాకే పరిష్కారం దొరుకుతుంది. ఇప్పట్లో ఆయన పట్టించుకోరు" అని ఎమ్మిగనూరు వైసీపీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం సమ్మెలో ఉన్న మున్సిపల్ కార్మికులు సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చేందుకు ఆయన ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్మిక సంఘాల నాయకులతో పైవిధంగా మాట్లాడారు. ఆరు నెలల ముందు చేయాల్సిన సమ్మె ఇప్పుడు చేస్తే ఎలా అని ప్రశ్నించారు. దీనిపై కార్మిక సంఘాల నాయకులు గోవిందు, రాముడు, రాజు, ప్రసాద్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నామని, అయినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఎన్నికల కోడ్ వస్తే తమ సమస్యలు పరిష్కారం కావని ఆవేదన వ్యక్తం చేశారు.

కూలీ నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వరకూ.. హైదరాబాద్‌లో డ్రగ్స్ స్మగ్లర్లు, వాడకందారుల అరెస్టు

- కొత్త సంవత్సర వేడుకల కోసం ఢిల్లీ నుంచి 'సరుకు'
- పట్టుకున్న వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్.. 7.5లక్షలు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, రాజేంద్రనగర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువు కోసం వెళ్లి అలవాటుపడిన వారొకరైతే.. కొత్త సంవత్సరాన్ని మత్తుగా ఆహ్వానించాలనుకున్నవారు మరొకరు.! కూలీకి వచ్చి దందా సాగిస్తున్నవారు ఇంకొందరు.. మొత్తం నాలుగు వేర్వేరు ఘటనల్లో హైదరాబాద్‌లో పలువురు డ్రగ్స్ విక్రేతలు, వాడకందారులు పోలీసులకు పట్టుబడ్డారు. కొత్త ఏడాది వేడుకలను పబ్‌లు, క్లబ్‌లు, రేవ్ పార్టీల్లో 'మత్తు'గా జరుపుకోవాలనేవారికి సరఫరాదారులుగా మారి అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో డిసెంబరు చివరి వారం నుంచే న్యూ ఇయర్ జోష్ మొదలైంది. దీనికోసం డ్రగ్స్, గంజాయి స్మగ్లర్లు పలువరు తమ వినియోగదారులను కలుసుకొన్నారు. కొన్ని రోజుల కిందటే ఈవెంట్ల నిర్వాహకులు, స్మగ్లర్లు మాదకద్రవ్యాలను దిగుమతి చేసుకునే పనిలో పడ్డారు. సమాచారం తెలిసి వారం రోజులుగా విక్రయ ముఠాలను పట్టుకోవడంలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఆదివారం ఒక్క రోజే హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో పలు ముఠాల ఆటకట్టించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

పంజాబ్ వెళ్లి.. డ్రగ్స్‌కు అలవాటై

ఏపీలోని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన సూరెలీలా నవీన్‌సాయి 2019లో పంజాబ్‌లో బీటెక్ చేస్తుండగా స్నేహితుల ద్వారా డ్రగ్స్ అలవాటయ్యాయి. వీటికోసం మనీ వ్యూ జస్ట్ మనీ, ధని, ట్రూ బ్యాలెన్స్, పేటీఎం పోస్టు పెయిడ్ వంటి యాప్స్‌లో రుణాలు తీసుకున్నాడు. తిరిగి చెల్లించకపోవడంతో యాప్ నిర్వాహకుల నుంచి వేధింపులు మొదలయ్యాయి. దీంతో తన వ్యసనం తీరేందుకు, సులభంగా డబ్బు సంపాదించేందుకు డ్రగ్స్ అమ్మకమే మార్గమని భావించాడు. గుంటూరుకు చెందిన స్నేహితుడు వీర సాయితేజను కలుపుకొన్నాడు. తమకు విక్రయించే వ్యక్తి ద్వారా ఢిల్లీలోని డ్రగ్ పెడ్లర్ కాంటాక్టు సంపాదించారు. అక్కడినుంచి తెచ్చి హైదరాబాద్‌లో అమ్ముతున్నారు. న్యూ ఇయర్ వేడుకలకు డ్రగ్స్ డిమాండ్ ఉండటంతో డిసెంబరు 12వ తేదీన రూ.7.50 లక్షల విలువైన ఎండీఎంఏ, కొకైన్, బ్రౌన్ షుగర్ కొన్నారు. ఎండీఎంఏ గ్రాము రూ.2 వేలకు కొని రూ.6-8 వేలకు, కొకైన్ గ్రాము రూ.10 వేలకు కొని రూ.17వేలకు, బ్రౌన్ షుగర్ రూ.5 వేల చొప్పున కొని రూ. 10 వేలకు విక్రయిస్తున్నారు. జూబ్లీహిల్స్‌లోని టానిక్ లిక్కర్ మార్ట్ వద్ద కస్టమర్స్ కోసం వేచి ఉన్న నవీన్‌సాయి, వీర సాయితేజను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు జూబ్లీహిల్స్ పోలీసులతో కలిసి అరెస్టు చేశారు. 100 గ్రాముల ఎండీఎంఏ, 11.6 గ్రాముల బ్రౌన్‌షుగర్, 2 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.7.50 లక్షలు. అలాగే, రాజేంద్రనగర్ సర్కిల్ భవానీ కాలనీ కెన్వర్త్ విల్లాస్‌లో నివాసం ఉండే సంధ్య (26) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. అదే ప్రాంతానికి చెందిన స్నేహితులు డేవిడ్(23), అర్జున్ (25)తో కలిసి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బెంగుళూరు నుంచి ఎండీఎంఏ డ్రగ్స్‌ను తెప్పించుకున్నారు బాలానగర్ ఎస్‌వోటీ, రాజేంద్రనగర్ పోలీసులతో కలిసి.. సంధ్య నివాసంలో శనివారం రాత్రి దాడులు నిర్వహించి 8 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.86వేలు ఉంటుందని రాజేంద్రనగర్ ఎస్‌ఐ రమేశ్ తెలిపారు. డేవిడ్, అర్జున్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఏడాది చివరి రోజు మద్యం అమ్మకాలు రూ. 40కోట్లు?

సంవత్సరంలో చివరి రోజు.. అదీ ఆదివారం.. ఒక్క రోజే హైదరాబాద్‌లో మద్యం విక్రయాలు రూ.40 కోట్లు దాటినట్లు అంచనా. నిరుడు ఇది రూ.37.7 కోట్లు మాత్రమే. రాష్ట్రవ్యాప్తంగా నిరుడు డిసెంబరు 31న రూ.216 కోట్లు అమ్మకాలు జరిగాయి. ఈసారి రూ.260 కోట్లు దాటుతుందని అంచనా. హైదరాబాద్‌లో మందుబాబులు ఉదయం నుంచే వైన్ షాప్‌ల వద్ద క్యూ కట్టారు. రాత్రికి ఈ రద్దీ మరింత పెరిగింది.

గుట్టుగా దోపిడీకి షురూ!

- ఇసుక ఒప్పందాల్లో జగన్నాటకం
- డిసెంబరు 11న ప్రతిమ, జీసీకేసీతో అగ్రిమెంట్
- అదే రోజు నుంచే అమ్మకం బాధ్యతలు
- కానీ 22న కలెక్టర్లకు గనుల శాఖ ఉత్తర్వులు
- రెండేళ్ల కాలవ్యవధితో కాంట్రాక్టు
- పర్యావరణ అనుమతులపై సందేహాలు
- ఈ కంపెనీలు ఇచ్చే రాయల్టీ ఎంతో?
- వివరాలు రహస్యంగా ఉంచిన సర్కారు
- గుట్టు రట్టవుతుందనే భయమా?
- జీఎస్టీ నంబరు లేకుండానే రహదారి బిల్లులు
- ముఖం చాటేస్తున్న గనుల శాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వానికి వేల కోట్ల ఆదాయం తెచ్చిపెడుతున్న ఇసుక అమ్మకాల వ్యవహారం అంతా రహస్యం! దేశ అంతర్గత భద్రతకు మించిన పరమ రహస్యం అన్నట్టుగా సర్కారు దాచిపెట్టి జగన్నాటకమాడుతోంది. 2023-25 కాలవ్యవధిలో రెండేళ్లకు ఇసుక అమ్మకాలకు సంబంధించి కంపెనీలతో ఒప్పందాలు, అవి ప్రభుత్వానికి ఇచ్చే రాయల్టీ తదితర వివరాలన్నీ గుట్టుగా ఉంచుతోంది. తెలంగాణకు చెందిన ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, రాజస్థాన్‌కు చెందిన జీసీకేసీ కంపెనీలతో డిసెంబరు 11న జగన్ సర్కారు సీక్రెట్‌గా ఒప్పందాలు చేసుకుంది. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ఒక రోజు ముందుగానే వెల్లడించింది. తక్షణం అంటే.. అదే రోజు నుంచి ఈ రెండు కంపెనీలకు ఇసుక అమ్మకం బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. కానీ డిసెంబరు 22న గనుల శాఖ ఈ విషయంపై కలెక్టర్లు, ఇతర అధికారులకు లేఖలు రాసింది. ఈ జగన్నాటకం వెనుక మరో పెద్ద రహస్యం ఉంది. అదే.. ముఖ్యమంత్రి తమ్ముడు అనిల్‌రెడ్డి వ్యవహారం. కంపెనీలు ఏవైనా ఇసుక అమ్మకాలను పర్యవేక్షించేది ఆయనే. దీంతో ఆ కంపెనీల ఆనవాళ్లేవీ బయటకు రాకుండా జగన్ సర్కారు అతి జాగ్రత్తలు తీసుకుంటోంది. టెండర్లు, కంపెనీల ఎంపిక, టెండర్ దక్కించుకున్న కంపెనీలతో సీక్రెట్ అగ్రిమెంట్లు, చివరకు వాటికి ఇచ్చిన వర్క్ ఆర్డర్లు.. అన్నీ సీక్రెట్‌గా ఉంచాలనుకుంటోంది. ప్రభుత్వ జీఓలను దాచినట్లుగానే ఇసుక కాంట్రాక్ట్ ఉత్తర్వులను రహస్యంగా ఉంచుదామనుకున్నా సాధ్యం కాలేదు. జగన్నాటకం బయటపడింది.

అంతా రహస్యం

వైసీపీ సర్కారు గతంలో జేపీ వెంచర్స్‌కు ఇసుక టెండర్ ఇచ్చినప్పుడు దాని విలువ ఎంతో ప్రకటించారు. నిబంధనలు, చెల్లించాల్సిన రాయల్టీ, సీనరేజీ, కన్సిడరేషన్ ఫీజులు ఎంతో ముందే ప్రకటించారు. అయితే 2023-25 కాలవ్యవధిలో ఇసుక తవ్వకాల కాంట్రాక్టు వివరాలను రహస్యంగా ఉంచుతోంది. గనుల శాఖ తాజాగా జిల్లా కలెక్టర్లకు పంపిన లేఖలో ఒప్పందం కుదిరిందని, ఆ సంస్థలు ఇసుక అమ్ముతాయని పేర్కొంది. కానీ ఫీజుల వసూళ్లు, రాయల్టీ, ఇతర అంశాల ప్రస్తావనే లేదు. కాంట్రాక్టుల విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తామని గొప్పలు చెప్పిన జగన్ సర్కారు.. ఇసుక టెండర్ల వ్యవహారంలో దాచిపెడుతోంది.

> 2023-25 రెండేళ్ల కాలవ్యవధిలో ఇసుక తవ్వకాలు, అమ్మకాలకు సంబంధించిన టెండర్ల వ్యవహారమంతా సీక్రెట్‌గా జరిగిపోయింది. జగన్ సర్కారు కంపెనీలను ఎంపిక చేసి అమ్మకం బాధ్యతలు కూడా అప్పగించింది. ఉత్తర్వులు కూడా జారీ చేసింది. అయితే వివరాలు మాత్రం రహస్యం! రాయల్టీ, ఫీజులు ఎంతో.. ఏవీ వెల్లడించడం లేదు. కీలకమైన పర్యావరణ అనుమతుల విషయంపై కూడా గప్‌చుప్!

ఆ రెండు సంస్థలకు వర్క్ ఆర్డర్

రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు, అమ్మకాల టెండర్లను రెండేళ్ల కాలవ్యవధితో మూడు ప్యాకేజీలుగా పిలిచారు. 18 జిల్లాలున్న 1, 3 ప్యాకేజీలను ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు, మరో 8 జిల్లాలున్న 2వ ప్యాకేజీ జీసీకేసీ ప్రాజెక్ట్స్ అండ్ వర్క్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి ఇచ్చారు. ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' నవంబరు 25న వెలుగులోకి తీసుకొచ్చింది. డిసెంబరు 11వ తేదీన ఈ రెండు కంపెనీలతో గనుల శాఖ ఒప్పందం చేసుకుంది. అదే రోజు (2023 డిసెంబరు 11) నుంచి రెండేళ్ల పాటు ఇసుక తవ్వకాలు, అమ్మకాలు జరిపేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రక్రియ కూడా అత్యంత రహస్యంగానే జరిగింది. ఇదే అంశాన్ని ఇటీవల 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఒప్పందాలు పూర్తయ్యాయి కాబట్టి, అగ్రిమెంట్ కుదిరిన రోజు నుంచే ప్యాకేజీల వారీగా ఆయా జిల్లాల్లో ఆయా సంస్థలు ఇసుక తవ్వకాలు, అమ్మకాలు చేస్తున్నట్లుగా పరిగణించాలని గనుల శాఖ డైరెక్టర్ డిసెంబరు 22వ తేదీన జిల్లాల కలెక్టర్లు, గనుల శాఖ అధికారులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)కు లేఖ రాశారు. కాంట్రాక్టు దక్కించుకున్న ప్రతిమ కంపెనీ తెలంగాణకు చెందిన మాజీ ఎంపీ, బీఆర్ఎస్ ముఖ్యనేత బోయినపల్లి వినోద్‌కుమార్ సోదరుడు శ్రీనివాసరావుది. ఆయన తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు స్వయానా మేనల్లుడు. అంటే.. 2 రెండు ప్యాకేజీల కింద 18 జిల్లాల్లోని ఇసుక వ్యాపారం ముఖ్యమంత్రి జగన్‌కు సన్నిహితులైన వారి కంపెనీకే దక్కిందన్న మాట. నిజానికి ఆ సంస్థకు ఇంతకుముందు ఇసుక వ్యాపారం చేసిన అనుభవం లేదు. టెండర్ నిబంధన ప్రకారం ఇసుక వ్యాపారంలో పూర్వానుభవం ఉండాలి. అయినా, ఆ కంపెనీకి టెండర్ ఇచ్చారు. రాజస్థాన్‌కు చెందిన జీసీకేసీదీ అదే చరిత్ర. ఇసుక వ్యాపారంలో పూర్వానుభవం లేకున్నా టెండర్ దక్కించుకుంది. నిజానికి జీసీకేసీ రాజస్థాన్‌దే అయినా తమిళనాడులో రిజిస్టర్ అయిన కంపెనీ. అదీ అసలు లోగుట్టు.



జీఎస్టీ నంబర్ లేకుండానే..

ఇసుక టెండర్లు దక్కించుకున్న ప్రతిమ, జీసీకేసీలు ఇసుక తవ్వకాలు, అమ్మకాల వ్యాపారం మొదలుపెట్టాయి. ప్రతిమ గ్రూపు 18 జిల్లాలు.. శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి, కోన సీమ, కాకినాడ, తూర్పుగోదావరి, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలలో ఇసుక అమ్మకాలు చేపట్టింది. జీసీకేసీ సంస్థ పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఇసుక అమ్మకాలు ప్రారంభించింది. అయితే ఈ సంస్థ ఇసుక అమ్మకాల సందర్భంగా ఇచ్చే రహదారి బిల్లులపై కీలకమైన జీఎస్టీ నంబర్‌ను ముద్రించలేదు. ఆ సంస్థ జీఎస్టీ నంబరు తీసుకోకుండానే ఇసుక వ్యాపారం మొదలుపెట్టిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని గనుల శాఖ చూసీచూడనట్టు వదిలేస్తోంది.

పర్యావరణ అనుమతుల సంగతేంటి?

వచ్చే రెండేళ్ల కాలవ్యవధిలో ఇసుక తవ్వకాలు జరిపేందుకు విధిగా పర్యావరణ అనుమతులు ఉండాలి. కొత్తగా పర్యావరణ అనుమతులు లేకుండానే టెండర్లు నిర్వహించారు. ఇదే అంశంపై ఓ వ్యక్తి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. అనుమతులు తీసుకున్నాకే ఇసుక తవ్వకాలు చేపట్టాలని ఇటీవల కోర్టు ఆదేశించింది. ఇదే అంశంపై ఇటు గ్రీన్ ట్రిబ్యునల్‌లోనూ పలు కేసులు విచారణలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇసుక తవ్వకాలకు పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతులు ఇచ్చిందా? లేదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

> **అంతా గోప్యత**
>
> ఇసుక అమ్మకాలను ముఖ్యమంత్రి సోదరుడు అనిల్‌రెడ్డి స్వయంగా చేపట్టనున్నారని వార్తలు వచ్చినప్పటి నుంచి సర్కారు ఇసుక టెండర్ల విషయంలో ఎక్కడా లేని గోప్యత పాటిస్తోంది. ఈ సారి టెండర్ల బాధ్యత కేంద్ర సంస్థకు ఇచ్చినప్పటి నుంచి కంపెనీలను ఎంపిక చేయడం, వాటితో ఒప్పందాలు కుదుర్చుకోవడం, వర్క్ ఆర్డర్‌లు ఇచ్చేవరకు అన్నింటిని అత్యంత రహస్యంగా ఉంచారు. ఇసుక విషయంలో ప్రభుత్వ పెద్దలు ఎందుకు గోప్యత పాటిస్తున్నారు? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జగన్ నిర్ణయాలతో డిస్కమ్‌లపై పెనుభారం

- పీపీఏల రద్దుతో 16,000 కోట్ల అప్పు
- ఆలస్యంగా చెల్లింపులపై అదనంగా వడ్డీ భారం మరో రూ.1800 కోట్లు
- సంప్రదింపులతో 'లెక్క' తేల్చాలన్న సీఎం
- అప్పుల భారానికి బాధ్యత ఎవరు?

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యుత్ రంగం ఒప్పందాల విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు డిస్కమ్‌లకు భారంగా మారాయి. పీపీఏల రద్దుతో డిస్కమ్‌లపై దాదాపు రూ.16,000 కోట్ల అప్పుల భారంగా పడగా... ఆలస్యంగా చెల్లింపులు చేసినందుకు అపరాధ వడ్డీ కింద మరో రూ.1800 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ ప్రోత్సాహకాల్లో భాగంగా సంప్రదాయేతర ఇంధన వనరుల ఉత్పత్తి సంస్థలతో గత ప్రభుత్వ హయాంలో చేసుకున్న ఒప్పందాలపై జగన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. యూనిట్‌కు రూ.4.84 చొప్పున విద్యుత్తు కొనుగోలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందాలు రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంది. ఒకసారి విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నాక వాటిని కచ్చితంగా అమలు చేయాల్సిందేనని కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ రాష్ట్రానికి స్పష్టం చేసింది. దీంతో సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తి సంస్థలతో కొనుగోలు ఒప్పందాలను పునఃసమీక్షించాలని ఇంధన శాఖను ఆదేశించారు. కానీ ధరల పునఃసమీక్షకు సంప్రదాయేతర ఇందనోత్పత్తి సంస్థలు ముందుకు రాలేదు. హైకోర్టును ఆశ్రయించాయి. యూనిట్‌కు రూ.2.44 చెల్లించాలంటూ సింగిల్ జడ్జి ఆదేశాలు ఇచ్చారు. ఉత్పత్తి సంస్థలు దీనిపై సవాల్ చేయడంతో ఒప్పందాన్ని అమలు చేయాల్సిందేనని హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. ఈ నిర్ణయంతో.. విద్యుత్తు సంస్థలకు దాదాపు రెండున్నరేళ్ల పాటు విద్యుత్తును తీసుకోకుండానే ఫిక్స్‌డ్ చార్జీలను చెల్లించాల్సిన బాధ్యత డిస్కమ్‌లపై పడింది. డిస్కమ్‌లు దాదాపు రూ.16,000 కోట్ల రుణాన్ని తీసుకుని సంప్రదాయేతర ఇందనోత్పత్తి సంస్థలకు పన్నెండు వాయిదాల్లో చెల్లించాయి. తమకు సకాలంలో డబ్బులు చెల్లించనందున అపరాధ వడ్డీ కింద రూ.1800 కోట్లు ఇవ్వాలని తాజాగా డిస్కమ్‌లపై సంప్రదాయేతర ఇందనోత్పత్తి సంస్థలు ఒత్తిడి పెంచాయి. ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల కారణంగా రాష్ట్ర డిస్కమ్‌లపై ఏకంగా రూ.17,800 కోట్ల మేర భారం పడిందని నిపుణులు విమర్శిస్తున్నారు. ఇదే సమయంలో బయటి నుంచి విద్యుత్తు కొనుగోలు చేయడం వల్ల మరో రూ.12,000 కోట్ల మేర భారం పడిందంటున్నారు. ముఖ్యమంత్రి జగన్ ఈ నష్టాలకు బాధ్యత వహిస్తారా అని రాజకీయపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ భారాన్నంతటిని ట్రూఅప్ చార్జీల కింద వినియోగదారులు భరిస్తున్నారు. ఇంతకాలం గుంభనంగా ఉన్న ఈ వ్యవహారంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అపరాధ వడ్డీ వ్యవహారంపై 'లెక్క' తేల్చేయాలని సీఎం జగన్ నుంచి ఇంధన శాఖకు గ్రీన్ సిగ్నల్ రావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన సంప్రదాయేతర ఇంధన సంస్థలకు ప్రోత్సాహకాల రద్దుకు గతంలో నిర్ణయించినా న్యాయస్థానాలు నిలువరించాయి.

మంత్రి మేరుగ వేధించారు

- నాగార్జునపై వైసీపీ నేత ఆరోపణలు
- అధికార పార్టీలో ఉండే పరిస్థితి లేదని వెల్లడి
- పార్టీకి రాష్ట్ర ప్రచార కార్యదర్శి మురళీకృష్ణ రాజీనామా

వేమూరు, డిసెంబరు 31: వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, రాష్ట్రస్థాయి ప్రచార కార్యదర్శిగా ఉన్న బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గానికి చెందిన వేమూరి మురళీకృష్ణ తన పదవికి, పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మంత్రి మేరుగ నాగార్జున వైఖరిపై మండిపడ్డారు. కార్యకర్తలతో పాటు తనను కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పార్టీ కోసం అహర్నిశలు పని చేస్తున్న తమను వదిలివేసి, పార్టీకి ఓటు వేయని మరో వ్యక్తికి స్థానిక బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ఆయన ఆదేశాల ప్రకారం తమను నడుచుకోవాలని చెప్పడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. శాసనసభ్యునిగా ఉన్న సమయంలోగాని, మంత్రి అయిన తర్వాత కానీ నియోజకవర్గ అభివృద్ధిపై మేరుగ నాగార్జున దృష్టి పెట్టలేదని విమర్శించారు. దీంతో ప్రజలకు కానీ పార్టీ అభిమానులకు కానీ సమాధానం చెప్పే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితుల్లో పార్టీలో ఇమడలేక బయటకు వచ్చినట్లు వంశీకృష్ణ ప్రకటించారు. తనతో పాటు వేమూరు, బలిజేపల్లి, వరహాపురం, అబ్బనగూడవల్లి గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీకి రాజీనామాలు చేస్తున్నట్టు తెలిపారు. అనుచరులతో చర్చించి రెండు రోజుల్లో కార్యచరణ ప్రకటిస్తామని మురళీకృష్ణ చెప్పారు. వైసీపీ నాయకులు కస్తూరి బాబూరావు, పంచాయతీ వార్డు సభ్యులు వల్లభాపురం లీలాకృష్ణ, లావు బోసు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్.. పక్కన వైసీపీ నేత!

- బాపట్లలో చర్చనీయాంశంగా మారిన ఫ్లెక్సీ
- పార్టీ మారే వ్యూహంలో బాపట్ల ఉడా చైర్మన్?



భట్టిప్రోలు, డిసెంబరు 31: రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన పార్టీలు ఉమ్మడిగా పోటీ చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం వరికూటివారిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చర్చనీయాంశంగా మారింది. వరికూటివారిపాలెం గ్రామంలో జనసేన అభిమానులు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, మాజీమంత్రి నక్కా ఆనందబాబు ఫొటోలను ముద్రించారు. వీరితోపాటు వైసీపీ నేత, బాపట్ల అర్బన్ డెవల ప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు ఫొటోను ముద్రించడం చర్చనీయాంశం అయింది. రేపల్లె నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే అయిన మల్లికార్జునరావుకు రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో బలమైన రాజకీయ నేతగా గుర్తింపు ఉంది. దీంతో ఆయన పార్టీ మారే వ్యూహంలో ఉన్నారా? అనే చర్చ సాగుతుండడం గమనార్హం.

స్మార్ట్ మీటర్లు తీసుకోవాల్సిందే!

- వినియోగదారులకు స్వేచ్ఛ లేదు .. ఈఆర్‌సీలో ఈపీడీసీఎల్ పిటిషన్

అమరావతి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు స్మార్ట్ మీటర్ల విషయంలో వినియోగదారులకు స్వేచ్ఛ లేదన్నట్లుగా డిస్కమ్‌లు వ్యవహరిస్తున్నాయి. ప్రీపెయిడ్ మీటర్లను బిగించుకోవాలా, వద్దా అనేదానిపై నిర్ణయం తీసుకునే అధికారం వినియోగదారులకు ఉందంటూ గతంలో రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) స్పష్టం చేసింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ... కేంద్ర ఇంధన శాఖ మార్గదర్శకాల్లో ప్రీపెయిడ్ మీటర్లపై స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయని, వినియోగదారులు వాటిని కచ్చితంగా తీసుకోవాల్సిందేనని ఏపీఈపీడీసీఎల్ తాజాగా ఈఆర్‌సీలో పిటిషన్ వేసింది. తాము టెండర్లు పిలిచిన సంస్థలకు.. మీటర్లను బిగించి, విద్యుత్తు వినియోగ సేకరణ బాధ్యతలను అప్పగించినందున వినియోగదారులందరూ తప్పనిసరిగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు తీసుకోవాల్సిందేనని ఈపీడీసీఎల్ పేర్కొంది. దీనిని పరిశీలించిన ఈఆర్‌సీ ఆ పిటిషన్‌ను తిరస్కరించింది. ప్రజాభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. అదానీ సంస్థకు మేలు చేసేలా డిస్కమ్‌లు ఈఆర్‌సీలో వ్యాజ్యం వేయడంపై విమర్శలొస్తున్నాయి.

సంచలనాల జనసేన

- వారాహి యాత్ర.. పొత్తుల ప్రకటన
- 2023లో కలిసొచ్చిన పవన్ వ్యూహం
- ట్రెండింగ్‌లో 'హలో ఏపీ.. బైబై వైసీపీ'
- జనసేన-టీడీపీ కేడర్‌లో పొత్తుల ఖుషీ
- వైసీపీ సర్కారుపై సమరోత్సాహం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు 2023 తిరుగులేని సంవత్సరంగా చెప్పవచ్చు. వైసీపీ ప్రభుత్వాన్ని గట్టిగా ఢీకొడుతున్న పార్టీల్లో జనసేన కీలక పాత్ర పోషిస్తోంది. తొలి నుంచి జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జనసేనాని యుద్ధం చేస్తున్నారు. 2023లో ఈ యుద్ధం తారస్థాయికి చేరింది. 2023 సంవత్సరంలో రణస్థలంలో 'యువశక్తి' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించి, పార్టీ సత్తా చాటారు. అక్కడి నుంచి ప్రతి నెలా ఏదో ఒక కార్యక్రమం ఏర్పాటు చేసి.. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూనే ఉన్నారు. ముఖ్యంగా వారాహి యాత్ర జనసేన నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని నింపిందనే చెప్పాలి. విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో వారాహి వాహనానికి ప్రత్యేక పూజలు చేసిన ప్రారంభించిన ఈ యాత్ర దిగ్విజయంగా సాగింది. మార్చిలో మచిలీపట్నంలో పార్టీ 10వ ఆవిర్భావ సభ కూడా జనసేన పార్టీకి కీలక మైలు రాయిగా నిలిచింది. తర్వాత అన్నవరం దేవస్థానం నుంచి ప్రారంభించిన వారాహి యాత్రకు అడుగడుగునా ఆదరణ లభించింది. మూడు విడతల వారాహి యాత్ర పార్టీ బలోపేతానికి ఎంతగానో ఉపయోగపడిందనడంలో సందేహం లేదు.

కుదిపేసిన నినాదం

ఏపీలోని వైసీపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న జనసేనాని పవన్ కల్యాణ్ 2023లో ఇచ్చిన 'హలో ఏపీ.. బై బై వైసీపీ' నినాదం అన్ని వర్గాల్లోకీ దూసుకుపోయింది. ప్రతి ఒక్కరి నోటా ఇదే వినిపించింది. ఈ నినాదం ప్రభుత్వంపై ప్రజల్లో మరింత వ్యతిరేకతను పెంచేలా చేసిందని జనసేన పార్టీ అంచనాకు వచ్చింది. వారాహి యాత్రలో భాగంగా అమలాపురంలో నిర్వహించిన సభలో పవన్ ఇచ్చిన ఈ నినాదం అధికార పార్టీ వైసీపీని కుదిపేసింది. అప్పటి వరకూ పవన్‌పై మంత్రులు, ఇతర నేతలతో మాత్రమే విమర్శలు చేయించిన సీఎం జగన్.. 'హలో ఏపీ.. బైబై వైసీపీ' నినాదంతో ఉలిక్కిపడ్డారు. దీంతో ఆయనే స్వయంగా రంగంలోకి దిగి పవన్‌ను టార్గెట్ చేయడం ప్రారంభించారు. వ్యక్తిగత విమర్శలకు సైతం దిగుతున్న విషయం తెలిసిందే. ప్రభుత్వంపై పోరాటంలో భాగంగా కార్యకర్తలు, నాయకులపై జరిగిన దాడులను పవన్ కల్యాణ్ ఖండించారు. అంతేకాదు.. తమ కేడర్‌పై పెట్టిన అక్రమ కేసులు వెనక్కి తీసుకోవాల్సిందేనని పట్టుబట్టి సాధించారు. విశాఖపట్నం, చిత్తూరు జిల్లాల్లో పర్యటించి కార్యకర్తలను, నాయకుల్ని పరామర్శించారు. చిత్తూరు జిల్లా ఎస్పీని నేరుగా కలిసి నాయకులపై దాడులను ఖండించారు. అధినేత నేరుగా రంగంలోకి దిగడంతో పార్టీ కేడర్‌లో మరింతగా మనో ధైర్యం పెరిగింది.

> **ఆ ఒక్క ప్రకటన..**
>
> టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు.. పవన్ పొత్తుల ప్రకటన రాష్ట్ర రాజకీయాల్ని మలుపుతిప్పింది. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో చంద్రబాబును ఉంచిన సమయంలో పవన్ విజయవాడ పర్యటన పెట్టుకున్నారు. చంద్రబాబు అరెస్టుతో సంబంధం లేకుండా ఎప్పుడో నిర్ణయించి షెడ్యూల్ మేరకు పవన్ విజయవాడలో పర్యటించాలని భావించారు. పోలీసులు రాష్ట్ర సరిహద్దుల్లో అడ్డుకున్నారు. మనస్థాపంచెందిన పవన్.. తర్వాత రోజు జైలులో చంద్రబాబును కలిసి, ఆ వెంటనే పొత్తును ప్రకటించారు. 2024 ఎన్నికల్లో జనసేన-టీడీపీ కలిసి పోటీ చేస్తాయని బహిరంగంగా చెప్పారు. పవన్ చేసిన ఈ ప్రకటన ఇటు జనసేన, అటు టీడీపీ నాయకులు, కేడర్‌లో కొండంత ధైర్యాన్నిచ్చింది. పొత్తు ప్రకటన వైసీపీని కూడా కుదిపేసింది. జనసేన-టీడీపీ పొత్తు లేకుండా చేద్దామనుకున్న వైసీపీ ప్రయత్నాలకు అడ్డుకట్ట పడింది. 2023 చివరి అంకంలో జరిగిన ఈ సంఘటన రాష్ట్ర రాజకీయాలను సైతం కీలక మలుపుతిప్పినట్టయింది. ఈ పరిణామాలే జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు 2023 సంవత్సరం తిరుగులేని ఏడాదిగా నిలిపాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


HAPPY New Year 2024
మా కస్టమర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
నూతన సంవత్సర శుభాకాంక్షలు
Vijaydigital
SPECIAL OFFERS ON* NEW YEAR SALE!
మచిలీపట్నంలో మా నూతన షోరూం త్వరలో ప్రారంభం
₹1* డౌన్ పేమెంట్‌తో 24 నెలలు* వడ్డీ లేకుండా సులభ వాయిదాలతో*
BAJAJ FINSERV 0%*
UPTO 20% CASH BACK*
BAJAJ FINSERV IDFC FIRST Bank HDB FINANCIAL SERVICES HDFC BANK
Max. Cash Back upto ₹20,000/- #*
On all Major Banks Credit Cards*
LG Life's Good.
Great Season's Carnival
It's that time of the year when joy knows no bounds, and our exclusive deals on select LG products are here to make your celebration even more spectacular.
SONY
BRAVIA XR LED
Google TV | BRAVIA CORE
Acoustic Multi-Audio | Perfect for PlayStation®5
4K HDR
X90L SERIES
Range starts from Rs. 1,29,990/-
189cm (75) • 164cm (65) • 139cm (55)
*Conditions apply
SPECIAL OFFERS!*
INSTANT CASHBACK UP TO Rs.10,000/-*
UP TO 30% OFF
BUY NOW AT Rs.3,995/-
SOUNDBAR COMBO OFFER
SAVE UPTO Rs. 42,990/-*
SAMSUNG
THE FUTURE FEST
Experience next-level viewing with AI upscaling
LLOYD A HAVELLS Brand
Khayaal jo ghar ko ghar banaye
Haier
Smarter Easier Life
OLED | QLED
POWERED BY Google TV
EXCITING OFFERS
Up TO 20% INSTANT CASHBACK*
0 DOWN PAYMENT
FIXED EMI STARTING ₹994
iPhone
₹5000* Instant Cashback on HDFC BANK Bank Cards and Easy EMI *
+
Exchange bonus up to ₹6000*
SAMSUNG Galaxy S23 Series
SAMSUNG Upgrade
Upgrade upto ₹10000*
Cash back upto ₹8000*
or Zero down payment 24 Months no cost EMI*
SAMSUNG Galaxy Z Fold 5 | Z Flip 5
24/0 & 30/0 available*
SAMSUNG Upgrade
Cash Back worth Z Fold 5 ₹7000* up grade offer ₹9000*
Cash Back worth Z Flip 5 ₹7000* up grade offer ₹7000*
or Zero down payment 24 Months no cost EMI*
HDFC BANK BAJAJ FINSERV SAMSUNG Finance+
vivo V29
Himalayan Blue | Majestic Red | Space Black
₹32,999 8GB + 128GB
₹36,999 12GB + 256GB
Surprise Gift*
10% Cash Back*
0 Down Payment*
Free with selected Mobiles*
oppo Reno10 5G
Segment-first 32MP Telephoto Camera | 3D Curved Screen
Surprise Gift*
10% Cash Back*
0 Down Payment*
Free with selected Mobiles*
FREE BAG + MOUSE*
Upto ₹4,000* Cash Back + Extended Warranty Offers available*
MacBook MacBook Air
SAMSUNG Galaxy
DELL
hp
Range Starts from ₹25,000*
Cooktop
Chimney
Microwave Oven
Wet Grinder
Geyser
Mixer
RO Water Purifier
Water Dispenser
Electric Rice Cooker
Vaccum Cleaner
KALYAN ADS
OUR STORES
Our Customer Care ✆ 0863-2268838
GUNTUR : Opp. Incometax Office, Lakshmipuram ✆ 0863-2226463, Mahatma Gandhi Inner Ring Road, ✆ 9246655559, Chandana Brothers Complex, Jinna Tower, ✆ 0863-2226464, Haier Exclusive Showroom, Revenue Complex ✆ 0863-2345559, L.G. Best Shopee, ✆ 0863-2336464, Arundelpet, Main Road ✆ 0863-2217717, 27 VIJAYAWADA : Main Road, Poranki ✆ 0866-2499008, 2499009, Bhavanipuram, Swathi Theatre, Road, Sivalayam Center, ✆ 0866-2414193, 2414194, Eluru Road, Gunadala, VIJAYAWADA, ✆ 0866-2999922
MANGALAGIRI : RR Towers, Near Old Bus Stand, ✆ 08645-233664 TENALI : Opp. Saibaba Temple Bose Road, ✆ 08644-226337, Gandhi Chowk, ✆ 08644-238827, 47 ONGOLE : Near Power Office, Prasanna Nilayam, Kurnool Road, ✆ 08592-282620, 282621, Old LIC Office Building, G.T. Road, Ramnager, ✆ 08592-282818 CHILAKALURIPET : Sai Karthik Citi Centre, G.T. Road, ✆ 9640755559, 9640855559 NARASARAOPET : Bank Street, Arundelpet, ✆ 08647-222559, 229559 PONNURU : G.B.C. Road, Beside Sajja Chandramouli Hospital, ✆ 7093335111 BAPATLA : College Road, Bapatla, ✆ 08643 - 220017 JAGGAYYAPETA : Kodhada Road, Jaggayyapeta, ✆ 9642559111, 7396476111
Opening Shortly - MACHILIPATNAM, PIDUGURALLA, TIRUVURU